సాహిత్య

# ప్రస్థానం

సెప్టెంబర్ 2019

వెల రూ. 20



ISSN No:2581-7477

సాహితీస్రవంతి



సాహిత్య ప్రస్థానం
సెప్టెంబర్ 2019

సంపుటి : 18 | సంపాదకీయం | సంచిక : 9

# అలజడి, ఆర్థిక సంక్షోభం

దేశంలో పరిస్థితులు ఏమంత బాగుండలేదని కాస్త చూడగలిగేవారందరికి అర్థమవుతోంది. వివాద గ్రస్తమైన నిర్ణయాలు, విపరీతమైన నేరాలు, వికృత వ్యాఖ్యానాలు, విడ్డూరపు పోకడలు ప్రజలను అశాంతికి గురి చేస్తున్నాయి. కొన్ని ప్రభుత్వాల నిర్వాకాలైతే మరికొన్ని సామాజిక దురన్యాయాలు. ఆలోచనా పరులే గాక ఇతరులనూ ఆలోచింపచేయగల రచయితలూ కవులు తప్పక పట్టించుకోవలసిన పరిస్థితి ఇది. కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిస్తూ రాజ్యాంగ నిర్మాతలు ఏర్పాటు చేసిన 370 వ అధికరణాన్ని పరోక్షంగా పక్కన పెట్టడమే గాక ఆ రాష్ట్ర శాసనసభ లేకుండానే రెండు ముక్కలు చేయడం, కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చడం స్వతంత్ర భారతంలో ఇంతవరకూ ఎన్నడూ జరగని ఎరగని పరిణామం. దీనిపై స్థానికుల నిరసనను అణచేయడానికి సాయుధ బలగాలు, ఆంక్షలు, అరెస్టులు సాగుతూనే వున్నాయి. అంతేగాక అక్కడ వార్తా సమాచార సంబంధాలు కూడా తెంచి వేయబడ్డాయి. దీని లోతుపాతులు పూర్వాపరాలు చర్చ చేయకుండా దేశభక్తి జాతీయత పేరిట వూదరగొడుతున్న తీరుపై లోపలి పేజీలలో సమాచారముంది. ఇక మరోవైపున ఎపి రాజధానిని అమరావతి నుంచి మార్చేస్తారన్న దుమారం, వరదలపెనా వివాదం చాలా విడ్డూరంగా నడిచింది. తెలంగాణకు వస్తే పౌరుల సమస్త కదలికలపైనా నిఘా వేసే సిఐడి కార్డు ప్రయోగించబోతున్నట్టు ప్రకటించారు. మీడియాపై రెండు రాష్ట్రాల్లోనూ అదుపాజ్ఞలు సాగుతుండగా కొన్ని మీడియా సంస్థలు కూడా పాక్షిక ధోరణులు శ్రుతి మించి విశ్వసనీతయ కోల్పోతున్నాయి. ఎపి తెలంగాణలలో కుల దురహంకార హత్యలు కంపరం పుట్టిస్తున్నాయి గాని రాజకీయాలలోనూ కులం కుళ్లు భరించలేని స్థాయికి చేరి బహిరంగ రచ్చగా మారుతున్నది. చిన్నారులపైనా అత్యాచారాలు అమానుషంగా వెక్కిరిస్తున్నాయి.

దేశం గొప్పగా ప్రగతి సాధించిందనే మోత మధ్యలో ఆర్థిక సంక్షోభం పరాకాష్టకు చేరి వ్యాపార వర్గాలకు ఉద్దీపనలు ప్రకటించవలసి వచ్చింది. రిజర్వు బ్యాంకు నుంచి నిల్వలు తీసుకోవడం అనివార్యమైంది. అయినా పెద్ద పారిశ్రామిక సంస్థలూ, వాణిజ్యవేత్తలూ, ఆర్థిక నిపుణులు ఆందోళన వెలిబుచ్చుతూనే వున్నారు. ఈ నిల్వలు తీసుకోకపోతే మనం అప్పులు తీర్చలేని స్థితికి చేరాము. కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు నిత్యకృత్యమైనాయి గాని ఆ విషయంలో దర్యాప్తులూ కేసులూమాత్రం పాక్షికంగా నడవడం మరో విపరీతం. తెలుగు రాష్ట్రాల అప్పు మొత్తం కూడా ఆందోళనకరంగానే పెరుగుతున్నది. మరోవైపున ఉద్యోగ నియామకాలు జరగక యువత నిరుత్సాహానికి లోనవుతున్నది. చిరుద్యోగుల జీతాల బకాయిలు, తొలగింపులు బెదిరింపులూ ఆందోళనకరంగా మారుతున్నాయి. తెలుగు భాషలో బోధన కొడిగట్టిపోవడమే గాక విద్యావిధానాలపైనా విమర్శలు తాండవిస్తున్నాయి. ఆత్మస్తుతిలోనూ అధినేతల భజనలోనూ మునిగితేలే పాలకపార్టీలకూ స్తోత్ర పాఠాలతో పదవులు ప్రయోజనాలు పొందాలనుకునేవారికి కుల, మత, ప్రాంతీయ సంకుచితత్వాలలో మునిగితేలేవారికి ఇవన్నీ సమస్యలు గాక పోవచ్చు. కాని విశాల ప్రజాస్వామిక కోణంలో లౌకికతత్వం, మతసామరస్యం కోరే వారందరికీ ఇవి తీవ్ర హెచ్చరికలే. వాటిపై ప్రజలను పారాహుషార్ అంటూ పాలకులకు తస్మాత్ జాగ్రత్త చెప్పే రచనలు రావాలి. రచయితలు కావాలి. ♦

సంపాదకవర్గం:
తెలకపల్లి రవి ప్రధాన సంపాదకుడు
వొరప్రసాద్ వర్కింగ్ ఎడిటర్
కె. సత్యరంజన్ ♦ చీకటి దివాకర్
గనారా ♦ శమంతకమణి
కెంగార మోహన్
కె.లక్ష్మయ్య, మేనేజర్

బొమ్మలు: తుంబలి శివాజి, చిదంబరం
గంగాధర్ వీర్ల, వెంకటేష్

కవర్ డిజైన్: బ్రౌన్

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:
సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, ఫోన్: 0866-2577248, సెల్: 9490099059
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, www.prasthanam.com
ISSN No: 2581 - 7477
సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి! తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!
1 సంవత్సర చందా రూ. 240/- ♦ 5 సంవత్సరాల చందా రూ.1000/
♦ 10 సంవత్సరాల చందా రూ. 2000/-
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada
A/c No. 52001500585, IFSC: SBIN0020343
చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

## ఈ సంచికలో ... సాహిత్య ప్రస్థానం సెప్టెంబర్ 2019

### కథలు


**ఆపరేషన్ రావణ** – బి. హేమమాలిని.................... 5
**ముత్తడు గొప్పోడు** – పులికంటి కృష్ణారెడ్డి............. 19
**ప్రేరణ** – ఆంటోని చెకోవ్
– తెలుగు: కె. ఉషారాణి.......................... 42
**పగిలిన కల** – వనజ తాతినేని.......................... 59


### కవితలు


**హఠాత్తుగా..** – డా॥ ఎన్. గోపి........................ 4
**మట్టిని నమ్ముకున్న వాడు** – చిరిగిన మంజుల........ 11
**అ'సహనం'** – డా॥ రాధేయ............................ 15
**చదవని పుస్తకం** – సునీత గంగవరపు................. 15
**లోయ నిండింది** – లోలా కోసూరి..................... 18
**నిష్క్రమణ** – పెరికెల రంగస్వామి...................... 18
**పుల్లల భాష** – మెట్టా నాగేశ్వర రావు................... 26
**నా పల్లె** – శాంతికృష్ణ................................... 26
**జీవన వృత్తి** – డా॥ బి, నాగశేషు........................ 29
**పచ్చబొట్టు** – స్వప్న మేకల............................ 35
**ఇల్లు** – నూతలపాటి సాంబయ్య........................ 40
**పెదవి విప్పి** – విజయచంద్ర............................ 41
**ఆకలి తీర్చేదెవరు?** – పంబి మురళీకృష్ణ.............. 46
**తపన** – జి. శైలమ్మ.................................... 46
**కొన్ని.. ఇంకొన్ని...** – డా. స్వర్ణలత గొట్టిపాటి........ 49
**వీధి సర్కస్** – కె. ద్వారకనాథ్......................... 63


### వ్యాసాలు


**సాహిత్య ప్రస్థానం జూలై 2019 పురస్కారాలు**......... 11
**భరద్వాజ అద్భుత కథన రూపకం 'సశేషం'**
– డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు............ 12
**కవిత్వ భాషను వింటూ....**
– రెంటాల శ్రీ వెంకటేశ్వర రావు................ 16
**సమానత్వమే వీరబ్రహ్మ తత్వం**
– జంధ్యాల రఘుబాబు .......................... 27
**ఆధునిక కథ – ప్రస్థానం** – జయంతి పాపారావు..... 30
**అంపశయ్యతో అర్ధశతాబ్ది** – తెలకపల్లి రవి........... 33
**ఆంధ్రప్రదేశ్ ముస్లింల చరిత్ర–సయ్యద్ నశీర్ అహ్మద్**
– డాక్టర్ ఇస్లావత్ భీమా నాయక్.............. 36
**కాశ్మీర్ చేరిన మోడీ – షా కౌటిల్యం**
– తెలకపల్లి రవి................................. 47
**మాటకు మనసును ముడివేసిన కవిత్వం**
– డాక్టర్ పెళ్ళూరు సునీల్ కుమార్........... 50
**సాంఘిక దురాచార చిత్రణ 'ముద్ర'**
– పొదిలి నాగరాజు............................... 53
**స్వీకారం**..................................................64
**డైరీ** ........................................................65


**కవిత**

## హఠాత్తుగా

**- డా. ఎన్. గోపి**

*పైకి అంతా బాగున్నట్టే వుంటుంది*
*అందరి మాటలు*
*పద్ధతిగానే అనిపిస్తాయి.*
*గాలిలో పావురాలు*
*ఎగురుతున్నట్టే కనిపిస్తాయి.*
*రెక్కల నీడలు మాత్రం*
*చీకటి ముద్దల్ని వర్షిస్తాయి.*

*భూమీ, సముద్రం, ఆకాశం*
*అపరిచితంగా మారుతాయి*



*చిరకాల స్నేహితాలు*
*అహితంగా పరిణమిస్తాయి.*

*అది వర్షం కూడా కాదు*
*ఒకే ఒక్క విషబిందువు చిందుతుంది.*

*మనుషులందరూ*
*శత్రువుల్లా ప్రవర్తిస్తారు.*
*సంకుల సమరాలు మొదలౌతాయి.*

*గుడిలోని పావురం*
*మసీదు శిఖరం పైనున్న*
*కపోతంతో తలపడుతుంది,*
*రక్తం*
*అమ్మటానికి కూడా పనికి రాదు.*

*నిన్నటి దాకా అతడు మనిషి*
*ఇవాళ ముక్కలైన శశి.*

కథ

# ఆపరేషన్ రావణ



- బి. హేమమాలిని
7842863899

"అమ్మాయ్! ఇలారా" అంటూ తన ముందర ఒక లెక్చరర్‌తో మాట్లాడుతున్న అమ్మాయిని పిలిచింది వసుధ. ఆమె ఒక నెలరోజుల కిందటే అనంతపురం మహిళా కళాశాలలో ఇంగ్లీషు లెక్చరర్‌గా ఎ.పి.పి.యస్సి నుండి పోస్టింగు తీసుకుని వచ్చింది. అంకితభావం కలిగిన వ్యక్తిగా వచ్చిన కొద్దికాలంలోనే అందరితో గుర్తింపు తెచ్చుకుంది. మధ్యతరగతి కుటుంబంలో పెరగడం వలన కష్టాలంటే ఏమిటో బాగాతెలుసు. అందుకే విద్యార్థినుల సమస్యలు గుర్తించి వారికి చేతనైన సాయం చేయడం, వారిని చదువులో, ఇతర కోకరికులర్ కార్యక్రమాల్లో ప్రోత్సహించడం వల్ల వారిలో కూడా మంచిపేరు సంపాదించుకుంది.

"చెప్పండి మేడమ్" అంటూ వచ్చింది ఆ అమ్మాయి.

"నీ పేరేంటి?" అడిగింది.

"బాలమ్మ మేడమ్"

"ఏ క్లాసు"

"బీయస్సి మేడమ్"

"ఊరినుంచి వస్తున్నావా? హాస్టల్‌లో ఉంటున్నావా?"

ఇక్కడే హాస్టల్‌లోనే ఉంటాను మేడమ్.

మీ నాన్న ఏంచేస్తాడు?

"మా నాన్న చచ్చిపోయినాడు మేడమ్. అమ్మ కూలిపని చేసి ఇల్లు నడుపుతుంది." తలవంచుకుని కొంచెం బాధగా చెప్పింది.

"అలాగా!" సానుభూతిగా అంది వసుధ.

ఏం మేడమ్? ఇవన్నీ ఎందుకు అడుగుతున్నావన్నట్లుగా చూసింది ఆ అమ్మాయి.

"ఏం లేదు. నీవింత చనువుగా మగవాళ్లదగ్గర ఉండటం తప్పుకాదూ?" మెల్లగా మందలించింది.

"సారు దగ్గరనా మేడమ్. సారు శానా మంచోడు మేడమ్. బాగా సాయంచేస్తాడు. తండ్రిలాంటోడు. అంటూ ఆమెవైపు అదోలా చూస్తూ సమాధానమిచ్చింది. ఆ అమ్మాయి. ఆ చూపులోని అభిప్రాయం వసుధకు అర్థమయింది. కానీ తనను చూసి ఆ లెక్చరర్ సర్దుకోవడం పట్టుబడినట్లుగా ప్రవర్తించడం – ఇవన్నీ అతని మనసులోని ఆలోచనను తెలుపుతున్నాయి. తండ్రి ప్రేమకు దూరమైన ఆ అమ్మాయికి అతనిలో నాన్న కనిపించవచ్చు. కానీ అతని కళ్లలో కనిపించిన కామవాంఛను ఆమె గుర్తించింది. అందుకే ఆ అమ్మాయిని హెచ్చరించాలని అనుకుంది.

"చూడమ్మా! నీ ఆలోచన మంచిదే కానీ వయసుకు వచ్చిన ఆడపిల్లలు తండ్రితో, అన్నదమ్ములతో కూడా అంత చనువుగా ఉండకూడదు కదా. అదే చెప్తున్నాను. మన జాగ్రత్తలో మనముండాలి". ఆ అమ్మాయికి అర్థమయ్యేంత సులువుగా చెప్పడానికి ప్రయత్నించింది. ఆ అమ్మాయి అర్థమయినట్లుగా తల ఊపి అక్కడ నుండి వెళ్లిపోయింది.

వసుధ ఆ లెక్చరర్‌ను గురించిన వివరాలు తెలుసుకుంది. ఆయనపేరు పరంధామయ్య అని, జంతుశాస్త్రం బోధిస్తాడని, రెండుసంవత్సరాలలో రిటైర్ అవుతాడనే ఉద్యోగ వివరాలు,

ఇద్దరు ఆడపిల్లలని, ఇద్దరికీ పెళ్లిళ్లు అయిపోయాయనే వ్యక్తిగత వివరాలను కూడా తెలుసుకుంది. అతని గురించి తాను తప్పుగా ఆలోచిస్తున్నానేమో అని అనుకుంది. దానికి కారణం అతనికి ఆడపిల్లలుండడమే! ఒక ఆడపిల్ల తండ్రి అలా ప్రవర్తించలేడని అభిప్రాయపడింది. అయితే మరీ గుడ్డిగా అతని మంచితనాన్ని కూడా నమ్మలేక పోయింది. అందుకే అతనిపైన ఒక కన్నువేసి ఉంచింది.

పరంధామయ్య చూడ్డానికి చాలా గంభీరంగా ఉంటాడు. హుందాగా కనిపిస్తాడు. కానీ అతనిలో ఆడపిల్లలను చూసేటపుడు అపుడపుడూ కనిపించే వెకిలితనం ఆమె కళ్లలో పడింది. అంతేకాదు, అతని ప్రవర్తనను ఏ అమ్మాయి తెలుసుకో గూడదని వారిపై ఎంతో సానుభూతి ఉన్నట్లు నటిస్తాడు. వారిని అవసరాలకు ఆదుకుంటాడు. ఎంతో ప్రేమగా వారితో మాట్లాడుతున్నట్లు నటిస్తూనే వారి భుజాలపైన చేతులు వేయడం, వారిని తాకకూడని ప్రదేశాలలో తాకడం – ఇటువంటి విషయాలనన్నింటినీ వసుధ జాగ్రత్తగా గమనించింది. మహిళా ఉపన్యాసకులపట్ల కూడా అతని ప్రవర్తనలో ఉన్న తేడాను కనిపెట్టింది. చాలాకాలం ఆయనను గమనించిన తరువాత ఒకరోజు ప్రిన్సిపల్ రాజేశ్వరిగారి వద్దకు వెళ్ళింది.

"మే ఐ కమిన్ మేడమ్" వినయంగా అడిగింది వసుధ.

"అరె! అదేంటమ్మా స్టూడెంట్‌లాగా అడుగుతున్నావు నీకు పర్మిషన్ ఎందుకు?" అంటూ ఆప్యాయంగా మందలించింది రాజేశ్వరి.

"అది కాదు మేడమ్! మీరు మీ పనులలో చాలా బిజీగా ఉంటారు కదా! అందుకే అలా అడిగాను"

"బలేదానివే! అదిసరే ఏంటి సంగతులు? మీ అమ్మానాన్నా ఎలా ఉన్నారు? నీకు ఇక్కడ ఎటువంటి ఇబ్బందీలేదుకదా!" ఎంతో ఆప్యాయంగా అడిగింది.

రాజేశ్వరీదేవి విషయంలో వసుధకు బాగానచ్చిన గుణాలలో ఇదొకటి. "ఆ!అందరూ బాగున్నారుమేడమ్! అంటూ తాను వచ్చిన విషయాన్ని చెప్పడానికి సంశయించింది. వసుధ కాలక్షేపానికి తనదగ్గరకు రాదని ఆమెకుకూడా తెలుసు. అందుకే "ఎటువంటి విషయమైనా సరే నిర్భయంగా చెప్పు". అని భరోసా ఇచ్చింది ఆమె మనసులోని సంశయాన్ని గమనించి.

''మేడమ్! పరంధామయ్య గారి గురించి మీ అభిప్రాయమేమిటి? సూటిగా విషయంలోనికి వచ్చింది వసుధ.

"ఏ విషయంలో!" కొంచెం ఆశ్చర్యం ధ్వనించే గొంతుతో అడిగింది.

"అదే మేడమ్! ఆయన అమ్మాయిలతో ప్రవర్తించే విషయంలో"

"నేను కూడా మొదట అలాగే అనుకున్నాను. కానీ ఆయన అలాంటివాడు కాదే!"

నేనూ అలాగే అనుకున్నాను మేడమ్! కానీ...." అంటూ తాను ఆయన గురించి గమనించి తెలుసుకున్న విషయాలన్నీ ప్రిన్సిపల్‌కు వివరించింది.

వసుధ మాటలు విన్న రాజేశ్వరీదేవి ఆలోచనలో పడింది. తండ్రిఅయిన ఒకవ్యక్తి ఇలా చేస్తాడని ఆమె భావించలేకపోయింది. ఆమెకు మనసంతా ఏదోబాధతో నిండిపోయింది. చివరికి ఒకనిర్ణయానికి వచ్చింది. కళాశాలలో పనిచేస్తున్న మహిళాఉపన్యాసకులందరినీ పిలిపించింది.

"ఇపుడేంచేద్దాం?" విషయమంతా అందరితో చెప్పి అడిగింది.

"మేముకూడా ఇంతకుముందే గమనించాం మేడమ్! అయితే మీరు ఊరికే అందరిపైనా చాడీలు చెబుతున్నామని అరుస్తారని చెప్పలేదు". మెల్లగా చెప్పారు వారు. ఇంతకుముందు ఒకటిరెండు సందర్భాలలో లెక్చరర్లు ఒకరితో ఒకరు తగాదాలు పెట్టుకుని తనవద్దకు రావడం, ఒకరిపైన ఒకరు చాడీలు చెప్పుకోవడం, తాను మందలించడం ఆమెకు గుర్తుకు వచ్చింది. అయితే ఇది విద్యార్థినుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం. అదే వారితో చెప్పి ఏం చేద్దామని మరొక్కసారి అడిగింది. అందరూ తమకు తోచిన సలహాను ఇచ్చారు. ఎవరెన్ని చెప్పినా నిర్ణయం తీసుకోవలసింది తనే కాబట్టి చివరకు ఒకసారి ఆయనను పిలిచి చూచాయగా ఈ విషయం గురించి చెప్పాలని ప్రిన్సిపల్ నిర్ణయించుకుంది. మరుసటిరోజు పరంధామయ్య గారిని పిలిపించింది రాజేశ్వరీదేవి.

"గుడ్‌మార్నింగ్ మేడమ్! వస్తూనే రమ్మన్నారట" అంటూ లోపలికి వచ్చాడు పరంధామయ్య.

"కూర్చోండి". చాలా సౌమ్యంగా మాట్లాడింది. ఆయన కూర్చున్న తరువాత "మీపిల్లలెలా ఉన్నారు మాస్టారూ అమ్మాయిలకు అత్తగారింట్లో ఎటువంటి సమస్యలూ లేవు కదా." తన సహజధోరణిలో కుశలమడిగింది.

"ఆ భగవంతుడిదయ. పిల్లలిద్దరికీ మంచి ఇళ్లు దొరికాయి మేడమ్" సంతోషంగా చెప్పాడు.

"నిజమేమరి.ఆ భగవంతుడి దయ ఉండబట్టే వారు ఎవరితో ఎటువంటి బాధలూ పడలేదు. అవునూ. మీ పిల్లలకు

చదువుకునే వయసులో ఏదైనా సమస్యలు ఎదురయ్యాయా"? సాలోచనగా ఆయన్నే గమనిస్తూ అడిగింది.

"అంటే"? అర్థం కానట్లుగా మొఖం పెట్టాడు.

"అదేనండీ! తోడుగా చదువుకునే పోకిరీలతోగానీ లేక చదువుచెప్పే టీచర్లతోగానీ" ముఖంలో ఎటువంటి భావాలూ కనిపించనీయకుండా చాలా ఆచితూచి అడిగింది.

ఈ రోజేంటి? ఈవిడ ఇలాంటి ప్రశ్నలడుగుతూంది అని మనసులో అనుకుంటూ, "అబ్బే అలాంటిదేమీ లేదు మేడమ్! ఒకవేళ అలాంటి వారెవరైనా ఉంటే మక్కెలిరగదన్నే వాణ్ణి గాదూ" పౌరుషంతో అన్నాడు. విషయం దారికొచ్చిందని ఆమెకు అర్థమైంది. "మరి మన కాలేజీలో చదివే అమ్మాయిలు కూడా మీ కూతుళ్లలాంటి వారే కదా! వాళ్లను బాధపెట్టేవారిని ఏం చేయాలంటారు" సూటిగా అడిగింది.

ఆమె దేని గురించి అడుగుతూందో ఆయనకు అప్పటికి అర్థమయింది. అయినా తన ప్రవర్తనలో ఎటువంటి మార్పూ కనిపించనీయకుండా, ఎంతో అమాయకంగా "ఎవరు మేడమ్ ఆ నీచుడు. నిజంగా వాడిని ఉప్పుపాతర వేయాలి" కావలసినంత ఆవేశాన్ని తెచ్చుకుని మరీ అడిగాడు.

"నిజంగా మీకు తెలియదంటారా?" వస్తున్న కోపాన్ని అదిమిపెట్టి వీలైనంత మృదువుగా అడిగింది.

"ఒట్టు మేడమ్! మీకు తెలిస్తే చెప్పండి. వాణ్ణి పోలీసులకు పట్టిద్దాం. బాగాదేహశుద్ధి చేస్తే తిక్కకుదురుతుంది వెధవకు" ఆవేశంతో ఊగిపోయాడు.

అతనెంతటి కాలాంతకుడో ఆమెకు అర్థమయింది. అయినా తనలోని భావాలను బయటికి కనిపించనీయకుండా "అవును మాస్టారూ అలాగేచేద్దాం. ఇంకా పటిష్టమైన ఆధారాలు సేకరించిన తరువాత అందరికీ విషయం చెప్తాను". అతని ముఖంలో మారే రంగులను గమనిస్తూ చాలా నిదానంగా, నిక్కచ్చిగా చెప్పింది.

పరంధామయ్య గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లైంది. ఆమె చెప్తున్న విధానాన్ని బట్టి చూస్తే తనగురించిన సమాచారం ఎవరో ఆమెకు చెప్పినట్లు తెలుస్తూంది. "ఇంత బతుకు బతికి ఇంటెనక చచ్చినట్లు'' ఇంతకాలం తన వ్యవహారం ఎవరూగమనించలేకుండా జరుపుకుని, చివరికి రిటైర్మెంట్ దగ్గర పడినపుడు ఇలా ఇరుక్కుంటానని అనుకోలేదు. అయినా ఆమె స్పష్టంగా ఎవరి పేరూ చెప్పలేదు కాబట్టి కాస్త కుదుట పడ్డాడు. ఇకపైన చాలా జాగ్రత్తగా అన్నిటినీ గమనించాలని అనుకున్నాడు.

రాజేశ్వరీ దేవి మరొక్కసారి మహిళా ఉపన్యాలకులతో ఈ విషయమై చర్చించింది. వారి మీటింగ్ జరుగుతున్నంత సేపూ మగవారంతా ఒకచోట సమావేశమయ్యారు. "ఈ ఆడంగులంతా కలిసి ఏం ఉద్ధరిస్తున్నారండీ లోపల"? వెటకారంగా అడిగాడు లెక్కలమాస్టారు భూషణం"

"ఆ! మనకు తెలియనిదేముంది మాస్టారూ నాలుగు కొప్పులు కలిస్తే ఏ షాపులో చీరలు బాగున్నాయో, మొగుడికి ఈ రోజు ఏ కూర వండిపెట్టామో ఇదేగా" ఎప్పటిలాగే వెకిలి సమాధానం చెప్పాడు పరంధామయ్య

అయితే ఈసారి ఆ మాటలలో కాస్త భయం, ఆందోళన కలిసిఉన్నాయి. అందరూ పళ్లికిలించారు. "అంతే,అంతే" అంటూ వాళ్లకు ఆడవాళ్లపైన అక్కసునంతా వెళ్లగక్కారు.

"ఏంటిమేడమ్! ఇంతసేపూ ఏదోరహస్య సమావేశం నిర్వహించినట్లున్నారు ప్రిన్సిపల్‌గారు" అంటూ ప్రిన్సిపల్ ఛాంబర్ నుండి బయటికి వచ్చిన బాటనీ లెక్చరర్ శైలజతో చాలా కాజువల్‌గా అడుగుతున్నట్లుగా రహస్య అనే పదాన్ని వత్తిపలుకుతూ అన్నాడు.

"మీకు తెలియని రహస్యాలు మాతో ఏం మాట్లాడుతారు సర్ ప్రిన్సిపల్ గారు". తానుకూడా ఆ పదాన్ని వత్తిపలుకుతూ అతని ధోరణిలోనే సమాధానమిచ్చింది.

"పొగరు". ఆమె వెళ్లినవైపు చూస్తూ గొణుక్కున్నాడు.

ఆ రోజు మీటింగులో రాజేశ్వరీదేవి జరిగిన విషయమంతా వివరించి, తరువాత చేయవలసిన పనులు ఎంత జాగ్రత్తగా చేయాలో చెప్పింది. వారికంతా బుర్ర పనిచేయడం మానేసింది. చివరికి అందరూ ఈ విషయాన్ని చాలా తీవ్రంగా ఆలోచించాలని, ఎవరికి ఎటువంటి ఐడియా వచ్చినా అందరికీ తెలపాలని నిర్ణయించు కున్నారు. అందుకోసమే "వాట్సప్"లో ప్రత్యేకంగా ఒక గ్రూపును కూడా తయారు చేసుకున్నారు. "ఆపరేషన్ రావణ" అని దానికిపేరు పెట్టుకున్నారు. దానికి ఒకకోడ్ భాషను కూడా కనుక్కున్నారు. ఒక్కొక్కరూ తమ ఐడియాలను పోస్టు చేయడం, అవి నచ్చక మరీ కొత్త ఐడియాలకోసం ఎదురు చూడటం- ఇలా కొంత కాలం గడిచింది.

కాలేజీలో ఉన్నంతసేపూ అతని చర్యలను గమనించడం, ఏ అమ్మాయిలతో చనువుగా ఉన్నాడో గమనించి వారి వివరాలు సేకరించడం మహిళా ఉపన్యాసకుల దినచర్యలో భాగమైంది. అలా గమనిస్తూ ఉంటే వారికొక విషయం అర్థమైంది. పరంధామయ్య అందరమ్మాయిలతో అంత చనువుగా

ఉండటంలేదు. ఒడ్డూ పొడుగూ బాగాఉండి, మంచి అవయవ సౌష్టవం, కనుముక్కు తీరూ బాగున్న అమ్మాయిలతోనే అతడు అలా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన తర్వాత వారికి నిజంగా చాలా అసహ్యం వేసింది. తనకూతుళ్లతో కూడా ఇలాగే ఉంటాడా అని ఆలోచించేస్థాయికి అతని ప్రవర్తనను నిందించసాగారు.

అయితే వారు ఎంత ప్రయత్నించినప్పటికీ అతని దుర్మార్గాలను బయటపెట్టగలిగిన ఒక్క ఆధారం కూడా వారికి దొరకడంలేదు. ఇటువంటి విషయాలలో సరైన ఆధారం లేకుండా ఆరోపణలు చేయడం కష్టం. అందుకే ఆ ఆధారం కోసం ఎదురు చూడసాగారు. వారి ఎదురుచూపులు ఫలించి చివరికి ఒకరోజు ఆ అవకాశం రానేవచ్చింది.

ఒకరోజు కళాశాలకు ఐ.సి.డి.యస్ అధికారులు వచ్చి ప్రిన్సిపల్‌ను కలిశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన "కిశోరీ వికాసం" అనేకార్యక్రమం ద్వారా అమ్మాయిలకు జరుగుతున్న లైంగిక వేధింపులను గురించి, బాల్య వివాహాల వలన నష్టాలనుగురించి టీనేజ్ అమ్మాయిలకు అవగాహన కలిగించడానికి డిగ్రీస్థాయిలో చదువుతున్న విద్యార్థినులకు శిక్షణ ఇప్పిస్తామని, వారి ద్వారా సమీపంలో ఉన్న స్కూలు పిల్లలకు ఈ విషయాలపై ఉన్న సందేహాలను తీరుస్తామని, దీనిని "పీర్ గ్రూప్ ట్రైనింగ్" అంటారని చెప్పారు. అంతేకాకుండా రాబోతున్న అంతర్జాతీయ బాలికా దినోత్సవం రోజు శిక్షణపొందిన అమ్మాయిలతో కళాశాలలో కూడా పోస్టర్ ప్రజెంటేషన్, ఇంకా ఇతర కార్యక్రమాల ద్వారా అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేస్తామని కూడాచెప్పారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వసుధకు, ప్రిన్సిపల్ రాజేశ్వరీదేవికి ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. మేడమ్ అంటూ పరుగున ఆమె దగ్గరకు వెళ్లింది వసుధ. కొంచెం ఓపిక పట్టమని కళ్లతోనే సైగ చేసింది రాజేశ్వరి. వారు వెళ్లిపోగానే వసుధ "ట్రైనింగుకు ఎవరిని పంపాలో నేను లిస్టొట్ చేస్తాను" అని అడిగింది. మిగిలిన వారిని కూడా పిలిచి విషయం చెప్పారు. అందరూ కలిసి పరంధామయ్య వికృతచేష్టలకు బలౌతున్న అమ్మాయిలలో ఒక 20 మందిని ఎంపిక చేశారు.

ఐ.సి.డి.యస్ అధికారులవద్ద శిక్షణ పూర్తిచేసుకుని వచ్చిన అమ్మాయిలతో ప్రిన్సిపల్, ఇతరమహిళా ఉపన్యాసకులు సమావేశం ఏర్పాటుచేశారు. ఇది కళాశాల పనిగంటలు ముగిసిన తరువాత జరిగింది. ఆ సమావేశానికి వచ్చిన విద్యార్థినులతో ప్రిన్సిపల్ ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది.

"అమ్మాయిలూ ట్రైనింగ్ ఎలా ఉంది" అడిగింది.

"చాలా బాగుంది మేడమ్". అందరూ ముక్తకంఠంగా చెప్పారు.

ఏమేం నేర్చుకున్నారు?

"చానా నేర్చుకున్నాం మేడమ్. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, మగోళ్లు మనల్ని ఎట్లామోసం చేస్తారు? మనల్ని మనం ఎట్లా కాపాడుకోవాలి? వంటి విషయాలన్నీ వివరంగా చెప్పినారు మేడమ్". ఒకమ్మాయి చెప్పింది.

"మరి మీకు ఇప్పటికైనా "ఈ విషయం" తెలిసిందా!" ఈ విషయం అనే పదాన్ని వత్తి పలుకుతూ అడిగింది.

"తెలిసింది మేడమ్" అందరూ చెప్పారు.

"మరి ఇకనుంచైనా అటువంటివి గుర్తించి అలా చేసేవాళ్లను ఎదిరిస్తారా?" ఒక్కొక్క విషయాన్ని వాళ్లకు అర్థమయ్యేలా ఎంతో జాగ్రత్తగా అడిగింది.

"అవును మేడమ్".

"సరే అయితే! మీరందరూ వెళ్లి మీతోపాటు చదువుకునే వారందరికీ ఈ విషయాలన్నీ చెప్పాలి. సరేనా"

"సరే మేడమ్"

"ఓ.కే. మీరందరూ వెళ్లండి". అని వారిని పంపించింది.

అక్కడే ఉండి ఆమె వారితో మాట్లాడుతున్న విధానాన్ని గమనిస్తున్న మహిళా ఉపన్యాసకులకు చాలా ఆనందం కలిగింది. "మీరు సూపర్ మేడమ్" అంటూ దాదాపుగా ఆమెను కౌగలించుకున్నంత పనిచేసింది హిందీ లెక్చరర్ హిమబిందు. పరంధామయ్య విషయంలో అందరూ చాలాసార్లు కలవడంవల్ల వారిమధ్య దూరం తగ్గి చనువు ఏర్పడింది. ప్రిన్సిపల్ అంటే భయంపోయి దాని స్థానంలో గౌరవం పెరిగింది.

♦♦♦

అంతర్జాతీయ బాలికా దినోత్సవం చాలా వైభవంగా జరిగింది. కార్యక్రమం సక్రమంగా జరగడానికిప్రిన్సిపల్ చాలా జాగ్రత్తలు తీసుకుంది. ఆరోజు ఎంతోమంది బాలికా సంక్షేమ అధికారులు, వివిధ యన్.జీ.ఓ సంఘాల ప్రతినిధులు కళాశాలకు అతిథులుగా వచ్చారు. వారంతా ఆడపిల్లల క్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వివిధరకాల పథకాల గురించి, ఆడపిల్లలపై జరుగుతున్న వేధింపులను నిరోధించడానికి ఉన్న చట్టాలను గురించి ఎన్నోవిషయాలు చెప్పారు. లఘునాటికల ద్వారా విద్యార్థినులకు మగవారు ఎన్నిరకాలుగా లైంగిక వేధింపులకు గురి చేస్తారో, ఎంతోమంది అమాయకులైన ఆడపిల్లలు ఎలా మోసపోతున్నారో చూపించారు.

డాక్యుమెంటరీలను ప్రదర్శించారు. కిశోరీవికాసం ద్వారా శిక్షణ పొందిన కళాశాల విద్యార్థినులు పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు అయితే దీనికి కొసమెరుపు సమావేశం ముగింపు సందర్భంలో జరిగింది. అంతవరకూ అక్కడకూర్చుని ఉన్న పరంధామయ్య వేదిక మీదకు వచ్చాడు. వచ్చీరావడంతోనే "నా బంగారు తల్లులందరూ బాగున్నారా'' అంటూ ఎంతోప్రేమను ఒలకబోశాడు. పిల్లల చప్పట్లతో హాలంతా మారుమోగింది. ఇక అక్కడినుంచీ తనకు అమ్మాయిలంటే ఎంత ప్రేమో, తన పిల్లలను ఎంత జాగ్రత్తగా పెంచాడో, వారి కోసం తానేం చేయగలడో తన నవరసనటనా కౌశలం అంతా ప్రదర్శించాడు. ప్రిన్సిపల్ రాజేశ్వరి తల పట్టుకుంది. మొహామొహాలు చూసుకోవడం మహిళా ఉపన్యాసకుల వంతైంది.

♦♦♦

విద్యార్థినులలో తాను నాటిన ధైర్యం అనే విత్తనం మొలకెత్తడాన్ని రాజేశ్వరి గమనించింది. దానికి ఋజువు ఆమెకు ఆ రోజు దొరికింది. ఆమె నమ్మకానికి బలం చేకూర్చే సంఘటన ఆరోజు జరిగింది. మహిళాదినోత్సవం మరుసటిరోజు కిశోరీ వికాసంలో శిక్షణ పొందిన 20 మంది అమ్మాయిలు ఆమెవద్దకు వచ్చారు.

"ఏంటమ్మా అందరూ ఇలా వచ్చారు?" ఆప్యాయంగా అడిగింది.

"మేడం మేము చాలా మోసపోతున్నామని మాకు అర్థమయ్యేటట్లు చేసినందుకు చాలా థ్యాంక్స్ మేడం" అంది ఒక అమ్మాయి.

"ఏ విషయంలో" చాలా నింపాదిగా అడిగింది.

"అదే మేడం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి" ఇంకో అమ్మాయి అంది. తమ భాధను ఎలా వ్యక్తం చేయాలో వారికిఅర్థం కావటంలేదు.

"ఎలా?" విషయాన్ని వాళ్ల దగ్గరినుండే రాబట్టాలనే ఉద్దేశ్యంతో అడిగింది.

"మేడం! జువాలజీ సారు శానా మంచోడనుకున్నాం. నిజంగా మా నాన్నలాగా అనుకున్నాం మేడం. కానీ ఆనాకొడుకు మమ్మల్ని ఎక్కడంటే అక్కడ తాకుతాడు మేడం. మరీ మీరంతా నా బిడ్డల్లాంటోళ్లంటాడు. ఎవురితోనైనా చెప్పుకోవాలంటే భయమయ్యేది. మాకు ఇంటర్నల్స్‌లో ఫెయిల్ మార్కులు వేస్తానని, మా క్యారెక్టర్ మంచిది కాదని మా అమ్మావాళ్లతో చెప్తానని బెదిరిస్తాడు. కానీ కిశోరీ వికాసం సారోళ్లు చెప్పింది విన్నాక ధైర్యంవచ్చింది. ఆ సారోళ్లు శానా విషయాలు చెప్పినారు మేడం. నిజంగా ఆ జువాలజీ సారును నలగదంచాలని ఉంది". అమ్మాయిలందరి కళ్లలో కన్నీళ్లు ప్రవహించాయి. అదంతా చూసిన ఆమెకు కూడా కళ్లు చెమర్చాయి.

"నేనొక మాట చెప్పనా" అనునయంగా అడిగింది.

"మీరు మా అమ్మలాంటోళ్లు మేడం. మీరు మమ్మల్ని అరుస్తుంటే మా మంచికోసమని తెలియక తిట్టుకున్నాం. ఇప్పుడు తెలిసింది మేడం". కళ్లు తుడుచుకంటూ అమాయకంగా ఆ పిల్లలు చెబుతుంటే వాళ్ల కళ్లలో కనిపించిన అభిమానానికి ఆమె చలించింది.

"మీలాగా ఇంకొంతమంది అమ్మాయిలు బలి కాకూడదని అనుకుంటున్నారా?" ప్రశ్నించింది.

"అవును మేడం". చెప్పారు.

"అయితే నేను చెప్పిన పని చేస్తారా"

"చేస్తాం మేడం" వాళ్ల కళ్లలో దృఢ నిశ్చయం కనిపించింది. ఇన్నాళ్లుగా ఆమె ఎదురు చూసిన మార్పు అదే.

రాజేశ్వరి వైట్ పేపర్లు తెప్పించింది. వారు పరంధామయ్య నుంచి ఎదుర్కున్న లైంగిక వేధింపులను గురించి వారిభాషలోనే రాయించింది. ఒకవేళ పేర్లు రాయడం ఇష్టం లేకపోతే బలవంతం లేదని చెప్పింది. కానీ వారంతా ఒక నిర్ణయానికి వచ్చి తమ పేర్లను గ్రూపు, సంవత్సరంతో పాటుగారాసి ఆమె చేతికిచ్చారు. వాళ్లకు తనపైన ఏర్పడిన నమ్మకానికి ఆమెకు చాలా ఆనందమనిపించింది. దానితోపాటుగా సమస్యకు పరిష్కారం దొరకడంతో చాలా రిలీఫ్‌గా అనిపించింది.

వాళ్ళంతా వెళ్లిపోయిన తరువాత రాజేశ్వరి మహిళా ఉపన్యాసకులందరినీ పిలుచుకురమ్మని అటెండర్‌తో చెప్పింది. వాళ్లు విషయం తెలుసుకుని నిశ్చేష్టులయ్యారు. అర్థమైన తరువాత చాలాఆశ్చర్యం కలిగింది. ఇలాంటిది జరుగుతుందని ఊహించారు కానీ ఇంత తొందరగా జరుగుతుందని అనుకోలేదు. విద్యార్థినుల ఉత్తరాలన్నింటినీ ఎంతో ఆతృతగా చదివారు. వాటిని చదువుతున్న కొద్దీ పరంధామయ్య కర్కశత్వం వారికి అర్థమైంది. అంతులేని కోపం వచ్చింది. "ఇంకెందుకు మేడం ఆలస్యం. వెంటనే పోలీసులకు ఈ విషయం చెప్పండి. అంతేకాదు. కమీషనరేటుకు ఈ కంప్లైంట్లన్నీ పంపించండి" అన్నారు. వాళ్లలోఆవేశం సరైనదే! అతడు అందుకు తగినవాడే! అయితే రాజేశ్వరీదేవి అతని కుటుంబం గురించి ఆలోచించింది. అతనికిజరిగే ఆ అవమానం అతని కుటుంబాన్ని ఛిద్రం చేస్తుంది. వారిని నలుగురిలో తలెత్తుకోనీయకుండా చేస్తుంది.

వాళ్లూ సాటి ఆడవాళ్లే కదా! అందుకే చాలా ఆలోచించి, అందరితో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చింది.

మరుసటిరోజు పరంధామయ్యను తన ఛాంబర్‌కు పిలిపించింది.

"చెప్పండి మేడం" అన్నాడతను లోపలికి వచ్చి.

"మీకు ఆరోజు చెప్పాను గుర్తుందా! కాలేజీలో అమ్మాయిలను బాధలు పెడుతున్న వాళ్లను గురించి ఆధారాలతో పాటు ముందు గా మీకే చూపుతానని". అతని ముఖంలో మారే భావాలను గమనిస్తూ అడిగింది. పరంధామయ్యకు గుండె ఆగినంత పనయ్యింది. అతనికి ఆమెగురించి బాగా తెలుసు. తప్పు జరిగితే ఎంతటి వారినైనా వదిలి పెట్టదు. పైగా ఇది సాధారణమైన తప్పుకాదు నేరం. అయినా ఏం చెబుతుందో చూద్దాం అనే తెగింపుతో "ఎవరు మేడం ఆ దుర్మార్గుడు?" అంటూ అడిగాడు. చాలా కోపంగా అడిగాననుకున్నాడు కానీ మాటల్లో భయం స్పష్టంగా కనిపించింది.

మీరే! చాలా స్పష్టంగా చెప్పింది.

"మీరు నా మీద అభాండాలు వేస్తున్నారు. నా వయసేమిటి? మీ ఆరోపణలేమిటి? ఇద్దరాడపిల్ల తండ్రిని. అంత పశువులాగా ప్రవర్తిస్తాననుకున్నారా? మీరు చాలా తప్పు చేస్తున్నారు?" మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించాడు.

"అలాగా! అయితే ఇవి చూడు. నీ దుర్మార్గాలకు సాక్ష్యాలు" అంటూ కొన్ని కాగితాలను ఆయన ముందర పడేసింది. ఆమె ఇంతకు ముందెప్పుడూ ఎవరినీ ఏకవచనంలో సంబోధించలేదు. ఎంతచిన్నవారినైనా సరే మర్యాదగా పలుకరిస్తుంది. అతని నీచత్వం తెలిసిన తర్వాత అతడికి మర్యాద ఇవ్వవలసిన అవసరం లేదని ఆమె భావించింది.

తొందరగా, ఆతృతగా వాటిని తీసుకుని చదివాడు. పళ్లు పటపట కొరికాడు. "ఈ ఆడపిల్లలకు తనపైన కంప్లైంట్ ఇవ్వగలిగిన ధైర్యం ఎక్కడినుంచి వచ్చింది". అంతలోపలే తన దుర్మార్గపు తెలివిని ఉపయోగించి ఆకాగితాలన్నింటినీ చింపేశాడు. ఆ తర్వాత నువ్వు నన్నేమీ చేయలేవనే ధీమాతో "ఏ సాక్ష్యాలు మేడం" అంటూ ఒక వంకర నవ్వు నవ్వాడు.

"నేనంత అమాయకంగా కనిపిస్తున్నానా. అవి కేవలం జిరాక్స్ కాపీలు. ఒరిజినల్స్ నా దగ్గర క్షేమంగా ఉన్నాయి. మర్యాదగా తప్పు ఒప్పుకుని నీ ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లు" గద్దించింది.

"పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా? నీ బెదిరింపులకు భయపడతాననుకున్నావా? నీవు నన్నేమీ చేయలేవు" ఇన్నిరోజులనుండీ అతను వేసుకున్న మంచితనమనే ముసుగు తొలగిపోయింది.

రాజేశ్వరీదేవికి అతని ప్రవర్తన ఆశ్చర్యం కలిగించలేదు. అతడి దిగజారుడు స్వభావాన్ని ఆమెముందే పసికట్టింది. ఇంతలో అటెండర్ వచ్చి ప్రెస్‌వాళ్లు, స్టూడెంట్ యూనియన్ లీడర్లు వచ్చినట్లుగా సమాచారమిచ్చింది.

"విన్నావు కదా! వాళ్లెందుకొచ్చారో నీకీపాటికి అర్థమయ్యే ఉంటుంది. మర్యాదగా రాజీనామా చేసివెళ్లు. లేదంటే నీ లీలలన్నింటినీ ఆధారాలతో సహా పేపర్లవాళ్లకు ఇచ్చేస్తాను. రేపుపొద్దున అందరూ చదువుకుంటారు. నీ కుటుంబం తలెత్తుకోలేదు. అంతదాకా ఎందుకు? స్టూడెంట్ యూనియన్లకు చెప్తే చాలు. గుండు గీయించి, సున్నపు బొట్లు పెట్టి గాడిదపైన ఊరేగిస్తారు. అవేమీ వద్దను కుంటే రాజీనామా చేసి మర్యాదగా వెళ్లిపోవచ్చు. నీకు ఒక సంవత్సరం కన్నా ఎక్కువ సర్వీసు లేదు. కానీ ఈ సంవత్సర కాలంలో నీవు ఎంతమంది ఆడపిల్లలజీవితాలతో ఆడుకుంటావో! అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. నీకేది కావాలో నీవే నిర్ణయించుకో!" అంటూ ఒక ఖాళీ కాగితాన్ని అతని ముఖం పైకి విసిరి కొట్టింది.

పరంధామయ్య ముఖం నల్లగా మాడిపోయింది. ప్రిన్సిపల్ చెప్పినట్లు చెయ్యడం తప్ప తనకింకో మార్గం లేదని అర్థమయింది. తనకుటుంబానికి తనవల్ల జరిగే అవమానాన్ని తలచుకుంటే భయమేసింది. తనకుజరిగే అవమానాన్ని ఊహించుకుంటే వళ్లంతా చెమటలతో తడిసిపోయింది. ఇదంతా తప్పించుకోవాలంటే రాజీనామా ఒక్కటే సరైన మార్గం. ఇలా ఆలోచించుకుని తన ఆరోగ్యం సహకరించకపోవడం వల్ల విధి నిర్వహణ సక్రమంగా చేయలేకపోతున్నానని, దయతో తన వాలంటరి రిటైర్మెంటు నిర్ణయాన్ని ఆమోదించాలని కమీషనరుకు లెటరురాసి ఆమెచేతికిచ్చి తలవంచుకుని అవమానభారంతో అక్కడినుండి వెళ్లిపోయాడు. ప్రిన్సిపల్ రాజేశ్వరి కళ్లలో విజయగర్వం నాట్యం చేసింది. ఇటువంటి కీచకులను అణిచివేయగల అస్త్రం తనచేతుల్లో ఉందని ఆమెకు ఆత్మవిశ్వాసం కలిగింది. ఆ అస్త్రం అన్యాయాన్నెదిరించగల ధైర్యమే! ఇంకే ఆడపిల్లా కూడా తనకు తెలిసి ఏ మానవ మృగం చేతుల్లో అన్యాయమవ్వ గూడదని నిశ్చయించుకుంది. తాను సాధించిన ఈ విజయం ఆమెకు వేయి ఏనుగుల బలాన్నిచ్చింది. ఆమె విజయానికి వెలుగులద్ది ప్రపంచమంచా చాటడానికా అన్నట్లు నిండు పున్నమి చంద్రుడు తూర్పుకొండనుంచి పైకి వచ్చాడు.

♦

## పురస్కారాలు

### సాహిత్య ప్రస్థానం ఆగస్టు 2019 పురస్కారాలు

| ప్రకటనల్లో కిచిడీ భాష | అభిమాన భంగం | సవాళ్ళు |
|---|---|---|
| వ్యాసం: రూ.500/- | కవితకు : రూ .700/- | కవితకు : రూ .500/- |
| రచయిత : యస్.యమ్.డి. షరీఫ్ | రచయిత : డా॥ మాటూరి శ్రీనివాస్ | రచయిత : చొక్కాపు లక్ష్మునాయుడు |

■■■

*కథకు, కవితకు సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కారం, వ్యాసానికి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

## మట్టిని నమ్ముకున్నవాడు


- చిరిగిన మంజుల

8500448513




నా గేటిచాలుతో
ఎనుమారు ముమ్మారు దున్ని
సిద్ధం చేసిన భూదేవమ్మపై
మేఘుడు వర్షిస్తుంటే
దాహంతో పిడచకట్టిన నోటికి
మట్టికుండలో నీరందినట్లు
తరించిపోతాడు రైతు

చల్లిన విత్తనాలు మొలకలుగా
తొంగి చూసినరోజు
వడిలో పసిబిడ్డను చూసినంత
ఆనందపడతాడు

మొలకలు మారాకేసి
పైపైకి వస్తుంటే
బుడి బుడి నడకలు
నడుస్తున్న బిడ్డను
చూసుకున్నట్లే పొంగిపోతాడు

ఎదిగిన తరువాత కొడుకు
తనను ఆదరిస్తాడో లేదో
తెలియకుండానే ఆశలన్నీ
వాడి మీద పెట్టుకున్నట్టు

అందిన చోటల్లా
అప్పులు చేసి
పంటను చీడ పీడలనుండి
రక్షించుకుంటూ
చేతికి రాబోతున్న పంటను చూసి
ఎదిగి కొడుకును చూసిన తండ్రిలా
మురిసిపోతుంటాడు
కలలు కంటూంటాడు

రెక్కలొచ్చిన కొడుకు
డాలర్ల వేటకు ఎగిరిపోయినా
కొడుకు మీది మమకారం పోనట్టు
చేతికి రాబోయిన పంటను
వరదనీరెత్తుకు పోయినా
తుఫాను గాలి చుట్టేసినా
మళ్ళీ పంట కోసం

విత్తనాలు సేకరించి
భూమిని దున్నడానికి
నాగలితో బయలుదేరతాడు

మట్టిని నమ్ముకున్న వాడు
మట్టిలో కలిసే వరకూ
మళ్ళీ మళ్ళీ
దున్నుతూనే ఉంటాడు
అందుకే వాడు రైతు ♦

# భరద్వాజ అద్భుత కథన రూపకం 'సశేషం'



రావూరి భరద్వాజ

- డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు
9848351517

*"లోకాన్ని ఉద్దేశించి వ్రాసిన లేఖ" మొనలేని శిఖరం, భానుమతి; సద్య స్ఫూర్తి, కన్నీరు, ఇష్టసిద్ధి, అనే శ్రవ్య నాటికలను వ్రాశారు. లోకాన్ని ఉద్దేశించి వ్రాసినలేఖ, మొనలేని శిబిరం రెండు నాటికల్లో మృత్యువే కథాంశం. ఈ రెండు నాటికలూ ఆకాశవాణి హైదరాబాద్ నుండి ప్రసారమయ్యాయి. భరద్వాజ రాసిన ఒక గొప్ప కథన రూపకం "సశేషం"*

జీవన సమరాన్ని సజీవంగా సాక్షాత్కరించుకొని సాక్షర నిరక్షర తారతమ్యం లేకుండా సకల మానవ చైతన్యాన్ని అక్షరరూపంలో ప్రత్యక్షం చేసిన భావర్షి డాక్టర్ రావూరి భరద్వాజ. నీరుకాయ ధోవతి, పైపంచ మీద వైరం కాని వైరాగ్యం, నాభినుండి వెలుతురును వెతుక్కుంటూ చుక్కల్లా చూడదలచినదాన్ని చూడవలసిన రీతిగా చూసేందుకు ప్రయత్నించే గాబరా చూపులు, మాటమాటలో మమకారాన్ని మధురంగా కురిపించే మార్దవం, సభ్యతా వాసనలకు మురిసిపోని సౌజన్యం, హృదయాన్ని హృదయంతో పలికించే సౌహార్ధం వంటి ఋషి తుల్య లక్షణాలు భరద్వాజుడి నిజనైజాలు. ఆకలితో పేగులు కనలి కనలి.. బాధల పాకుడు రాళ్లపై జారిజారి... అనుభవాల ఉలితో తనను తాను చెక్కుకున్న శిల్పాచార్యుడు భరద్వాజ. జ్ఞాన పీఠ సోపానాలను అధిరోహించడానికి వారి నవలలు; కథలు; స్మృతి ఆవిష్కరణలతో పాటు ఎన్నో శ్రవ్య నాటికలూ, నాటకాలూ అర్హత నిచ్చాయి.

మృత్యువును కథాంశంగా తీసుకొని భరద్వాజ 1963లో నాటికను వ్రాయగా అది ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి "దేశ - కాల-పాత్రలు" అనే పేరుతో ప్రసారం చేయబడింది. అప్పుడే చనిపోయిన ఒక మనిషి, గర్భస్థ శిశువు, ఆత్మ అనే పాత్రలు ఇందులో ఉన్నాయి. "ది క్లాక్" అనే ఆంగ్ల నాటిక ఆధారంగా భరద్వాజ ఈ నాటికను రచించారు.

అనంతర కాలంలో "లోకాన్ని ఉద్దేశించి వ్రాసిన లేఖ" మొనలేని శిఖరం, భానుమతి; సద్య స్ఫూర్తి, కన్నీరు, ఇష్టసిద్ధి, అనే శ్రవ్యనాటికలను వ్రాశారు. లోకాన్ని ఉద్దేశించి వ్రాసినలేఖ, మొనలేని శిబిరం రెండు నాటికల్లో మృత్యువే కథాంశం. ఈ రెండు నాటికలూ ఆకాశవాణి హైదరాబాద్‌నుండి ప్రసారమయ్యాయి. భరద్వాజ రాసిన ఒక గొప్ప కథన రూపకం "సశేషం"

సశేషాన్ని భరద్వాజ కథన రూపకం అని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో స్థల, కాలాలను రచయిత ముందుగానే పరిచయం చేస్తారు. తరువాత పాత్రలు ప్రవేశిస్తాయి. కథను కొంత నడిపాక నిష్క్రమిస్తాయి. ఈ స్థల, కాలాలను మనం విస్మరిస్తే కథాసూత్రం తెగిపోతుంది. పాత్రల మాటల్లో స్థల, కాలాల ప్రసక్తి ఎక్కువగా ఉండకపోవడం ఈ ప్రక్రియలోని విశేషం. సశేషంలో నటి, సూత్రధారుడు ప్రవేశించి పాత్రలు, స్థలాలను గూర్చి పరిచయం చేస్తారు. ఆ పరిచయంతో పాటు రచయిత, పాత్రలు చెప్పని అనేక విశేషాలను వివరిస్తారు. ఈ చరాచర జగత్తులో ఏదీ శాశ్వతం కాదు.. ఏదీ నిత్యమూ కాదు. ప్రతిదీ ఏదో ఒక నాటికి నశించి తీరవలసిందే. ఇలా పోవడాన్ని మృతి చెందడం అంటున్నారు. జీవించే అర్హత ఉన్న వారికే మరణించే అర్హత కూడా ఉంటుంది. జీవితం అందరినీ సమానంగా చూస్తుంది. మరణం ఒక నికషోపలం వంటిది. మంచి చెడ్డల తారతమ్యాలను మరణం ఇట్టే తేల్చివేస్తుంది. మరణమంటే మానవులందరూ భయపడతారు. సమస్త మానవకోటి భయపడుతుంది. మరణానంతరం ఇంతకంటే మంచి జీవితం ఉంటుందంటే నమ్మలేకపోతున్నారు. అలా ఉంటుందని వీరికి

తెలియదు. స్వతహాగా మృత్యువు భయంకరమైనదికాదు. అదొక సహజ పరిణామం. కానీ అసహజమైన జీవితం మృత్యువును భయంకరంగా చిత్రించింది. మృత్యువు ద్వారా లభించే పరమానందాన్ని మానవులకు తెలియకుండా భగవంతుడు దాచి ఉంచాడు. ప్రతి జీవీ ఏదో ఒక క్షణాన మృత్యు సన్నిధిని చేరుకోక తప్పదు. అది తెలిసినా తప్పుకోవడానికి ప్రయత్నించడం కన్నా హాస్యాస్పదం ఏముంటుంది. ఎందరెందరో బంధువులు, మిత్రులూ నీ ఇంటి కొచ్చినప్పుడు సంతోషంతో స్వాగతం చెబుతావు. అలాగే మృత్యువును కూడా మీ మిత్రుని లాగా ఎందుకు చూడలేకపోతున్నారు? ఎందుకు స్వాగతం చెప్పలేకపోతున్నారు? ఏదో ఒక నిర్దేశిత క్షణాన హితునిలాగానో.. అతిథిలాగానో.. ఆఖరికి శత్రువు లాగానో మృత్యువు నీ ఇంటికి రాక తప్పదు. మృత్యువు ఏ రూపంలో నీ ఇంటికి రావడమనేది మృత్యువు పట్ల నువ్వు అవలంబించే దృక్పథం మీద ఆధారపడి ఉంటుంది. మృత్యువు నీకు బంధువు. నీకు స్నేహితుడు. అనంతత్వమనే మహా సౌధంలోకి ప్రవేశించేందుకు మంచి వాకిలి వంటిది మృత్యువు. భగవంతుని సంసేవనంలో నిన్ను నిమగ్నం చేయడానికి మృత్యుభయాన్ని మించిన హెచ్చరిక మరొక్కటేదీలేదు. మరణం తుది నిద్ర కానేకాదు. అది తొట్టి తొలి మేలుకొలుపు మాత్రమే." అనే సందేశంతో భరద్వాజ వ్రాసిన కథన రూపకం సశేషం.

ఈ రూపక రచనా నేపథ్యాన్ని భరద్వాజ ఈ విధంగా వివరించారు. "1977 మార్చి 20న గుండెపోటుకు గురై ఉస్మానియా ఆస్పత్రిలో ఉన్నాను. 1983 జనవరి 6న రెండవసారి గుండెపోటుకు గురై నిజాం ఆస్పత్రిలో ఉన్నాను. ఈ రెండు సందర్భాలలో నేను చూసిన వాటినీ, నా దినచర్య గ్రంథంలో పదిలంగా నమోదు చేసుకున్నాను" జీవితానికీ... మరణానికీ మధ్య; చేతనకూ నిశ్చేతనకూ మధ్య జీవానికి నిర్జీవానికీ మధ్యగల సరిహద్దురేఖ సన్నగా ఉంటుంది. అయినా స్పష్టంగా ఉంటుంది. జీవించడం వేరు; మరణించడం వేరు. ఈ జీవన్మరణాల మధ్యగల సరిహద్దురేఖను ఇప్పటికి రెండు దఫాలు దర్శించి, స్పర్శించే అదృష్టం నాకు లభించింది. ఆ రేఖను దర్శించినప్పుడూ, స్పర్శించినప్పుడు నేను పొందిన అనుభూతులూ, నేనులోనైన సంవేదనలూ నాకిప్పటికీ స్పష్టంగా జ్ఞాపకమున్నాయి.

ఈ అనుభవాలనూ; అనుభూతులను ప్రాతిపదికగా చేసుకొని ఏదన్నా వ్రాద్దామన్న ఆలోచన. బెజవాడ గోపాలరెడ్డి ఓ ఉత్తరం ద్వారా నన్ను పరామర్శించారు. ఆ ఉత్తరం నన్ను కదిలించింది. ఆ ఉత్తరం నా గురించి నాకు సరికొత్త భాష్యం చెప్పింది." ఆ ప్రేరణతో 'సశేషం' కథన రూపకాన్ని వ్రాశాను.

అమృతమూర్తి అనే మంచిమనిషి గుండెనొప్పితో విలవిలలాడుతుంటే మిత్రులు ఓ ఆస్పత్రిలో చేర్చారు. ఆయనకు కొన్నాళ్లు చికిత్స జరగడం, తగ్గింది అనుకున్న సమయంలో హఠాత్తుగా ప్రాణం పోవడంతో నాటకం ముగుస్తుంది. మలిరూపంతో ప్రారంభమయ్యే ఈ నాటకాన్ని అంతరంగం, బహిరంగం అని రెండు రంగాలుగా విభజించారు. అంతరంగంలో మనోసాగరంలో ఎగిసిపడే మధనాలు; ఆలోచనలు; ఆవేదనలు వ్యక్తమైతే బహిరంగంలో పాత్రల మధ్య సంభాషణాత్మకంగా సన్నివేశం జరుగుతుంది. శ్రవ్య నాటకంగా దీనిని మలచినప్పుడు కొన్నిచోట్ల నాటకీయతను చేయడంతోపాటు అమృతమూర్తి స్వగతంగా చేశారు. ఇందులో ఒక సన్నివేశానికి భరద్వాజ గర్తమానం అనే కొత్త మాటను ప్రయోగించారు. గర్తమానమంటే భరద్వాజ మాటల్లో చెప్పాలంటే "గతకాలంలోని ఓ సంఘటనను వర్తమాన కాలంలో చెబుతున్న సందర్భాన్ని తెలియజేయడం". అంటే ఫ్లాష్ బ్యాక్.

"శరీరధారులకు మరణమనేది సహజం. జీవించడమనేది అసహజం. అందుచేత ఎవరైనా క్షణకాలంపాటు ఊపిరి తీసుకొన్నారంటే ఎంతో లాభం సంపాదించామనే అనుకోవాలి" అనే కాళిదాసు రఘువంశంలోని మాటలతో సూత్రధారుడు నాందిని చెప్పడంతో నాటకం ప్రారంభమౌతుంది. సూత్రధారుడు నటితో కలిసి ప్రస్థావనను నిర్వహిస్తాడు. ఇది నాటకం కాదు. నాటకీయత ఉన్న కథ. ఒక రకంగా ఇది సుఖాంతం. మరొక రకంగా ఇది విషాదాంతం. ఈ సుఖదుఃఖాలు రెండూ ఒకేసారి ఒకేచోట కలిసిమెలిసి కలిసిపోయి ఉండడం. ఇది పూర్తి కథకాదు. అలాగని నాటకం కాదని సూత్రధారుడు ప్రస్థావన ముగించడంతో నాటకం ప్రారంభమౌతుంది. అంతరంగం; బహిరంగం; ఒక్కొక్కసారి అంతరంగం, బహిరంగం ఏకకాలంలో జరుగుతాయి. అంతరంగం అని సూత్రధారుడు ప్రత్యేకంగా చెప్పినప్పుడు అమృతమూర్తి అంతఃచేతన వివరించబడుతుంది. సుప్తచేతనలోని భావాలకు అద్దం పడుతుంది. అమృతమూర్తి ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోగానే సూత్రధారుడు ప్రవేశించి చావు పుట్టుకల చక్రభ్రమణంలో ఇక్కడ ఒక జీవికి చరమాంకం... మరో చోట ఇప్పుడే మరొక ప్రాణికి నాందీ ప్రస్థావన. ఇక్కడ నుండి వెళ్లి మరోచోట కొత్త నాటకాన్ని ప్రారంభిద్దాం" అంటూ నాటకాన్ని ముగిస్తాడు.

“నా కోపం... ఆనందం.. నా విషాదం... నాతృప్తి.. ఆత్మ ఇవన్నీ నేను కాదు” వీటి అన్నింటిని కలుపుకొని ఉన్నప్పుడూ నేను ఉన్నాను. వీటన్నింటినీ వదిలేసినప్పుడూ నేను ఉన్నాను” ‘నేను’ అనే అహాన్ని ఛిద్రం చేసినప్పుడు మిగిలే అనంతమైన శూన్యాన్ని భరద్వాజ సశేషంలో గొప్పగా వివరించారు. ఈ పరమ సత్యాన్ని కథగా; సంభాషణగా; నాటకం లాంటికథగా, కథలాంటి నాటకంలా, కావ్యంలాంటి వాక్యంగా, శాస్త్రం గాని శాస్త్రంగా, తత్వంగాని తత్త్వంగా తనకు తోచిన రీతిని చెప్పాలనే తాపత్రయం సశేషంలో కన్పిస్తుంది. జీవన సమరంలో జీవితం కోసం జీవకోటి ఎదుర్కొనే పోరాటాన్ని కళ్లకు కట్టినట్లుగా తన రచనల్లో చూపించే భరద్వాజ సశేషంలో జీవి ఆంతరంగికంగా అనుభవించే ఆరాటాన్ని ఆ పాత మధురంగా అందరికీ అర్థమయ్యే పద్ధతిలో ఆత్మీయంగా అందించారు. ఈ తాత్విక చింతనను హృద్యంగా చిత్రించడానికి వినూత్న కథని శైలి ఎంతగానో ఉపకరించింది. ఇందులో ఒక్కొక్క చోట అనర్గళమైన కవితాధార జలపాతంలా దూకుతుంది. మరోచోట అహ్లాదమైన కథాగమనం గోచరిస్తుంది. మధ్య మధ్య హఠాత్తుగా వేదాంత చర్చ పుడుతుంది. ప్రాచ్య, పాశ్చాత్య వైద్య శాస్త్రమంతా ఒక్కొక్క చోట చీకటి గుహల్లో వెలుతురును చూపిస్తుంది. అన్నింటిలో ప్రాణవాయువుగా సంచరించే ఆత్మతత్వవిచారం “సశేషం”లో రచయితను నిర్వచించి రచించే సత్వసారం. జీవితంలో మనం సాధించాలనుకొన్నది చివరకు మనకు కాకుండా పోతుండడం కళ్లారా చూసిన పాత్రలు మన దృష్టిని అంతర్ముఖం చేస్తాయి. లోక, శోక వినాశం ద్వారా పరలోక పరమార్థాన్ని వివరించేందుకే ‘సశేషం’లోని ప్రతి శబ్దం సార్థక్యాన్ని పొందింది. ఇలాంటి సమర్థపదవిధి భరద్వాజ పెన్నిధి. మరణానంతర జీవితంలోని చిరంతన రహస్యాలను వననతొనల్లా విడమరచి చెప్పడంలో భరధ్వాజ ఆలోచనాలోచనం సార్థక్యం చెందింది. జన్మరాహిత్యం వంటి గంభీర విషయాన్ని ఇల్లు ఖాళీ చేసేటప్పుడు సామాను సర్దుకోవడం వంటి సామాన్య సంఘటనతో మేళవించి చెప్పడం భరద్వాజ కథా కథన కౌశలానికి ఒక చిన్న తార్కాణం.

భాష చెప్పినట్లు భరద్వాజ పలకలేదు. భరద్వాజ చెప్పినట్లు పలికింది. చివరిక్షణాల్లో అమృతమూర్తికి మృత్యువు సాక్షాత్కరిస్తుంది. ఆ మృత్యువులోని రమణీయ రహస్యాన్ని వివరిస్తూ “కనులెత్తి చూస్తున్న కాంతి కిరణంలా... అప్పుడే విరిసిన ఇంద్రధనసులా... మహాకవి అంతరాలలో మెదిలే సద్భావరేఖలా మహాయోగి ప్రశాంత చిత్తంలా – మహతీస్వనంలా.... శరత్ పూర్ణిమలా.. అమృత కలశంలా.. చిన్మయానందంలా.. నిశ్శబ్దంలా .... నిలువెత్తు నవ్వులా.... అన్నీ అయినట్లుగా.. ఏమీ కానట్టుగా... అంతా తెలిసినట్టుగా... ఏమీ తెలియనట్టుగా సచ్చిదానందంలా ఉన్నదట. సామాన్యులకు దూరం కాకుండా అసామాన్య భావాలను అందుకొని అందించడమే సశేషంలో కనిపించే సారస్వతమైన ఆరాటం. ఆయన జీవన పోరాటం “సశేషం”లో ఆరాటంగా మారింది. ఈ ఆరాట పోరాటాలకు అతీతమైన కువలయ లయ విన్యాసాలను వినిపించే కోలాటాన్ని కూడా భరద్వాజ తన రసధునితో మేళవించి వినిపించిన రసమయ కథన నాటకం సశేషం.

ఈ రచనలో మృత్యువు వెలిబుచ్చిన భావాలను షెర్లాక్, ట్రయాన్ ఎడ్వర్డ్స్, పుల్లర్; కార్వెల్, మిల్టన్ వంటి రచనలను భరద్వాజ స్ఫూర్తిగా స్వీకరించారు. సశేషం కథన రూపకాన్ని యస్.వి.ప్రసాద్ శ్రవ్యనాటకంగా అద్భుతంగా మలిచారు. ఈ నాటకం ఆకాశవాణి హైదరాబాద్, నుండి పలుమార్లు ప్రసారమైంది. అమృతమూర్తి పాత్రను డాక్టర్ చాట్ల శ్రీరాములు అద్భుతంగా పోషించారు. డాక్టర్ రావూరి భరద్వాజకు జ్ఞానపీఠ్ పురస్కారాన్ని అలంకరించిన వెండితెరపై మెరిసే నటీమణుల జీవితాల చీకటి వెలుగుల్ని కలైడోస్కోప్‌లో చిత్రించిన గొప్ప నవల పాకుడు రాళ్లు. ఈ నవలను మొదటి శివరామరావు నాటకీకరణ చేయగా ఆకాశవాణి హైదరాబాద్ నుండి ప్రసారం చేయబడింది. అనంతరం ఇదే నవలను జీడిగుంట రామచంద్రమూర్తి నాటకీకరించి స్వీయ సమర్పణలో ఆకాశవాణి ద్వారా ప్రసారం చేశారు. ఈ నవలలో మంజరి పాత్రను శ్రీమతి శారదా శ్రీనివాసన్ అనితరసాధ్యంగా పోషించారు.

భరద్వాజ ఒక దశాబ్దికాలం ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో నిర్వాహకునిగా ఉద్యోగించారు. శ్రవ్య మాధ్యమంపై ఆయనకు పట్టు అపారమైనది. ఈ నేపథ్యంలో శ్రవ్య నాటక రచనకు పెద్ద పీట వేశారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి ప్రసారమైన నాటకాల్లో సశేషం; పాకుడురాళ్లు శ్రవ్య నాటకాలు మైలురాళ్లుగా నిలిచాయి. జీవిత పాఠశాలలో అనుభవాలే ఉపాధ్యాయులుగా, హృదయ స్పందనలే ఆర్ద్రతగా రచన చేసిన భరద్వాజ నూటికి నూరుపాళ్లూ జ్ఞానపీఠ సుప్రతిష్ఠతకు అచ్చుమైన అర్హుడు. ♦

## అ 'సహనం'

- రాధేయ
8247523474

మాకు చినుకు అపురూపం
నీళ్ళంటే ఒక అద్భుతం

కనికరం లేని కారు మబ్బులు
కళ్ళను తప్ప నేలను తడపలేవు

అదును, పదును ఎరుగని నిస్సహాయులం.

మబ్బులు చూసి ఆశపడితే
పొలంలో పోసిన విత్తనాలన్నీ
చీమల పాలే..



ఎడారి సేద్యంలో తడారిన గొంతులు
ప్రకృతి ద్వేషం, పాలకుల మోసం వెరసి
మా 'అనంత' బీడు రైతుల వల్లకాదు

అయిదు వందలేళ్లుగా రాయల నాటి వైభవాన్ని
నెమరేసుకుంటూ,

రాగిముద్దకు, జొన్నరొట్టెకు
మొగం వాచినా  దిగుల్లేదు కానీ

కుందేళ్లు వేటకుక్కల్ని తరిమిన పౌరుషాన్ని
నెమరేసుకుంటూ
మీసాలకు సంపంగి నూనె
రాసుకుంటూ,

రాయలసీమ వాసులమని గర్వపడుతూనే ఉన్నాం
'అనంత ' ఆశాజీవులమని మురిసి పోతూనే ఉన్నాం

ఈ మురిపెం,ఈ గర్వం తెగబడే రోజులొస్తున్నాయ్.
చరిత్ర పుటల్లో సరికొత్త అధ్యాయం మొదలయ్యే
రోజులొస్తున్నాయ్. ♦

---

## చదవని పుస్తకం

- సునీత గంగవరపు
9494084576



నీవు లేని ప్రతిరాత్రీ
దుఃఖపు నదిలా సాగుతోంది
నిజం వంటి నల్లని చీకటిని
ధారగా స్రవిస్తుంది
కరుగుతున్న ఒక్కో క్షణం
కాలం దేహానికి
మాయని గాయమై
గుచ్చుకుంటుంది
ఏకాంతంలో..ఏకాగ్రతతో
మనం వింటున్న మన
గుండెచప్పుడు
ఆకస్మాత్తుగా..
మనసు విరిగినట్లు
మాట మరచినట్లు
మూగబోయింది

ఈ మధ్యనే కదా..
మన ఊసుల తోటలో
కలల మొక్కల్ని నాటుకున్నాం?
అవి విరులకు బదులుగా
విషాదాన్ని పూస్తున్నాయి..ఎందుకు?
పేజీ కూడా చదవని బతుకు పుస్తకం
ముగింపు వాక్యమై..
అపహసిస్తున్నట్లుంది..కదూ..!
రెండు మనసుల నిశ్శబ్ద సంగమంలో
పుట్టిన పసికందును
కళ్లు విప్పకుండానే..గొంతు నులిమి
చంపిందెవరు?

నిన్నటి నా నువ్వు
నేడు ఏమయ్యావు నేస్తం?
అయినా...వద్దు..
నువ్వు అక్కడే వుండు
ఆకాశం నిండా అలుముకుంటున్న
అమావాస్యను చూస్తూ..
వేళ్ల సందులగుండా జారిపోతున్న
స్మృతుల రేణువులను గణిస్తూ..

నిన్ను మన్నించను..మిత్రమా!
ఎందుకో..
ఈ నిశ్శబ్దం ఎంతో ఆత్మీయతను
ధ్వనిస్తుంది
మృత్యు గుండెల్లో ఆర్ధ్రంగా ముఖం
దాచుకున్నంత అద్భుతంగా వుంది..! ♦

## విశ్లేషణ




# కవిత్వ భాషను వింటూ....

*'మానవ జాతికి రెండు చరిత్రలుంటాయి. ఒకటి యుద్ధాలతో తారీఖులతో రాజకీయాలతోను మరొకటి సాంస్కృతిక భావాలతోను నిండి ఉంటాయి. రెండో దాన్ని కవులు, రచయితలు నిర్మిస్తారు' అన్నారొకచోట. మంచి గమనింపు. అలాగే రచనభాషకి అలంకారాలు ఎందుకు అవసరం అవుతాయో చెబుతూ ఉచ్చరించే వేళ పదాలకి ఉచ్ఛారణ, స్వర విశేషాల వల్ల జతపడే ఉద్వేగాలు లిఖిత రూపంలో కనబడవు కాబట్టి కూడా అలంకారం అవసరం అవుతుంది అని ఒక కారణం చెప్పారు. ఇది కూడా మంచి గమనింపు.*

**- రెంటాల శ్రీవెంకటేశ్వర రావు**

బొల్లోజు బాబా కవి. కవిత్వానువాదకులు కూడా. ఆ పదాలకు మంచి అనే విశేషణం చేర్చడానికి మొహమాట పడక్కర్లేదు. 'వెలుతురు తెర' చదివాక ఆయన అభిమానినయ్యాను. ఆయన విశ్లేషణ వ్యాసాలు కూడా రాస్తున్నట్టు తెలుసుగాని పెద్దగా చదవడం పడలేదు.

ఆ మధ్య పుష్పరాజ్‌గారని ఒక సాహిత్యమిత్రుడితో మాట్లాడుతున్న సందర్భంలో 'బొల్లోజు బాబా ఎవరండీ?' అని అడిగారాయన. 'ఎందుకొచ్చిందీ ఆ ప్రశ్న?' అని నేను ఎదురడిగాను. 'ఫేస్‌బుక్‌లో వారి రచనలు చదవడం మొదలుపెట్టి నిన్న రాత్రి పన్నెండింటి వరకూ మేలుకొని ఉండిపోయాను. బాగా రాస్తున్నారు' అన్నారు. ఇటువంటివి గుప్త అవార్డులు. పునాదుల్లా ఉంటాయి. భవనాల్లా పైకి కనబడకుండా. ఆ సందర్భంగా ఆయన విమర్శ వ్యాసాలు కూడా రాస్తున్నారని, బాగా రాస్తున్నారని నాకు అర్థమైంది.

ఇప్పుడు 'కవిత్వ భాష' అని ఈ పుస్తకంతో మన ముందుకు వస్తున్నారు. దీనికి అలంకార దర్శనం అనో, కవిత్వ అభివ్యక్తి పద్ధతులు అనో ఒక 'గాఢ నామం' తగిలించక కవిత్వ భాష అని పేరు పెట్టారు పొందికగా. బాబాగారిని చూస్తున్నాను కదా ఆయన అన్ని పనులలోనూ ఈ పొందిక, క్లుప్తత కనిపిస్తాయి. ఇటువంటి వాటిని ఆధునిక అలంకార శాస్త్ర పుస్తకాలు అనాలి. ఈ మాట అతిశయోక్తిగా అనిపిస్తుంది కానీ కాదు. సులక్షణ సారం వంటి పుస్తకాలు కొత్త విషయాలు ఏమీ ప్రతిపాదించకుండా అంతకు ముందు చెప్పిన ఛందోది విషయాలను ఒకచోట చేర్చి చెప్పి అంతమాత్రానే అలంకార శాస్త్ర గ్రంథాలు అనబడుతున్నప్పుడు దీన్ని అనడంలో తప్పులేదు. అయితే ఒక తేడా ఉంది. అవి నిర్దేశాత్మకాలు ఇది వివరణాత్మకం. ఆధునిక శాస్త్రాలన్నీ డిస్క్రిప్టివ్‌గానే ఉంటున్నాయి. ఇలాంటి పుస్తకాలు రెండు రకాలుగా తయారవుతాయి. రచయిత తనకు అప్పటికే బాగా తెలిసిన విషయాలను పాఠకులతో పంచుకోవడానికి రాయడం ఒకటోరకం. తాను తెలుసుకోవడానికి, తెలుసుకుని జీర్ణం చేసుకోవడానికి ప్రయత్నించే క్రమంలో రాయడం రెండో రకం. ఇది రెండో రకం రచన అని నాకు అనిపించింది. సాధారణంగా ఈ రెండో రకం రాతల్లో కొంత అస్పష్టత ఉంటుంది. కానీ ఈ పుస్తకంలో ఆ లక్షణం లేదు. పొరపాటు పడిన సందర్భాలున్నాయి తప్ప అస్పష్టత లేదు.

బాబాగారు పాశ్చాత్య అలంకార శాస్త్రం నుంచి కొన్ని అలంకారాలను అభివ్యక్తి పద్ధతులను తీసుకుని సోదాహరణంగా వివరించారు. ఇటువంటి రచనల్లో ఒక క్లేశం ఉంటుంది. తగిన ఉదాహరణలను ఎన్నుకోవడం అంత తేలిక కాదు. కొన్ని సందర్భాలలో ఆయన ఇచ్చిన ఉదాహరణలు చూశాక ఆ అవగాహనలోని ఖచ్చితత్వానికి (ప్రెసిషన్‌కి) నాకు ముచ్చటేసింది. ఆయన పఠన వైశాల్యానికి కూడా ముచ్చట పడ్డాను. చాలామంది కవుల్ని కోట్ చేశారు. విస్తృతంగా చదువుతున్నారు బాబాగారు.

ఈ అలంకార విశ్లేషణతో వదిలిపెట్టక ఆయన మరి కొన్ని విషయాలను ముచ్చటించారు. లినియేషన్ అని ఒకటి. వచన కవితలో పాదవిభజన ఎలా ఉండాలి అన్నది చర్చించారు ఒక వ్యాసంలో.

'కవిత్వంలో నిరలంకారత' అనే వ్యాసం నన్ను ప్రత్యేకించి

ఆకట్టుకుంది. ఏ అలంకారాలూ లేకుండా కవిత్వం రాయొచ్చు అని గమనింప చెయ్యడం బావుంది. ఈ నిరలంకారత 'ఒక ప్రమాద కరమైన పొలిమేర' అని బాగా చెప్పారు. కానీ మంచి కవి చేరి తీరాల్సిన ప్రదేశం కూడా ఇది. బాబాగారి ఇటువంటి కొన్ని వాక్యాలు మనని ఆకర్షిస్తాయి. 'మానవ జాతికి రెండు చరిత్రలుంటాయి. ఒకటి యుద్ధాలతో తారీఖులతో రాజకీయాలతోను మరొకటి సాంస్కృతిక భావాలతోను నిండి ఉంటాయి. రెండో దాన్ని కవులు, రచయితలు నిర్మిస్తారు' అన్నారొకచోట. మంచి గమనింపు.

అలాగే రచనభాషకి అలంకారాలు ఎందుకు అవసరం అవుతాయో చెబుతూ ఉచ్చరించే వేళ పదాలకి ఉచ్చారణ, స్వర విశేషాల వల్ల జతపడే ఉద్వేగాలు లిఖిత రూపంలో కనబడవు కాబట్టి కూడా అలంకారం అవసరం అవుతుంది అని ఒక కారణం చెప్పారు. ఇది కూడా మంచి గమనింపు.

కొప్పర్తి చిత్రలిపి అని ఒక మంచి కవిత రాశారు. దాన్ని ఉదాహరిస్తూ 'తెలుపుకూ నలుపుకూ తేడా లేకుండా పోతుంది' అన్న చివరి వాక్యాన్ని ఇలా వ్యాఖ్యానించారు బాబా. 'తెలుపుకు నలుపుకు తేడా లేకపోవడం అంటే బ్రిటిష్ పాలనకు, స్వపరిపాలనకు తేడా లేదని, అదే దోపిడీ. అదే అవినీతి, అదే అణచివేత ఇంకా కొనసాగుతున్నాయని చెప్పటం' అని. ఆ కవిత చదివినపుపడు నాకు ఈ విషయం ఎందుకో తట్టనే లేదు.

ఈ గ్రంథంలో నేను విభేదించే విషయాలు కొన్ని ఉన్నాయి. ఇటువంటి పుస్తకం నేను రాసినా ఇతరులు – ఎవరో ఎందుకు బాబాగారే– నావి కొన్ని పొరపాట్లని తేల్చవచ్చు. అంటే ఈ రచనల స్వభావం అటువంటిది. అయినప్పటికీ ఈ ముందుమాటలో కొంత చోటు వాటిలో కొన్నిటి కోసం కేటాయించడం అనుచితం కాదనీ పైగా అవసరమనీ భావించి ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఎందుకంటే ఊరికే ఆమోదించేయడం కాకుండా ఈ పుస్తకాన్ని పాఠకులు క్రిటికల్‌గా చదువుతారని. ఆ వంకన సాహిత్యవిమర్శ నిఘంటువు నొకదాన్ని తెరిచి చూస్తారని. అసలు ఈ పారిభాషిక పదాలన్నీ ఖచ్చితమైన సరిహద్దురేఖలు గియ్యడానికి కాదు. కొన్ని భావనలను గుర్తింపచెయ్యడానికి అని నేను అనుకుంటాను. తద్వారా కవులకు రచన వేళ కొన్ని అభివ్యక్తి వ్యూహాలు స్ఫురించేటట్టు చేస్తాయి ఇవి.


బొల్లోజు బాబా

కవిత్వంలో స్టేట్‌మెంట్స్ అని ఒక వ్యాసం. అందులో అతిశయోక్తిని అండర్ స్టేట్‌మెంటుని తీసుకుని వివరించారు. అండర్‌స్టేట్‌మెంట్ అన్నది బాబాగారికి సరిగా అవగతం కాలేదని నాకు అనిపించింది. 'రాయినైనా కాక పోతిని రామపాదము సోకగా, బోయనైనా కాకపోతిని పుణ్య చరితము పాడగా' అనే పాటలో అండర్ స్టేట్‌మెంటు ఉందంటారు. ఎందుకనిట. ఆ స్త్రీ తనని రాయి బోయ వంటి 'కింది' స్థాయి వస్తువులతో వ్యక్తులతో పోల్చుకున్నందువల్లనట. అండర్ స్టేట్‌మెంటు లక్షణం అదికాదు. అండర్ స్టేట్‌మెంట్ అంటే 60 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న ఎడారిలో ఉండి 'ఇవాళ కొంచెం వెచ్చగా ఉంది' అనడం లాంటిది. ఉన్న స్థితిని తగ్గించి చెప్పడం అది మంచి కానీ చెడు కానీ. అతిశయోక్తికి సరిగ్గా వ్యతిరేకం అంటే ఇలా. ప్రి ఒనెడ్ కార్స్ అనే మాటలో ఉన్నది అండర్ స్టేట్‌మెంట్ కాదు. సెకండ్ హాండ్ కార్స్ అనడంలో ఉన్న తక్కువదనాన్ని తొలగించి కాస్త మర్యాదగా చెప్పడం ఉంది. యూఫిమిజం అంటామే అది ఉంది.

95 వ పేజీలో ఐరనీకిచ్చిన ఉదాహరణ సరైనది కాదు. చంద్రునిలో మచ్చలున్నాయి కనుక సరిపోయింది. లేకపోతే ప్రతి ఒక్కడూ ఆమె ముఖాన్ని చంద్రబింబంతో పోల్చేవారే అనే వాక్యాలలో ఐరనీ లేదు. వెర్బల్ ఐరనీ అంటే ఉద్దేశించిన అర్థానికి వ్యతిరేకమైన అర్థాన్నిచ్చే పదాలు వాడడం. బుద్ధిహీనుణ్ణి పట్టుకుని బృహస్పతి అన్నట్టు. ఇటువంటి తేడాలు ఇంకా కొన్ని ఉన్నాయి.

అనువాద సాహిత్యం అనే వ్యాసం ఈ పుస్తకంలో ఇముడదు. బాబా కవిత్వానువాదం కూడా రాసిన వారు కనక అనువాదం మీద ఉన్న ప్రత్యేక ప్రీతి కొద్దీ దీన్ని చేర్చి ఉంటారు. కవిత్వేతర అనువాదాల ప్రసక్తి ఎక్కువ కావడం వల్ల ఇక్కడ అనవసరం అంటున్నాను. కవిత్వానువాదంలో భాషరీత్యా వ్యక్తీకరణ రీత్యా వచ్చిపడే సమస్యల్ని వాటి పరిష్కరణ రీతుల్ని – తన అనువాద రచనానుభవ జన్యమైన విషయాలతో చర్చించి ఉంటే బావుండేది.

ఏదో ఒక్క లోపమయినా లేని రచన ఏదీ ఉండదు. ఏ పనయినా నిర్దుష్టత వల్ల కాక గుణ బాహుళ్యం వల్ల మంచిదనిపించుకుంటుంది. కాబట్టి ఇది అభినందించదగ్గ మంచి ప్రయత్నం. ♦

## లోయ నిండింది

- లోలా కోసూరి
7702109311

నీళ్ళు ఒక్కచోట చేరితే ఎంత సంబరమో
చీమలన్నీ ఆహారం దగ్గర చేరినట్టు
మనుషులంతా ఆనకట్ట గేట్ల ముందర చేరుతున్నారు.
ఒకచోట చేరిన నీళ్ళు భళ్ళున కిందికి జారటాన్ని
సంబరంగా చూస్తున్నారు.
నిలిపి ఉంచటం కంటే
వొదులుగా వదిలేయటమే ఆనందమా!?
నిండుగా తొణికిసలాడే నదిముందు నిలబడి
ఏ ఒక్కరూ కళ్ళు విప్పార్చరు,
అచ్చం గర్భిణీ ముందు ఇబ్బందిగా మెసిలినట్లు
కుదురుగ్గా కూర్చోనే లేరు..
మొత్తం అన్నిగేట్లూ ఎత్తేశాక కిందికి దుమికే లక్షల
క్యూసెక్కుల నీళ్ళను
మాత్రం సంభ్రమంగా చూస్తారు
పుట్టినబిడ్డ లేతపాదాలకు మోహమాన్చినట్లు
నీటి తుంపరలకు మోహమాన్చి
గొప్ప ఆనందాన్ని అనుభవిస్తారు.

ఒరే ఆనకట్టా నీకు దండాల్రా సామీ
మా బువ్వ ప్రవాహాన్ని
నిలువరించటానికి
ఎన్ని పూడికల కణుతుల్ని పొట్టలో దాచుకున్నావో...
ఎన్ని నెప్పుల మాత్రలు మింగావో..

కిందికి దుముకుతున్న నీటిపిట్టల్ని
గొప్పగా ఆనందిస్తున్నాం గానీ
అవి అక్కడ గూడు కట్టడానికి
నువ్వెన్ని గునపపు పోట్లు భరించావో.....కదా.

నదీ....నీకూ ఓ నమస్కారమే తల్లీ
నిలువునా ఎండిపోయి రాళ్ళుతేలిన గుండెల్తో
ఏ పాలూ చేపలేని వొట్టిపోయిన గేదెలా నువ్వున్నపుడు
నేనో...నా వాళ్ళో...
ఎవ్వరమూ ఇటేపైనా రాకపోతిమే అనే కోపమే లేకుండా
పాలిస్తున్న గేదెతల్లి మాదిరి ఎంత ఆనందంగా కదలకుండా
నుంచున్నావే
నీకూ నీ ఓపికకూ
సవాలక్ష మొక్కులే అమ్మా..



లోయ నిండింది...
కట్ట ఎనక నీళ్ళతో,
కట్టముందు జనం కళ్ళతో..

ఇంక మడవేద్దాం పదండహే మాగాడికి..
మనిషి ప్రాణాలు నిలిపే జీవనాడికి..
♦

---

## నిష్క్రమణ..

- పెరికల రంగస్వామి
9985252854



నిర్దయగా నిష్క్రమిస్తావనుకోలేదు
నిండుగా వస్తావు
నిర్జీవమైన నా ప్రపంచాన్ని
సజీవం చేస్తావనుకుంటే
వచ్చినంత వేగంగా
వెనక్కి వెళ్ళిపోతావు
తుమ్మ ముండ్లు పరంగి కంపలు
తనువంతా గుచ్చి
రక్త ధారలు పారిస్తున్నా
రవ్వంత అలికిడి చెయ్యవు
ముచ్చట్లు చెబుతావని
మూటలలో మాటలు దాచానని తెలిసి
నోటి ముత్యాలు రాల్చకుండ

మూతి ముడుచుకొని
మౌనంగా వెళ్ళిపోతావు
దోబూచులాడుతున్నావు
దొరుకుతావనుకున్న
దరి చేరక
దహించేస్తావనుకోలేదు
కవ్విస్తూ వస్తుంటే
కలలన్ని తీరుస్తావనుకున్నా..
కళ్ళెర్రజేసి
కర్కశంగా చూస్తావనుకోలేదు

అంతిమ ఘడియల్లో
పిచ్చి చూపులు చూస్తూ
అస్తిత్వంకై అలమటిస్తుంటే
జాలి చూపుల
జోల పాడుతావనుకున్నా
నిర్దయగా నిష్క్రమిస్తావనుకోలేదు.. ♦

కథ

# ముత్తడు గొప్పోడు

- పులికంటి కృష్ణారెడ్డి



పులికంటి కృష్ణారెడ్డి

ఎడం కాల్ని పైకెత్తి ఎగిరొక్క తన్ను తన్నాడు పర్దేసిరెడ్డి!

మూడు పొల్లికలు పొల్లి మూడు బార్లకవతల పడి ముక్కతా మూలగతా పైకి లేసి, లేవలేక తల పైకి లేపి, తిప్పలేక సూపును పక్కకు తిప్పి సూళ్ళేక సూసినాడు ముత్తడు – పర్దేసిరెడ్డి పక్కన దర్జాగా నిలబడుకోనుండే పిల్లగాణ్ణి!

ఆ పిలగాడు పిలగాడు గాదు – పిడుగు!

ఆ పిడుగు దొరమాదిరుండాడు. దొరమాదిరుండే పిలగాడి పక్కన్నిలబడుకోని పర్దేసిరెడ్డి నిప్పులు కక్కతా వుండాడు.

నిప్పుల కుప్పల్లో నుంచి అగ్గిశాక రైలింజన్లో మాదిరి గుప్పు గుప్పుమని పైకి లేస్తా వుండాది. తట్టుకోలేకుండా ముత్తడు తలొంచినాడు. వంచిన తల్లో యాడుణ్ణాయో? ఏంవో? వాన సినుకుల మాదిరి కురుస్తా వుండాయి కన్నీళ్లు.

కన్నీళ్ళు కార్తానే వుండాయి!

అగ్గి కుప్పలు పొగలు కక్కతానే వుండాయి!!

పర్దేసిరెడ్డికి వల వలా గారే నీళ్ళు కనిపించలేదు.

పొద్దు నడిమిట్ట నుండాది. ఆ మండేవోడు గూడా గబ గబా మండతా వుండాడు. ఇంకొక సోటింకొక సోటయితే ముత్తడు సేతులు మోడ్చి, తల పైకెత్తి అంతా ఆ మండే వోడే సూసుకుంటాడనే వోడు. ఇప్పుడనేదానికి గుండెల్లేవు. యాడుంటాయి? ఎట్లుంటాయి? ఎడం కాలి తన్ను కెప్పుడో ఎగిరిపోతే?

ఆ యింటి వసారాలో అబ్బ పర్దేసిరెడ్డి, కొడుకు గాంధీరెడ్డి, సేద్దిగాడు ముత్తడు ముగ్గురూ మూడు దిక్కుల్లో నిలబడుకున్నారు. ఇంటిల్లాలు పద్మవతమ్మ హాల్లో దారబందాని కానుకోని కొర కొర సూస్తా వుండాది. వాకిలి ముందర కొట్టంలో గాట్లో కసువు తింటావుండే గొడ్లు.... ముత్తడి సేతుల్లో ముదిగారంగా పెరిగిన గొడ్లు – మేపు తినడం ఆపి, మోర ముందుకు సాస్తా గుంజులాడ్తా వుండాయి. ఎందుకో? ఏంవో?

పాపం! అవ్వి నోర్లేని గొడ్లు!

“ఇంకా నిలబడుకోనుండావు గదరా కొడకా!... సాల్లేదా? సెప్పు. సాలకుంటే సెప్పురా!”

ఎకసక్కెం ఎగిరెగిరి పడ్తావుంది పర్దేసిరెడ్డి మాటల్లో!

పేదోడి కోపం పెదాలకు సేటని తెల్సు ముత్తడికి. అయినా ముత్తడు మణిసి. మణిసంటే అంతో యింతో సీంవూ నెత్తురుంటుంది. సీంవూ నెత్తురుంటే సీవంత అభిమానంవూ వుంటుంది. వాడుగాదు తల పైకెత్తింది. వాడభిమానం!

“ఏందిరాట్ట సూస్తా వుండావే?... సూస్తే యేంజేస్తావ్..? పో!... పోరా! తిరిగి సూడకుండా పో! యాడ్దాకా పోతావో పొయ్యి, శాతయింది సేసుకో బోరా!”

పర్దేసిరెడ్డి పంచన కట్టేసుండే కుక్క ‘కుయ్యో!కుయ్యో!’ అని అరస్తా ఈ మాటలకది ముక్తాయింపు పలికింది.

“ఛీ! నోర్ముయ్యే నీ యమ్మను గొట్టా!”

పర్దేసిరెడ్డి కసిర్నాడు.

కుక్క యిశ్వాసం కలిగిన జంతువు.

తోకాడిస్తా నోరు మూసుకుణ్ణింది.

ముత్తడు నోరెత్తుంటే ఒట్టు!

ఊరి ముందర సెరువులో దినంవూ ఈతాడించి ఆ కుక్కను సబ్బేసి కడిగే వోడు ముత్తడు. ఇంటిల్లల్బ శాతబట్టి ఒక గోరింకెనో, బెళ్ళ గువ్వనో గురిబెట్టి పడగొట్టి, బొచ్చు పెరికి కాల్చి పక్కంజేసి దాన్నోటి కందించేవోడు. వాడంటే పంచపాణాల్దానికి. అది పెరుకులాడ్తా వుండాది. బెరుకు బెరుగ్గా సూస్తా వుండాది. సూస్తా అరవలేక, అరవకుండా వుండలేక అల్లాడిపోతా వుండాది. దానవస్తను సూసినాడు ముత్తడు. సూళ్లేక తలొంచుకుణ్ణాడు. ఎద్దు గొడ్డుకల్లా సూసినాడు.

గాట్లో గొడ్లు, తానేళకు తిన్నాడో లేదోగానీ, వాట్ని మాత్రం యేవార్లేదు. కరువు రానీ కాటకం రానీ బిడ్డల్ని సాకినట్టు సాకినాడు. గాట్నింటికీ మేపుంటే కూడా అవ్వి పోసట్టా కొరక్కుండా గుంజులాడ్తా వుండాయి. సూళ్ళేక మరీ తలకాయ వాలేసినాడు ముత్తడు.

తలకాయ వాలేస్తే యేం వుండాది? – కాళ్ళ కింద బూఁవమ్మ.

బూఁవమ్మను తాన్నమ్ముకున్నాడు. పర్దేసిరెడ్డి తన్ను నమ్ముకున్నాడు. రేత్రనక పొగులనక వంచిన్నడు వెత్తకుండా పోకలాణ్ణాడు. ఆ యింటి నాలుగ్గోడల మద్దె తప్పిస్తే తన సెంవట సిందని సోటే లేదు. ఈ మాట మణుసులో మెదిలేకుందికి ముత్తడి మణుసు ఎట్టెట్నో పొయ్యింది.

గబక్కని నేలమింది కొంగినాడు ముత్తడు. వంగి మూడుసార్లు బూఁవమ్మను కండ్ల కద్దుకుణ్ణాడు. అద్దుకోని పైకి లేసినాడు. లేసి గిరక్కని ఎనక్కి తిరిగినాడు. అడుగు మిందడు గేసుకుంటా ముందుకు నడ్సినాడు.

ఆ యింటి కడప దాడ్తావుండాడు ముత్తడు. కడప కవతలొక్కాలు, ఇవత లొక్కాలు, అట్లానే నిలబడ్డాడు, నిలబడి ఒక్కసారి ఎనక్కి తిరిగి సూసినాడు. సూస్తా రొండు సేతులు పైకెత్తి జోడించి ఒక్కదండం పెట్నాడు. అక్కడి కాయింటితో ఋణం తీరిపోయ్నట్లుగా!

అంతే! అణ్ణుంచి ఎల బార్నాడు. ఎనక్కి తిరిగి సూడకుండా పోతావుండాడు ఏందో జరగరానన్నాయం జరిగిపోయ్నట్టు కట్టు గూటాన నోర్లేని గొడ్లు గూడా 'అంబా! అంబా!!' అని ఆరస్తా వుండాయి.

అబ్బా కొడుకు నవ్వే నవ్వులకు అలప సొలప్మయిన యిల్లయితే పై కప్పెగిరిపోయ్యేదే!

నలగని కద్దరు పై పంచె మడతల్ని నాజూగ్గా సర్దుకుంటా వుంటాడు పర్దేసిరెడ్డి.

నేలమింద రాసి రాసి బూటు కొన అరిగిపోయ్యిందేఁవో తడిఁవి సూస్తా వాట్నిప్పేదానికి వాలు కుర్చీమింద కుచ్చున్నాడు గాంధీరెడ్డి.

పంచమింద కుక్క యాడవలేక, యాడవకుండా వుండలేక ఏడుపు నదొకరకం మూలుగ్గా మార్సి – కట్టేసిన గొలుసును కొరకతా వుండాది.

నోర్లేని గొడ్లకు కండ్లుండాయి. ఆ కండ్లల్లో నీళ్ళు గార్తా వుండాది.

నెంవిలి కంట్లో నీళ్ళు గార్తే యాటగాడి కేంవయినా ముద్దా?

♦♦♦

ఊరి కుత్తరంగా నాగల మిట్టబాయి. ఆ బాయికా దొక కానగసెట్టు. ఆ సెట్టు కింద కుప్పగ కూలబడ్డాడు ముత్తడు.

ఆ కానగ సెట్టు కింద కూలబడి కల మాదిర జరిగిపోయ్న బతుకును గురించి నెవురేసుకుంటా వుంటాడు ముత్తడు!....

వాడికే గాదు ఆ పాయికట్లో ఎవుడికయినా సరే – పర్దేసిరెడ్డిమింద ఆవగింజంత అనుమానముంటే యిందూరం ఆలోసించాల్సిన పనేలేదుఁ

పర్దేసిరెడ్డి!

ఆ పాయికట్టు తల్లో నాలిక!... మెల్లో రూక!

కనుచూపు దూరాన కంటపడే వాడెట్టా టోడైనా సరే – సేతులు జోడించాల్సిందే! కుచ్చోనుంటే గబక్కని లేసి కొంచింగా ముందుకొంగి సేతుల్జపుకుంటా నిలబడాల్సిందే!–

బయంతో గాదు – బగిత్తో!

ఈ బయం బగుతులు తేరకు రాలేదు పర్దేసిరెడ్డికి.

పర్దేసిరెడ్డి తాత ముత్తాతల కంతో యింతో కయ్యాగాల వుణ్ణింది. అంతో యింతో వుణ్ణిందాన్ని ఎంతో కొంత పెంచి వాళ్లు పర్దేసిరెడ్డి పరం జేసినారు. ఆ కయ్యాగాలవతో పాటు పర్దేసిరెడ్డి కాసింత – తెలివి తేటల్ని కూడేసుకుణ్ణాడు.

పర్దేసిరెడ్డి పెద్దగా సదువుకోకపోయ్నా పెద్దబాలసిచ్చ యీకాణ్ణుండా కడదాకా సదివేసినాడు. పెదబాలసిచ్చినే తిప్పించి మల్లించి సదివేసేకుందిక పెద్ద పెద్ద పుస్తకాల్నే తడుంవుకోకుండా సదివేడానికి తయారైనాడు!

అట్లా తయారై అయిన తెల్సుకుణ్ణిందేవిటంటే – నోకం

తెలియకపోతే ఈ లోకంలో బతకలేంవని! ఈ లోకంలో ఆ నోకం శానా ఎత్తులో వుండాది. దాన్ని సేరుకోవాలంటే శానా మెట్లెక్కల్ల! –

కద్దరు గుడ్డలు గట్టి పర్దేసిరెడ్డి మొదటి మెట్టెక్కేసినాడు.

గాంధీ సచ్చిపోయినపుడు ఆ వూరి బజనగుళ్లో రాంవుడి పటం పక్కన గాంధీపటాన్ని పెట్టించి వర్సగా వారం దినాలు అయిన జీవిత సెరిత్ర సదివి వినిపించి – యిన్నోళ్ళు యేడస్తా వుంటే వాళ్ళతో కల్సి తానూ యేడ్సినాడు.

ఆ తరవాత శానా దినాలకు తన కొక కొడుకు పుట్తే వాడికి గాంధీరెడ్డని పేరు పెట్టుకున్నాడు.

నెహ్రూ సచ్చిపోయినపుడయితే నెల్నాళ్ళు నోర్దెరిసుంటే ఒట్టు!

అప్పుడు దేశింలో ఏ నోటిన్నా ఒగిటే మాట. యాడ మీటింగుల్జరిపినా అదే మాట. 'మాలోళ్ళను గూడా మణుసులుగా సూడండని!'

ఈ దెబ్బతో శానా మెట్లు పైకెక్కేయచ్చనుకున్నాడు పర్దేసిరెడ్డి.

ఆ ఊరి మాలాడమింద పణ్ణాడు. కాలికి బలపం కట్టుకుణ్ణిట్టుగా యిల్లిల్లు తిరిగినాడు. ఇంటికొక్క మణిసిని మాలాడ ముందర గెవిన్లో మాంవిడి సెట్టు కింద సేర్సినాడు.

కాకితో కబుర్జేస్తే యింటికొక్క మణిసి గాదు – యిల్లిల్లు కదిల్తిందని పర్దేసిరెడ్డికి తెల్సు. అయితే ఆ మాత్రం నోకం తెల్నోదేంగాదు పర్దేసిరెడ్డి. సెట్టుకింద సేర్నోళ్ళందర్నీ పేర పేర్నా పలకరించినాడు. ఆ పలకరింపుతో ఆ ఎర్రి జనం తాగినోళ్ళ మాదిరి ఎనక్కూ ముందు కూగులాడ్తా తబ్బిబ్బులై పోతావుంటే రెడ్డందుకున్నాడు.

"ఒరే నాయన్లారా! తినేదానికి కడుపుక్కూడు లేకపోతే ఆకులలుంవులు పెరక్క తిని నాలుగు దినాలు పాణం నిలబెట్టుకోవచ్చు. కట్టుకునే దానికి గుడ్డపేలిక లేకపోతే గోస్సేత పెట్టుకొని తిరగచ్చు. అదే గొంతులోకి గుక్కెడు నీళ్ళు లేకపోతే!....ఆహం! మీ ఆడది సంకన కడవలేసుకుని కాలిక్కాలు కొట్టుకుంటా మోటబాల్దగ్గిరి కెంత దూరం నడుస్తా వుండాలో ఎప్పుడైనా ఆలోసించినారా మీరు? సెప్పండ్రా!.... సెప్పండి!"

సెప్పలేకుండా సేతులు పిసుక్కుంటా సేతులెత్తి దణ్ణం బెట్టిందా గుంపు.

"అడిగితే అంతే! రాతికూసాల మాదిర్నిలబడ్తారు. గద! వాయిస్తే సేతులు పిసుక్కుంటారు. అందుకే పెనుంవూరు పిచ్చయ్య శాస్త్రుల్దగ్గిర లగ్గణం పెట్టించినా. వారం, తిదీ, నచ్చత్రం, అన్నీ బెమ్మాండంగా వుండాయంట. మీరింటికొక మణిసి పారా గెడ్డపారసేతబట్టండి. మిగిల్ని పని నా కొదిలి పెట్టండి."

"పర్దేసిరెడ్డికీ జై!" అనిందాడ జేరి మాలగుంపు.

"సెబాస్!" అన్నాడు పర్దేసిరెడ్డి.

దినంవూ ఒక రాయిని తీస్తావుంటే కొండయినా కరిగిపోతుంది. తలా ఒక సెయ్యేస్తే సేదబాయేంది? – మాలాడ మొగ దల దిగుడు బాయే దివ్వెంగా ఎలిస్తింది. అయితే ఆడ సేదబాయే ఎలిసింది. లగ్గణం ఎట్టిన యేళా యిసేసవేంవో నాలుగున్నర మట్లకే నీళ్ళు వణ్ణాయి. అవ్వి నీళ్ళుగాదు, గోయిందొడ్డుకాడ రెడ్డోరి టెంకాయి తోపుతో పక్కాని కొచ్చిన టెంకాయి నీళ్ళు!

పర్దేసిరెడ్డి మాలాళ్లోనే శాందారం, బొక్కెన తెప్పించినాడు. సేతులారా తానే నీళ్ళు సేదినాడు. మొట్టమొదటి సారిగా దోసిడు నీళ్ళెత్తి గొంతులో పోసుకున్నాడు.

"పర్దేసిరెడ్డికీ జై" అనిందా గుంపు.

ఇట్లా శానా శానా మంచి పన్లుజేసి పర్దేసిరెడ్డి పాయికట్లో శాన ఎత్తు కెదిగిపోయినాడు.

తిత్తిలో రూక, దుత్తలో ఆయిందెం సెలవుగాకుండా తొట్టిబిడ్డను పెంచడంలో పర్దేసిరెడ్డికి పర్దేసిరెడ్డే సాటి.

అందుకే పర్దేసిరెడ్డి ఆ పాయకట్టుకు తలకట్టు.

ముత్తదయ్య ముకుందుడు, పోతా పోతా అదే అనేసి పోయినాడు.

"ఒరే అబ్బోడా! నా సీటెట్టా సెల్లుబడింది. సెల్లుబడ్తే సీటి సింపేయాల్సిందే! సింపేసినారు, నేను పోతావుండా. పోతా పోతా ఒక్క మాట్జెప్పి పోతా. మర్చిపోవద్దు. మా తాత ఈ పంచన్నే బతికినాడు. మీ తాతకూడా అంతే. తాత ముత్తాతల కాలం నుంచీ ఈ పంచనే నమ్ముకున్నాం. పెట్టింది తిన్నాం. పోసింది తాగినాం. ముక్కు నొచ్చిందనీ, మూతి నొచ్చిందనీ మూల కుచ్చోకుండా వొళ్ళొంచి పన్జేసినాం. అట్టాంటి జలమాలు మనవి. రెక్కాడ్తేనేగదా డొక్కాడ్తుంది. అట్టాంటప్పుడు యాడయితే మనకేం?. యాడికి పోయినా రూపాయికి పదారణాలేగా? అందుకే సెప్తావుండా, నీ తాత ముత్తాతల పేర్నిలబెట్టు.

ముత్తదు పేర్నిలబెట్టడంవేగాదు పేర్దెచ్చుకున్నాడు.

"ఓ యబ్బా వాడా ఆ యింటి కెప్పుడో ఋణపడున్నాడు. పెండ్లీలే, పెటాకులూ లే రేత్రీలే, పొగులూలే! ఇల్లిడ్సి పెద్తే

కయ్యి. కయ్యొదిల్తే యిల్లు. వాడెమ్మను గొట్టా! వాడి కెదుండాదో ఆ సెగితి. రాళ్ళతో పోరికలాడ్తా వుండాడబ్బా!"

ఆ ఊళ్ళో యేనూట విన్నా యీ మాటే!

ఊళ్ళోవాళ్ళు ఉత్తుత్త మాటల్తో ఉబ్బిస్తే పర్దేసిరెడ్డి పాణంలో పాణంగానే సూసుకున్నాడు.

ముందు మడకపట్టి ఆడుసు మడిలోపొద్దు నడిమిట్టకెక్కే దాకా ముత్తడు మడక దున్తాడు. కూడేళ దాటిపోతా వుందని ఎనక మడకలోళ్ళు యేడస్తావుంటే – అప్పుడు మడకలిడ్సి పెడ్తాడు. ఎద్దల్ని కడగతాడు. వాటిని సుతారించి, గాట గట్టి మేతంతేసి–మల్లా పార సేతికెత్తుకున్నాడంటే వంచిన్నడు వెత్తకుండా ఆడుసు మడిలో అండ గొడ్తా వుంటాడు. పొద్దునడ మిట్టన యిర్సక పడ్తా వుంటింది. పర్దేసిరెడ్డి పంచె పైకెత్తిపట్టి గెనిఁవిలిమింద గవునూరు మాదిర వస్తా వస్తా వుండి ముత్తణ్ణి జూసి నిలబణ్ణెట్లు నిలబడతాడు.

"ఒరె నీ యమ్మను గొట్టా! నీకు సెప్పి సెప్పి నోరు బోవాల్సిందేరా? ఇప్పుడే వేఁని కొంపలంటకపోతా వుండాయని? – ఇయ్యరవదాకా మడక దున్నినావు గదా? ఒళ్ళట్టా కదుక్కోని, కదుపుకంత కొట్టుకోని, ఒకొక్క కొరకినంత సేపట్లా వాలబడి మల్లా గావాలంటే అండ గొట్టేదే గాదు – అడివి మిదంబడి ఆకంతా దెచ్చి అడుసు మడికేసి తొక్కితే మాత్రం నేనొద్దంటానా?.... దేనికైనా వొక అద్దూ ఆపూ వుండాల్రా!"

దున్నిన ఆడుసుకంటే మెత్తంగా వుంటాయి మాటలు!

అప్పుడడుసు మడిలో వుణ్ణెట్టనుకోడు ముత్తడు. పన్నీటి మడుగులో మునిగి తేల్తున్నట్లు మురిసిపోతాడు.

ముత్తడు దినఁవూ తొలికోడి కూతకు ముందే నిద్దర లేస్తాడు. కొట్టంలో ఎద్దల్ని యీపుదట్టి లేపుతాడు. కుడితి సూపతాడు, ఎద్దల పగ్గాల్నొక సేతపట్టి, బానా మోకు బుజానబెట్టి కానబాయిలో కబిల కట్టే దానికి బయల్దేర్తా వుంటాడు. ఒక్కంట యిదంతా గెవనిస్తానే వుంటాడు. పర్దేసిరెడ్డి. ఆయ్‌నా కడపదాటేటప్పుడు "ఒరే ముత్తా!" అని మెత్తంగా పిలస్తాడు.

ముత్తడొక్క సెణం నిలబడతాడు.

"అది గాదురా నీయామ్మా బడవా! నీకు నిద్దర పట్లేదని అందరికీ నిద్దర పట్లేదనుకుంటే ఎట్లారా? ఇయ్యరవకాడ గంగా బవాని నిద్దరపోతా వుంటిందిరా! నిద్దరపోయ్యే సల్లని తల్లిని లేపితే కోపగించుకుంటుందిరా."

పాసి నోటితోనే పక్కంగా పలకతాడు పర్దేసిరెడ్డి.

"ఇన్ని దినాలు కోపగించుకోని గంగమ్మ తల్లి యిప్పుడు మాత్రం కోపగించుకుంటిందా? ఈయన్దంతా యిచ్చిత్రం పచ్చిపుల్సు! యీ గిలు తాళింపు" అని గొణుక్కుంటూ ముత్తడెలబారతాడు.

"సరే పోరా పో!...... సెప్తే యినిపించుకునే జలమ్మయితే గదా నీది!" అని నిట్టూర్పులు నిగిడిస్తాడు పర్దేసిరెడ్డి.

అట్టాంటి పర్దేసిరెడ్డి ఎడం కాల్తో ఎదరొమ్ము మిందెగిరి తన్నాడు.

ముత్తడి కిప్పుడు యాభై యేండ్లకు పైబడింది. గోసిసేత పెట్నాక్కాదు గానీ పెట్టక ముందునుంచీ వాళ్ళమ్మ కొంగు పట్టుకోని ఆ యింటావరణలోనే తిరిగినాడు.

వాళ్ళమ్మ పొయ్యింది. పసుపూ కుంకంతోనే పొయ్యింది. పుణ్యాత్తురాలన్నారు. ఆ తరవాత ఆయ్య సెయ్యి పట్టుకోని తిరగలేదు కానీ, సేతికి సెయ్యందించినాడు. సేతికి సెయ్యిడిసిపెట్టి అయ్యా పోయ్‌నాడు. కానీ, తాను మాత్రం పర్దేసిరెడ్డి సెయ్యొదిలి పెట్లేదు.

దీనికిదా ఆ పెద్దమణిసి సేసినుపకారం?

ఇదంతా అట్టాపోనీ! ఆ పొద్దు. గాంధీ పుట్టిన్నాడంట. తాను కల్లోకూడా అనుకోలా. ఇంటి ముందర ఊరంత పందిలేసె. పాయికట్టు పాయికట్నంతా ఆ పందిలి కింద కుచ్చోబెట్టె, అయిద్రాబాద్ నుంచి ఎవురో మంత్రంట. ఆయన్ని పిలిపించె. పెనువూర్నుంచి పిచ్చయ్యశాత్రుల్ని, పిల్లయ్యోర్ని యిద్దర్నీ పిలిపించె. ఇదంతా ఎందుకో? ఏఁవో? అనుకుంటావుంటే – పెళ్ళో సలసలాకాగే నీళ్ళు సూపించి తలంటుకోని తలకడుక్కోరా అనె. మల్లిపూవు మాదిరుండె పంచ తెచ్చిచ్చి కట్టుకోరా అనె. అయిన్జెప్తా వుంటే తాను గంగిరెద్దు మాదిర సెప్పిందంతా సెసె. ఆమిందటేటాయె? నేరుగా అంతమంది ముందరికి తీసకపోయ్యి మంతిరి ప్రక్కన కుర్చీలో "కూర్చోరా! అనె. లోబిరికి ఎలిబిరిగ్గా ఎనక ముందాడ్తావుంటే గదఁవాయించె, మింగలేక కక్కలేక మిసకతానే కుర్చుండె. తన ప్రక్కనే దొరబిడ్డ మాదిర తయార్జేసి గాంధీరెడ్డిని కుచ్చోబెట్టె. పాయికట్లో జనఁవంత ఊపిరి బిగబట్టి సూస్తావుండ్రి. అప్పుడు పర్దేసిరెడ్డి పైకి లేసె!

"మహజన్లారా! ఈ పొద్దు మనకొక పండగ దినఁవు. ఎందుకంటే – యాణ్నో ఒక మూలగాని మూల్లోవుండె పల్లె మన్ది. బస్సు రావల్లంటే కష్టం. బండి పోవల్లంటే యిబ్బంది. ఈటన్నిట్నీ తట్టుకొని ఎన్నో పన్లుంటే ప్రక్కన పెట్టుకోని మంత్రిగారు మనూరి కొచ్చినాడంటే అది మన బాగ్గెం!"

అట్లంటా మంతిరి మెళ్ళో పూలదండేస్తా పర్దేసిరెడ్డి చేతులు తట్నాడు. పొలోమని పందిలికింద జనంవంతా సేతులు తట్నారు. పందిలి పైకి లేసీ పోతుందేవో? అనిపించింది.

పర్దేసిరెడ్డి మల్లా అందుకున్నాడు :

"మహాజన్లారా మీ కందరికి తెల్సు ఈ పర్దేసిరెడ్డేం పన్జెసినా పదిమందీ సెబాసనేటట్టుగా సేస్తాడని. నాకు తెల్సు యిప్పుడు మీరంతా శానా ఆశ్చర్యపడ్తా వుండారని. ఇంకొక పక్క శానా యిశారపడి పోతుండారని! ఎందుకంటే ముత్తడు నాయింట్లో సేద్దిగాడు. మీ కండ్లకీ పాయికట్టులో ఈ దొక మాలోడు అంతే! అంతకు మించేం వీలేదు. అట్లాంటోణ్ని యీ పొద్దీ యేదిక మింద మంత్రిగారి పక్కన కుచోబెడ్తే అప్పటికీ పాయికట్లో నాయం బతికినట్టా? సచ్చినట్టా? ఇంక మేంవంతా ఎట్లా మొకాలెత్తుకుని తిరుగులాడల్ల అని మీరంతా ఆలోసిస్తా వుండచ్చు. కానీ మహాజన్లారా! నేను మనవి జేసే దేంవిటంటే– గాంధీ మహాత్ముడేం జెప్పినాడు? మాలోళ్ళు కూడా మనుసులేరా! వాళ్ళల్లో కూడా మన్లో వుణ్ణట్టే రగత మాంసాలుంటాయిరా! అన్చెప్పలేదా? మీరే సెప్పండి. ఈ పొద్దు యిందిరమ్మ యేంవంటా వుండాది? వాళ్ళున్నంత కాలంవే మకకాలంవంటా వుండాది. పెద్దోళ్ళొక మాటజెప్తే జెప్పిందానికంటే ఒకాకు ఎక్కువగా మనం నడ్చుకున్నప్పుడే మనం గొప్పోళ్ళంవుతాంవు. ఇంతకు నేన్జెప్పొచ్చే దేంవిటంటే– ముత్తడి తాత... వాళ్ళ తాత – వాళ్ళ తాత ముత్తాతల కాలం నుంచి నా పంచన్నమ్ముకొని బతికినారు. ముత్తడు నా యింటి బిడ్డ. 'మంచి గుడ్డ కట్టు కోరా!' అంటే – మట్లో పొల్లాడే వోడికి నాకెందుకంటాడు? యాళకింత కడుపు నిండా కూడు తిన్రా! అంటే యిదింకా యిచ్చింత్రంగా వుండాదే? తినకుంటే బతికేదెట్టా? పన్జెసేదెట్టా? అంటాడు. 'పోనీ పెండ్లి చేసుకోరా' అంటే – సేసుకున్నోళ్ళంతా అనబవించే సుకం కండ్లకు కనిపిస్తానే వుండ్లా!' అని దీర్గాలు తీస్తాడు. ఇప్పుడు వాడికి యాభై యేండ్లకు పైబడింది. సెప్పిన మాటిని పెండ్లీ పెటాకులు సేసుకోని, వాడూ వొకింటివాడనిపించుకోనుంటే వాడు కద్దు. వాడి సంసారం కద్దు. ఇప్పుడు దీనికంతా అవసరం వుండేదే గాదు. వాడు పుట్టి బుద్దెరిగిన నాట్నుండి ప్రెతి సెమట బొట్టూ ఈ యింటికి దత్తం చేసినాడు. ఇంట్లాటోళ్ళు యే నూటికో, కోటికోగాని ఒక్కరుండరు. వాడికి కడుపులో పుండ్లు లేవు. పాలుమాలిక వొంటిమింద లేదు. నేనా?...... ఈ పొద్దో రేపో? ఎవుర్జూసినారు. నా తదనంతరం యీడు బాధపడగుడ్డు. కాలూ సెయ్యి వుడిగిన కాలాన సూసే దిక్కు లేక వాడు యాతన పడగుడ్డు. అందుకే వాడికి ఋణం తీర్చుకునే దానికి నాకు ఒక్కటె ఒక్క మార్గం తోసింది!"

గుండెల్నిండా గాలి పీల్చుకుంటా ఒక నిమిశం మౌనంగా వుణ్ణాడు పర్దేసిరెడ్డి. పందిలి కింద జనం కంటి మింద రెప్ప పడకుండా సూస్తావుండారు.

"నా పెద్ద కొడుకు గాంధీరెడ్డిని ముత్తడికి దత్తత చేస్తున్నాను."

పర్దేసిరెడ్డి నోట్లో మాట నోట్లో వుండంగానే మంత్రిగారే సేతుల్దట్టే కుందికి గొట్టెదాటు సప్పట్లతో మిన్నిరిగి మింద పణ్ణట్టయింది.

పెనుంవూరు పిచ్చయ్య శాస్త్రులు, పిల్లయ్యోరు యిద్దరూ గుక్కతిప్పుకోకుండా సదివిన మంత్రాల్నే తిప్పించి మల్లించి తెగ సదివేసినారు. అంతమంది మహాజను లక్కదుండగా ఆకాశవేణి సాచ్చిగా బూఁవమ్మ సాచ్చిగా, ఏడుగురు అక్క దేవతలు సాచ్చిగా 'గాంధీరెడ్డి ముత్తడి దత్తత కొడుకు' అంటూ గాంధీరెడ్డి సేతుల్ని ముత్తడి సేతుల్లో పెట్నాడు.

మల్లా ఒకసారి మంత్రిగారు సేతుల్దట్టే కుందికి పాయకట్టు పరవశించి తట్టింది.

గాంధీరెడ్డి వొంగి ముత్తడికి దండం పెడ్తా వుండాడు.

ఆ మద్దేణం పర్దేసిరెడ్డి గారింట్లో మస్తుగా తాగి, సుష్టుగా తిని మంత్రిగారు తన దోవన తాను పోయ్‌నాడు.

"మణిసంటే పర్దేసిరెడ్డిరా మణిసి!... సెయ్యించుకుణ్నంత శాకిరీ సెయ్యించుకుణ్నాడు. ఆ శాకిరీకి తగినట్లుగా కొడుకునే దత్తు కిచ్చేసినాడు. మణిసంటే అట్టుండాల. మణిసికట్టా మణుసుండాల అయ్‌నా ఆయన్జేసిన పన్లకు ఏలెత్తి సూపించే దాని కెవురివల్ల అవుతుందిలే?"

"ఒరే అబ్బోడా! పెద్దోళ్ళుజేస్తే పెరంవాళ్లు జేసినట్టు. అదే నువ్వూ నేన్జేసుండేనా ఎంత మందెంత దుమ్మెత్తిపోసేవోళ్ళో నెత్తిమింద!"

ఒక ముసులోడి నసుగు.

"ఎంత దుమ్మెత్తిపోసినా ఆ బట్టతల మీంద నిలబడ్డులేరా ముసిలోడా! నువ్వెందుకు దున్నపోతు దున్నిసస్తే పిడుదుమాది రొగిస్తావ్"

ముసిలోడి మింద కుర్రోడి యిసురు!

పర్దేసిరెడ్డేంవీ పసిపిలగాడు గాదు. అయినేం జేసినా దానెనకెంతో కతుంటాది. మనంవిట్లా మాట్లాడుకునేది కుక్కల కాట్లాటే!"

ఆ ఊళ్లో తలకొక్క తీరుగా యిట్లా అనుకుంటానే వుండారు. ముత్తడు గాంధీరెడ్డికి తానే అయ్యనని తిరగతా వుండాడు. నెల తిరక్కముందే గాంధీరెడ్డి ఢిల్లీలో పై

సదువులకని పయాణం కట్నాడు.

ఊరి ముందర కానబాయి గెడ్డమింద కానగ సెట్టొకసారి ఆకురాల్చి పూత పూసింది. పంట ఒబ్బిడయింది. ఒకనాడు పర్దేసిరెడ్డి వసారాలో వాలుకుర్చీమింద కుచ్చోనుంటే – ముత్తడు తల గీరుకుంటూ ముందు నిలబడ్డాడు.

"ఏఁవిరా ముత్తా?"

"ఏఁవీ లేదయ్యా!...మాకు బూఁవులిస్తా వుండారని ఒకయిదెకరాలు నామింద పట్టాజేసి పెట్టిరి గదా?....."

"అవును!"

"ఎవరి బతుకులేం శాశ్వితం?... ఉణ్ణిట్టుంది పోతే లేనిపోని బెడదెందుకు? ఆ అయిదెకరాలు అబ్బయ్య పేర రాసి పెట్టేయండి. నా సొత్తు నా తరవాతయినా ఆయనకే గదా సెందుతుంది!"

ఇల్లెగిరిపోయ్యేటట్టు యిరగబడి నవ్వినాడు పర్దేసిరెడ్డి. నవ్వతావుంటే పొర పొయ్యింది. పొరబొయ్యేకుందికి దగ్గొచ్చేసింది. అన్నిటినీ తయాయించుకోని–

"ఇప్పుడీ దేఁవి అరకపోతా వుండాదనీ ఆ పన్జెయ్యల్ల. కయ్య పక్కన కయ్య. ఆ కయ్య సేస్తావుండేదీ నువ్వే! తెచ్చి యింట్లో పోస్తావుండేది నువ్వే! ఎవరి పేర్తో వుంటే యేఁవిప్పుడు?.... అయ్నా సెప్తే యినే జలమ్మయితే పరవాలే!.. అట్నేబో! నీ యిష్టం కాదనేదెందుకు;"

అయిదెకరాల కయ్య అబ్బయ్య గాంధీరెడ్డి పేర రిజిస్టరైపోయ్యింది.

ఊరి ముందర కానబాయి గెడ్డమింద కానగసెట్టు మూడుసార్లేఁ వో ఆకురాల్చి పూత పూసింది.

గాంధీరెడ్డి కలేకట్రయి ఆ ఊళ్లో అడుగుపెట్టేకుందికి అందురి మొకాల్లో పువ్వులు పూసినాయి.

ముత్తడు ముత్తన్నయినాడా ఊరోళ్ళకు!

"ముత్తన్నా! ఇంక నీకేవన్నా? నీ కొడుకు కలేకటరు కదన్నా! ఎప్పుడన్నా యేదన్నా పనీ పాటుండొస్తే అట్టా పలకరించన్నా!"

కయ్యాగాలవ దగ్గిర ఎదురు పద్దేసాలు ఊళ్లో సిన్నోళ్లు పెద్దోళ్ళు యిదే మాట!–

ముత్తడు మెలికలు తిరిగి పోతావుండాడు.

ఆ పొద్దు – పొద్దట్లా పొయ్యి మొలిస్తే గాంధీరెడ్డి ఎల బారిపోతాడు– ఎల బారిపోకముందు ఒక్కసారైనా తన బిడ్డకు మణుసారా కావిలించుకుందావఁని ముత్తడి మునాస. ఊళ్లో వాళ్ళంతా వొచ్చి పూలదండ్లేస్తావుంటే చూస్తా పులకరించి పోయ్నాడు. కావిలించుకుంటూవుంటే కంట తడిబెట్నాడు. తానూ కావిలించుకోవాలనుకున్నాడు. ఎందుకో జంకినాడు. అందుకే సఁవయంకోసరం ఎదురు సూస్తా వుండాడు.

పొద్దు నడిమిట్ట నుండాది. అబ్బా కొడుకు ఎదురెదురుగా కూచ్చోని ఏందో మాట్లాడుకుంటూ వుండారు. అదే అదుననుకుణ్ణాడు ముత్తడు.

ఉఁహూ! ఎంత సతపోర్నా తెంపు రాలా.

సేతిలో సెయ్యిబెట్టి 'నీ కొడుకును!' అనింది గ్యాపకం చేసుకుణ్ణాడు. పాయికట్టు పాయికట్టంతా నేరుంటే అందరి ముందర వొంగి దండం బెట్టింది తల్చుకుణ్ణాడు. యాదలేని గుండె నిబ్బరం దొరికింది.

ఒక్క వూవన యింట్లో దూరి గాంధీరెడ్డిని కావిలించుకున్నాడు.

పర్దేసిరెడ్డి తోక తొక్కిన తాను మాదిర పైకి లేసి ఎడం కాలతో ఎగిరొక్క తన్ను తన్నాడు.

ఎవుర్తో సెప్పుకోవాల్ల ఏఁవని సెప్పుకోవాల్ల? ఎట్లా మొక నెత్తుకోని తిరగల్ల? ఇంకీ బతుకెందుకు బతకల్ల?

కానగసెట్టు బోదె నానుకోని కన్జీకటి పడేదాకా ముత్తడిట్లా సతమతమవతానే వున్నాడు. వాడి కొక్క దారీ తెన్నూ కనిపించలేదు. ఇంకా కడపలో కాలు పెట్లేదు. ఆ పాయికట్లో యింకెక్కడైనా పన్జేస్తా తలకాయెత్తుకోని తిరగలేదు. సేతిలో వుణ్ణె అయిదెకరాల కయ్య – బంగారట్టా కయ్య సెయ్యి జారిపాయ.

ఇంకేం జెయ్యల్ల?

అట్టా యిట్టా జూసినాడు. బారడు దూరాన్నొక తీట్ర పొద. సివుక్కున లేసి రొండు తీగిలు గుంజుకున్నాడు. ఆకు దూసేసినాడు. అట్టా యిట్టా జూసినాడు. ఆ కన్జీకటి పడే యాళకాడ పురుగు మెదల్లేదు. గబిక్కున గుంత కుచ్చోని వొంక తీగిలో రొండు కాళ్లు పేర్చి కట్టేసుకున్నాడు. ఇంకొక తీగి కొన్నొకసేత్తో, యింకొక్కొన్ను నోట్తో పట్టుకోని తీగిను గిర గిరా తిప్పతా రొండు సేతులు ముడేసుకుణ్ణాడు. ఆ గెడ్డ మిందనుంచి అట్లానే బాయిలోకి దొల్లేసినాడు.

కలేకట్రు గాంధీరెడ్డి ఆ మరసట్నాటి పొద్దున్నే ఎకాఎకిని ఎలబారి పోయ్నాడు.

గంగాబవాని ముత్తణ్ణి మూన్నాళ్ళు కడుపులో దాసుకునింది. ఆ మిందట దాసుకునేదానికి యిష్టంవేలేక పోయ్యిందో లేకపోతే ముత్తడు శానా గొప్పోడని లోకానికి సాటాలనుకుణ్ణిందో – పైకి నెట్టేసింది.

కానబాయిలో ముత్తడి శవం తేలాడ్తా వుండాది.

ఎవురి కంట పడిందో, యేంవో? ముత్తడు బాయిలోపడి సచ్చిపోయ్‌నాడు; ముత్తడు బాయిలో పడి సచ్చిపోయ్‌నాడు; 'అన్న సంగతి ముక్కాలు గెడిలో మూడూళ్ళకు ఆ తరవాత మూడు మూడారూళ్ళకు కడకు ఆ వాయికట్టుకంతా పాకిపోయ్యింది.

మంచోడి సావును మరణవప్పుడు సూడమన్నారు పెద్దోళ్ళు!

పాయికట్లో జనం పాయలు పాయలుగా వస్తా వుండారు. బాయిసుట్టు తిరగతా పర్దేసిరెడ్డి 'ఔరో!' మని యేడస్తా వుండాడు. సేర్నోళ్ళందరూ యేడిక జూసేవోళ్ళు కొందరయితే ఎగజీదేవోళ్ళు కొందరుగా వుండారు, ఎవురూ ముందు పళ్ళా!–

పది మందిలో వణ్ణె పాంవయినా తప్పించుకుంటందేంవో గానీ, పదిమంది కంటబడిన శవాని కాగెతి పట్ట దీదేశంలో!

బండి కట్టె! – డబ్బా కిర్సనాలు!!

ముత్తడి కాయం మూడు నిమిశాల్లో బూడిదయిపోయ్యింది!

♦♦♦

నెల్నాళ్ళ తరువాత కలేకట్రు గాంధీరెడ్డి నేరుగా కార్లోనే వొచ్చి వూళ్లోనే దిగినాడు.

బస్సు రావడానికి కష్టం బండి పోవడానికి కిబ్బందిగా వుండిన వూరిప్పుడు కలెకట్రుగారూరు, కారు రావడానికి తార్రోడ్డే పడింది.

గాంధీరెడ్డి వచ్చీ రావడంతోనే పర్దేసిరెడ్డి యింటిముందర మల్లా ఊరంత పందిరేయించినాడు. పందిరి కింద సాపలు దుప్పట్లు పరిపించినాడు. ఒక మేజా ఎయ్యించినాడు. మేజా మింద మూడడుగులెత్తు ముత్తడి ఫోటో పెట్టించినాడు. ఆ ఫోటోకు సందిళ్లావు పూలదండేసినాడు. పక్కన దీపం స్తంబం పెట్టి ఒక్కసారిగా నాలుగొత్తు లెలిగించినాడు. సాంబ్రాణొత్తుల పొగ పందిరి కింద కుచ్చున్నోళ్ళతో సరసమాడతా వుండాది.

మేజాకు ఒక పక్క గాంధీరెడ్డి యింకొక పక్క పర్దేసిరెడ్డి కూచ్చుణ్ణారు.

కలేకట్రే నేలమింద కుచ్చునే కుందికి ఊళ్ళోవాళ్ళు నోట్లో కీగలుపోయేది కూడా తెలియకుండా సూస్తా వుండారేం జరిగిందో అని!

గాంధీరెడ్డి పైకి లేసినాడు. ఒకసారి ఊళ్లో వాళ్ళందర్నీ సూసినాడు. మల్లా మేజా వయిపు తిరిగి రొండు సేతులెత్తి ముత్తడి పటానికి మొక్కినాడు.

ఊళ్ళో వాళ్ళందరూ గాంధీరెడ్డికి మొక్కినారు.

'నే నిప్పుడు కలెక్టరు కావచ్చు. ఇంకేంవయినా కావచ్చు. కానీ నేను యిక్కడే మీ కండ్ల ముందర పుట్టినవాణ్ణి. ఈ నేల మీదనే ఆడుకున్నవాణ్ణి. ఇక్కడే పెరిగినవాణ్ణి. ఢిల్లీకి పాదుషా అయినా తల్లికి పిల్లడే గదా?– మీ కండ్ల ముందరే నన్ను మా నాన్న ముత్తయ్యకు దత్తత చేసినాడు. ఆయన త్యాగమూర్తి అనిపించుకున్నాడేకానీ, నా మాట ఆయనే గాదు మీరు కూడా మరిచిపోయినారు. దత్తు కొడుగ్గా నా కర్తవ్యాన్ని నేను నెరవేర్చలేకపోయాను. ఊరి పెద్దలుగా వుండి మీరు నాకా అవకాశాన్నివ్వలేకపోయారు. మా తండ్రి!... ఆయన బాధ ఆయనది. అతని కుడి భుజవే విరిగిపోయ్యింది. మీ కందరికీ తెల్సు పుట్టి బుద్దెరిగిన నాటి నుండి ముత్తయ్య మా యింటికి చేసిన సేవ, ప్రతి చెమట బొట్టూ మా పరం చేసినాడు. అటువంటి త్యాగమూర్తి పోయినపుడు ఏది మంచో? ఏది చెడో? నిర్ణయించే మన స్థిమితాన్ని కోల్పోయి వుంటాడు. మీరంతా ఏమైనట్లు? మీరైనా తగు నిర్ణయం తీసుకొని కాకితో కబురంపివుంటే రెక్కలు గట్టుకొని వచ్చి వాలేవాడిని. నా దత్తు తండ్రికి దహన సంస్కారాలు, కర్మ క్రియలు ఈ చేతులారా జరిపి వుంటే ఆయన ఆత్మ ఎంతో శాంతించేది. ఇప్పుడు మీరే చెప్పండి? – ఆయన ఆత్మ శాంతిస్తుందా? ఈ కృతఘ్నుణ్ణి క్షమిస్తుందా?"

ఆ పైన మాటలు రాక వల వల యేడ్చినాడు కలేకట్రు దొర!

"ఎంత పొరపాటు జరిగిపోయింది? ఎంత పొరపాటు జరిగిపొయ్యింద"ని నిట్టూరుస్తా వుంటారు పందిలి కింద జనం.

ఏడస్తా వున్న కొడుకును చూసి ఏడస్తా పైకి లేసినాడు పర్దేసిరెడ్డి.

"ఒరె నాయినా! ముత్తడు శానా గొప్పోడు, ముత్తడు శానా గొప్పోడు. వాడి గుండికాయి గాదె గుండంత. నువ్వు పడే కాకిసోకం వాడి సెవిని పడ్తానే వుంటందిరా! నువ్వు పడుతున్న పశ్చాత్తాపం జూసి ముత్తడాత్మ శాంతిస్తుందిరా! తప్పక శాంతిస్తుందిరా! ముత్తడు గొప్పోడురా! గొప్పోడు!!"

అబ్బా, కొడుకులు ఒకర్ని నూసి యింకొకరు యేడస్తా వుండే, ముత్తడున్నట్టుండి బాయిలో పడి ఎందుకు సావాల్నో ఆలోసించలేని ఎర్రి గుంపు. అబ్బా, కొడుకుల్ని సూసి 'అయ్యో పాపం' అని కంట తడిపెట్టింది.

అవును గదా మరి? సెల్లని కాసు గాంధీరెడ్డి 'రిజర్వేషన్ పాస్‌పోర్ట్' తో కలెకట్రుని సేసిన ముత్తడు గొప్పోడు కాక యింకేంవవుతాడు?

**(ఆంధ్రజ్యోతి వారపత్రిక 11-3-1983)** ♦

## పుల్లలభాష

- మెట్టానాగేశ్వరరావు
9951085760

ఇంటికి పక్కన మూలగా పడుంటాయి
కొన్ని చిందరవందరగా
కొన్ని అలమర్లో మడిచి పెట్టిన బట్టల్లాగా
పుల్లలు
పేదవారింట ప్రత్యేకంగా కళ్లను తడతాయి..!

అన్ని పుల్లలూ మాట్లాడతాయి గానీ
అన్ని పుల్లలూ ఒకేలా మాట్లాడవు
అందరు మనుషులూ బతుకుతారు గానీ
అందరూ ఒకేలా బతకనట్టుగా...!
పుల్లలు మాట్లాడటమంటే..
ఇంతకీ జ్వాలనాల్కలతో మంటభాష!
కొన్ని పీల జ్వాలలు...
కొన్ని పూనకం జ్వాలలు...
పీల జ్వాలలు
గుడిసెల్లోని చీకటిలా వెలిగితే
పూనకం జ్వాలలైతే
ధనవంతుడి దర్పంలా మండుతాయి!
చేవున్న పుల్లలకే లోకుల జేజేలు
బెండుపుల్లలకేమో ఛీదరింపులే నిత్యం!



పుల్లలైనా వూరకనే దొరకవు
అవి కండ గలవాడి పక్షమే వహిస్తాయి
ఒక్కోడు గొడ్డలెత్తితే
మొద్దు మరింత మొద్దవుతుంది
బలుపు గలోడు గనెయ్యగానే
గెలుపునిచ్చి లొంగిపోతాయి...
ఇలాంటప్పుడే..
పుల్లలూ పక్షపాతం పక్షం వహిస్తాయంటాను!

చివరఘట్టం దగ్గర
పుల్లలది మళ్లీ పక్షపాతమే.....
పేదోడికాష్టాన్ని
గంధపుచెక్కలు ఏనాడూ వరించవు!

అందుకనేనేమో...
గ్యాసుపొయ్యి మీద
పుల్లల పక్షపాతబుద్ధి దగ్ధమౌతున్నది! ♦

## నా పల్లె

- శాంతి కృష్ణ
9502236670

ఏడబోయిందో నా పల్లె కాన రాకుంది
పండు వెన్నెల్లో మెరిసేటి ఇసుక తిన్నెలే
కలనేత చీరలో కులికేటి నాయుడు ఎంకల్లే....
గున్నమామిడి కొమ్మపై పాడేటి గండు కోయిలల్లే
నిండు చూలాలు పొందిగ్గా నడిచేటి గోదావరల్లే....
ఏడబోయిందో నా పల్లె కానరాకుంది...



గజ గజ వణికించు చలి పొద్దుటేళల్లో
ఇంటి ముందేసే భోగి మంటల్లో
ఎంత చలికాచుకుందో నా పల్లె....
సంకురేతిరేళ రంగు ముగ్గులేసి
గుమ్మడి, తంగేడు, గునుగు పూలెట్టి....
పట్టు పరికిణీలతో చిట్టి పాపాయిలు ఆడేటి
గొబ్బి పాటల్తో ఎంత మురిసి పోయేదో నా పల్లె...

సందెపొద్దుటేళ గోధూళి తోటి
నింగి మేఘమేదో నేల చేరినట్టు....
అమ్మ రాక కోసం చెంగుమని దూకేటి
లేగ దూడల మువ్వల చప్పుళ్ళతో....
ఎంత ముద్దుగుండేదో నా పల్లె....
కూనిరాగాల తోటి వరినాట్లు వేసే
కూనలమ్మలను చూసి
నింగి నుండి జారేటి చినుకు సవ్వళ్ళతో...
పల్లె గుండెలోన ప్రేమ పల్లవులు తొడిగేవి...

ఇపుడేమో....
కానరాని చినుకుల్లకై నింగిని చూసే రైతన్న
గుండె బరువుతోటి కన్నీటి చెలమలయ్యేను....

అందుకేనేమో....
నేడు...కానరాకుంది నా పల్లె....
ఏడబోయిందో ఎవరికీ ఎరుకలేకుంది...!! ♦

## విశ్లేషణ




# సమానత్వమే వీరబ్రహ్మం తత్వం

- జంధ్యాల రఘుబాబు
9849753298

***ఆయనలోని సామాజిక కోణాన్ని చూడవచ్చు. ఆ కోణాన్ని వెలికి తీసే పని ఎన్నడూ లేని విధంగా నేడు మన ముందుంది. నేటి దేశ కాల పరిస్థితుల్లో ఆ మహనీయుడు చెప్పిన కొన్ని విషయాలను వెలుగులోకి తేవలసిన అవసరం ఏర్పడింది. ఆయన చెప్పిన తత్వాలను అధ్యయనం చేసి అందులోని సాంఘిక కోణాన్ని వెలికి తీయవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది.***

“నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవద్దు, జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు” అని సినారె ఓ పాటలో రాశారు. ఆ పుణ్యమూర్తులు చూపిన మార్గం అనసరించుటే నీ ధర్మం అని, ఆ సంస్కర్తల ఆశయంగ నీవు నిలిచిన ఈ సంఘం అని కూడా భోదిస్తారు. అలాంటి పుణ్యమూర్తుల్లో, మహనీయుల్లో, సంస్కర్తల్లో వీరబ్రహ్మం కూడా ఒకరు. అందుకే అయన్ని స్మరించుకోవడం.

సమాజంలో కొంతమంది వ్యక్తులకు కొన్ని ముద్రలు పడతాయి. ఆ అభిప్రాయాలను దాటి ప్రజలు వారిని చూడడం చాలా కష్టం. కొందరు మహనీయుల పైన కూడా అవి తమ ప్రభావాన్ని చూపుతాయి. అలా పోతులూరి వీరబ్రహ్మాన్ని కూడా కాల జ్ఞానం చెప్పిన వేదాంతిలాగే చూస్తున్నారు. నిజంగా ఆయన జీవితపు లోతుల్లోకి వెళ్ళి, ఆయన రచనల్ని చదివితే ఆయనపై మనకున్న అభిప్రాయాలు మారతాయి. అందుకు ఉదాహరణ ఆయన రాసిన కాళికాంబ శతకం. అందులో ఆయన ఓ హేతువాదిగా కనిపిస్తాడు. ప్రతి స్త్రీని తన తల్లిగా భావిస్తానంటాడు. తనను దేవుడిగా చూడొద్దంటాడు. అలాగే అంటరానితనాన్ని నిరసిస్తూ ఆయన రాసిన తత్వాలు కూడా ఉన్నాయి. అలా ఆయనలోని సామాజిక కోణాన్ని చూడవచ్చు. ఆ కోణాన్ని వెలికి తీసే పని ఎన్నడూ లేని విధంగా నేడు మన ముందుంది. నేటి దేశ కాల పరిస్థితుల్లో ఆ మహనీయుడు చెప్పిన కొన్ని విషయాలను వెలుగులోకి తేవలసిన అవసరం ఏర్పడింది. ఆయన చెప్పిన తత్వాలను అధ్యయనం చేసి అందులోని సాంఘిక కోణాన్ని వెలికి తీయవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది.

శివపార్వతులను సమానంగా చూస్తాడు వీరబ్రహ్మం. “శివుడు లేని చోట శివయుండనేరదు/ శివములేని చోట శివుడు లేడు/ శంకరుండు శివము చంద్రచంద్రికలట్లు” అని చంద్రుడు వెన్నెల లాగ, పాలు నీళ్ళ లాగ ఇద్దరూ కలిసిపోయిన వైనాన్ని చెబుతాడు. స్త్రీని పురుషుడితో సమానంగా చూడడం ఈయన తత్వం. అలాగే పాప పుణ్యాలపై కూడా ఆయన ఆలోచనలు వేరుగా ఉంటాయి. పుణ్యక్షేత్రాలు తిరిగినంత మాత్రాన పాపాలు పోవని చెబుతాడు. “ఆశపాశములకు కూసమ్ము దొడుగక/ కాశిపోదునన్న కలదె ముక్తి?” అని, “ఏడు కొండలెక్కి చూడబోయిన వాడు/ కలతలంది బోడి తలగ వచ్చు/ ఏడు మెట్టులెక్కి ఈక్షింప మోక్షంబు” అని ప్రశ్నిస్తాడు.

వీరబ్రహ్మం చూపించే సమానత్వం ఎంతదాకా పోయిందంటే దేవుళ్ళను కూడా ఆయన వదిలిపెట్టలేదు. శివకేశవులను కూడా సమానంగా చూస్తాడు. శైవులు, వైష్ణవుల మధ్య వైరం అందరికీ తెలుసు. శివకేశవులు ఒక్కటేనని చెప్పిన తిక్కన సోమయాజి మాటలు కూడా ఇక్కడ మననం చేసుకోవాలి. "కూడు లోకములకు కాడౌను పదయాత్ర/ పరమ సత్యలోకపరుడు శివుడు" అనడం వెనుక ఎన్నో అర్థాలు దాగున్నాయి. కాడు అంటే స్మశానం. ప్రపంచంలో అతి ధనవంతుడి నుండి అతి నిరుపేద వరకు అందరూ కాడు చేరవలసిందేనన్నది బ్రహ్మం గారి తత్వం. వేమన చెప్పినట్టే శివకేశవులు ఒకటేనని చెబుతాడు బ్రహ్మం గారు. "హరి దలచిన హరు దలచిన/ తిరమగు ధైర్యమ్ము గలుగు దీనత తొలగన్/ హరి హరులను సేవింపక/ స్థిరముగ ఈ భక్తుడగుట చెల్లదు కాళీ!" అని ఆ ఇద్దరిని సేవించడం కాళిని సేవించడమే అంటాడు. ఇక్కడ శివకేశవులు సమానమంటూనే స్త్రీ పురుషులు కూడా సమానమన్న భావం వ్యక్తమవుతుంది. "శివుడంటేనేమి కేశవుడంటేనేమి/ శివకేశవుల మీది శిఖరాన వెలిగేటి/ చిన్మయ రూపుని చేరగల్గితిమేని" అని నచ్చజెబుతాడు. "శివహరి పురులొకటె చిక్కు తెలియ వేరు/ శివుడు హరియునేరి? చింతయేది?/ శివ గురువుల ధర్మ చిహ్నంబు లెరుగరో" అంటుంటే వేమన పద్యం "శివమతమున కెల్ల జెలగు హరి గురువు....." గుర్తొస్తుంది.

శిష్యుడి వేలును కోరిన, కన్నునే కోరిన గురువులను, విద్యనిచ్చినాక కూడా కులం వేరని తెలిసి వాటిని వెనక్కు తీసుకున్న గురువులను చూశాము. వారి ప్రియ శిష్యులను చూసినాము. కులమో, గోత్రమో, ఇంకోటో చూసి తమ శిష్యుల్లో ఒకరినే ప్రియులుగా చేసుకొని, దానికి గురుభక్తి అని పేరుపెట్టిన గురువులు వారు. అలా శిష్యులను సమానంగా చూడలేని గురువు ఒక గురువేనా అన్న అనుమానం మనక్కలుగుతుంది. ఇక్కడే వీరబ్రహ్మం మన మనసుల్లో నిండిపోతాడు. తన దగ్గర ఉన్న శిష్యులనే కాదు, శిష్యుల ఏరికలో కూడ వీరబ్రహ్మం చూపే సమానత్వం ఆయనను, ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయనలోని మూర్తిమత్వాన్ని ఓ శిఖరం పై కూచోబెడుతుంది. సిద్ధయ్య అని పిలువబడే షేక్ సయ్యద్ సాహెబ్, కక్కయ్య ఆయన భార్య ముట్టు, యాగంటి లక్ష్మప్ప, రెడ్డప్పస్వామి, అచ్చమ్మ, అన్నాజయ్య, మఠ్రి చిన్నయ్యాచార్యులు, ఆనంద భైరవ యోగి, జగ్గరాజు ఇలా వైవిధ్యమైన శిష్యగణం ఒక్క వీరబ్రహ్మానికే చెల్లు.

"గురుడనగా పరమేశుడు/ గురుతనగా బ్రహ్మ మంత్ర గుహ్యం తానౌ/ గురు శిష్యులొక్కటగుటే/ గురి కుదురుట యనియె" అని గురువే దేవుడని చెబుతూనే గురు శిష్య సంబంధాన్ని, దాని ప్రయోజనాన్ని తెలుపుతాడు. గురువు గుణాన్ని తెలుపుతూ "మనసు స్వచ్ఛమైన మంచువంటిది గదా/ దినుసు దినుసు మనసు తిప్పనేల/ మనసుగన్న యపుడె దినుసు తెల్లంబగు" అని చెప్పిన వీరబ్రహ్మం మనస్సు ఎంత తెల్లనిదో మనకు తెలిసిపోతుంది. ఉల్లిగడ్డలకు కూడా ఉపదేశమిచ్చే దొంగ గురువులను హాస్యంతో దెప్పిపొడుస్తాడు వీర బ్రహ్మం. ఆయన గురు శిష్యుల్లో నాణ్యతను చూస్తాడు. అది కులం వల్ల, పుట్టుక వల్ల రాదు శిష్యుడి సామర్థ్యం వల్లే వస్తుందని నమ్ముతాడు. అందుకే అతని శిష్యులను చూసినప్పుడు వారి ఎంపికలో ఎటువంటి స్క్రీనింగ్ టెస్టులు లేని ఒక సమతావాది ఆయనలో కనిపిస్తాడు. "రాముని దయ రాజులకును/ రాముని చరణములె శరణు రాజులకున్/ రాముడె పరాన్న భుక్కయి/ స్వాముల దయగోరి గుడికి వచ్చెను కాళీ" అని దేవుడిని బంధించినవాళ్ళు గురువులైపోయి ప్రజలను మోసం చేస్తున్నారని చెబుతాడు వీరబ్రహ్మం.

వీరబ్రహ్మం వ్యక్తిత్వంలోని లక్షణమే సమానత్వం. అన్ని కులాల, మతాల,భాషల ప్రాంతాల వాళ్ళను ఒకటిగానే చూస్తాడు. దేవుడు భక్తుడు ఒకటేనంటాడు. దేవుళ్ళందరూ ఒకటేనంటాడు. స్త్రీ పురుషులు ఒకటేనంటాడు. గురు శిష్యులు ఒకటేనంటాడు. వీరందరూ వేరువేరని చెబుతున్న నేటి రాజకీయ, సామాజిక నేపథ్యంలో వీరబ్రహ్మం రచనలు ఎంతగానో ఉపయోగపడతాయి. జనులందరిని ఏదో ఒక అంశం వెదికి వేరు చేయాలని చూస్తున్నవారికి కనువిప్పుకూడా కలుగుతుందని ఆశిద్దాం. ఆశించలేకున్నా, అలా విడగొట్టే వారి గురించి ప్రజలు తెలుసుకోవడం మాత్రం జరుగుతుంది. పోతులూరి వారి రచనల సమకాలీనత, ప్రాసంగికత మనకు సహాయం చేస్తాయి కూడా.

♦

# జీవన వృత్తి

- డా. నాగశేషు
9985509053



ఉన్నికుప్పను పాయలు చేసి దూదిలా ఏకి
ఉందా లేదా అన్నట్లు శరీరమూలాల్లో
సూక్ష్మకణాలుగా దాక్కొన్న తుంటి నెత్తుర్ని పిండి
వైఫల్యాల ఎండలో ఎండిన  కండరాలను చింతపిక్కలు చేసి
కరువురాయిలా పడివున్న  బాధలరుబ్బుగుండుతో
బార్లీజావలా మెత్తగా రుబ్బిన సర్రిని సిద్ధపరుస్తాను
హేమంతానికి  కంబలి చీరను
కానుకగా ఇచ్చి సాగనంపడానికి
సామాన్యుడి ఇంట శుభకార్యాలను
సంప్రదాయ పద్ధతిన ఆహ్వానించడానికి
శుష్కించిన దేహానికి శూన్యం కప్పుకొని
కటిక పేదరికపు కాలనాగు కర్కశంగా కాటేస్తున్నా
అఖిల గ్రహాలు కులవృత్తిని నొసెల్లను
మొసళ్లంత నోరు చేసి వెక్కిరిస్తున్నా
మోచేతుల్ని కడుపులోకి ఒత్తుకొని
ఉండచుట్టుకున్న  ఆకలిని
నిరాశల వాయువును నిండుగా నింపుకున్న  పేగుల్ని
నమ్మకంగా నడివీధిలో విప్పదీస్తావు
మార్పురాదని తెలిసినా ఏదో చిన్న ఓదార్పుకోసం
వార్పును తలోపక్క రాతిగుంజలకు బిగదీసి
నెలల శిశువును నాజూకు చేసినట్లు
బలుపెక్కిన దుర్వ్యవస్థపై ధర్మరసం పైపూతలా
వంచిన వార్పుకు  దోసిళ్లతో
సుతారంగా సర్రిలేపనం చేస్తావు
పరువులా ఆరబెట్టి చీకటిని చక్రంగా,
కలల్ని కదురుగా చేసుకొని
బతుకుని రాట్నంగా చేసి
ఆలోచనానుభవాల రెండుపాదాల్ని
మగ్గంగుంతలోకి దింపి
ఆగిపోలేని ఊపిరిని పేకలా పడుగు మధ్యలో
శుభలాభాల్లా కాకుండా
కష్టనష్టాల్లో కుడిఎడమలకు  పేకను
జీవన వస్త్రాన్ని సాలీడులా అల్లుతావు
పెనబడ్డ పోగులను దంతాల బేవుతో గట్టిగా బిగతట్టి
పోగుబంధాన్ని పేగుబంధంగా రూపుదిద్దుతావు
ఎదిగిన బిడ్డలా తయారైన కంబళ్ని
మురిపెంగా లొట్టలు పడ్డ చెంపలకు
ఎప్పుడో వేయి వ్రక్కలైన  ఎదకు హత్తుకొని
ఎగఊపిరిని కూడదీసుకొని ఆంత్రమూలంలా వంగిన
భుజం మీద అత్రంగా పెట్టుకొని పోయి
ఖర్చులకు అదాయానికి కనీస పొంతనలేని ధరకు
బజారులో విక్రయిస్తావు
ఎలుకలు దూరిన అట్టపెట్టెకు
అరిటాకు అడ్డంపెట్టినట్టు
పెరిగిన పెట్టుబడికి కొంత శరీరప్రయాస
తాత్కాలిక ఉపశమన మందుకోసం
వచ్చిన సొమ్మును తీసి తగలేసి
నిట్టూరుస్తూ ఇల్లుచేరి
నాలుగు కారం మెతుకులైన మింగుదామని
కంచం ముందు కూసుంటే
అన్నమంతా గొర్రెబొచ్చులో పొర్లాడినట్లు
పురుగుల్లా అగుపిస్తుంటే
తినాలో విడవాలో, చావాలో బతకాలో తేల్చుకోలేక
నెట్టుకు రాలేని జీవనవృత్తిని
నెత్తినెట్టుకున్నందుకు  నిరసనగా
గాల్లోకి కత్తులు విసిరి మెడ ఆన్చినట్టు
తననుతాను నిందించుకొంటూ
వెంట్రుక పిడసల్లోకి వెర్రి తల దూర్చి
గొర్రెలా మళ్లీ అక్కడే. ♦

# ఆధునిక కథ - ప్రస్థానం

## సాహిత్య శాస్త్రం - అవగాహన




- జయంతి పాపారావు
0891-2557961

మనిషి రెండు జగత్తులలో – రెండు జగత్తులతో – జీవిస్తాడు. ఒకటోది పాదార్థిక జగత్తు. రెండోది సౌందర్య జగత్తు. పాదార్థిక జగత్తుకు 'హేతువు' మూలాధారం. సౌందర్య జగత్తుకు 'మనోస్పందన' మూలాధారం.

ఆలోచన – తర్కం – హేతువు – విశ్లేషణ – వంటి లక్షణ పరికరాలు, ఆలోచన – ప్రయోగం–నిర్ధారణ – అనువర్తన – సాధన – నిర్మాణం – నూతన ఆవిష్కరణ – వంటి క్రమ పరిణామ పరికరాలు, పాదార్థిక జగత్తులోని 'వస్తుధర్మం' 'సత్యం' నిర్ధారించి మానవ జీవితంలో ఉపయోగపడేటట్లు నిగ్గు తేల్చి, ఆవిష్కరిస్తాయి.

ఆ విధంగా మానవ జ్ఞానాన్ని 'శాస్త్ర'మనీ, 'కళ'అనీ, ప్రధానంగా రెండు విభాగాలుగా చూస్తాం. భౌతిక ప్రపంచానికి సంబంధించిన క్రమబద్ధమైన జ్ఞాన సమాచారమే 'విజ్ఞానశాస్త్రం'గా నిర్వచిస్తారు. జ్ఞానసమాచారం మళ్ళీ రెండు విభాగాలుగా విభజించి చూస్తారు. మొదటిదాన్ని 'విజ్ఞానశాస్త్రం' అంటారు. రెండోదాన్ని 'శాస్త్రం' అంటారు. విశిష్టమైన జ్ఞానస్వరూపమే 'విజ్ఞానం'గా పరిగణిస్తారు. 'విజ్ఞానశాస్త్రం'గా పరిగణిస్తారు. ఆ 'విశిష్టత' ఏమిటి? నిగ్గు తేల్చి ఆవిష్కరించిన 'వస్తుధర్మం' 'సత్యం' ప్రమాణంగా తీసుకుని 'విశిష్టత' విజ్ఞానం' నిర్ధారిస్తారు. సుదీర్ఘకాల – ఇంకా నిజంగా చెప్పుకోవాలంటే – శాశ్వత వస్తుధర్మం, శాశ్వతసత్యం ఆధారంగా నిర్ధారిస్తారు. భౌతిక ప్రపంచానికి సంబంధించిన క్రమబద్ధమైన జ్ఞానసమాచారంలోనే శాశ్వత వస్తుధర్మం శాశ్వత సత్యం ఉంటుంది కాబట్టి, దాన్ని 'విజ్ఞానశాస్త్రం' అంటారు. భూమ్యాకర్షణ – సౌరశక్తి – వంటి ఎన్నెన్నో భౌతిక ప్రపంచానికి సంబంధించిన జ్ఞానసమాచారం శాశ్వతసత్యంతో ఆవిష్కరించబడింది. ఆ విధంగా 'విజ్ఞానశాస్త్రా'న్ని మౌలికంగా భిన్నంగా చూస్తాం. విషయ సమాచారమే 'జ్ఞానం' అంటారు. అయితే శాశ్వతసత్యం అంటే మార్పు చెందనిది ఎంతమాత్రం కాదు. క్రమబద్ధ జ్ఞాన సమాచారం విస్తరించుచున్న సందర్భంలో, నూతన ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటున్న సందర్భంలో వస్తుధర్మం, శాశ్వతసత్యం కూడా మార్పు చెందొచ్చు. కోపర్నికస్, గెలీలియో, న్యూటన్‌ల నూతన ఆవిష్కరణలతో విజ్ఞానశాస్త్రం, ఆధునిక విజ్ఞానశాస్త్రంగా పదహారు పదిహేడు శతాబ్దుల్లో పరిణామం చెందింది. సంపూర్ణ పరిమాణ విశ్లేషణ పద్ధతి Complete quantitative method వచ్చింది. జ్ఞాన సేకరణలో – ఆగమన పద్ధతి (Inductive Reasoning), నిగమన పద్ధతి (Deductive Reasoning), ఏర్పడ్డాయి. ఆనాటినుంచి విజ్ఞానశాస్త్రం వేగవంతంగా వికాసవంతమౌతూ విస్తరిస్తూ వస్తోంది. మనిషి భూమ్మీదే ఎందుకు జీవించాలి? ఇతర గ్రహాల్లో జీవించలేడా? అన్న స్థాయిలో 'విజ్ఞానశాస్త్రం' చంద్రలోకంలోకి చూస్తోంది!

చిరునవ్వు పెదాలమీద చిందులు తొక్కని మనిషి ఎవడూ ఉండడు. కన్నీళ్లు కార్చని మనిషీ ఉండడు. కళ్లల్లో కాంతులు భాసిల్లని మనిషంటూ ఎవడూ ఉండడు. పళ్లు పటపట కొరకని, తలపట్టుకోని, తల తడుముకోని మనిషిసలు ఉండనే ఉండడు. ఆనందం, ఆగ్రహం, దుఃఖం, భావోద్విగ్నత

వంటి అనుభూతి చెందని, పొందని మనిషనలు ఉండనే ఉండడు. వీటికి 'మనోస్పందన' మూలా ధారమౌతుంది. వీటి నిర్వహణ 'కళ' విభాగంలో జరుగుతుంది.


జయంతి పాపారావు

శాస్త్రం, కళ రెండూ కలిసే పరస్పరం సహకరించు కుంటూ పనిచేస్తాయి. విరోధిస్తాయి కూడా. రెండింటి విధి నిర్వహణలూ విభిన్నమైనవి అయినా, రెండింటికీ అవసరమైన అంశాలు చాలా ఉన్నాయి. ఆ అంశాలు ఆ రెండింటినీ దగ్గర చేస్తూ కలిసి పనిచేసే 'సంస్కృతి'ని నిర్మిస్తాయి.

రెండింటికీ 'అభివ్యక్తి' మాధ్యమం భాషే, రెండింటికీ 'అభివ్యక్తి' అనివార్యమైనదే. రెండింటికీ 'సృజనాత్మకత' అత్యంత అవసరమైనదే. ఒకటోది భౌతిక సుఖానిస్తే, రెండోది మానసిక సుఖాన్ని అంటే ప్రశాంతత, శాంతినిస్తుంది. రెండూ మానవ శ్రేయం లక్ష్యంగా కలవే. రెండూ 'మనిషి' కేంద్రంగా పనిచేసేవే. ఆ రెండింటి కలయికలో పరస్పర సహకార సంస్కృతిలో మనిషిలోని క్రియాశీలశక్తి, నైపుణ్యస్థాయి పెరుగుతాయి. ఆ రెండూ కలిసి పనిచేయకపోతే, మానవ జీవితంలో 'సంపూర్ణత' ఉండదు. ఆ రెండు సుఖాల్లో ఏ సుఖం లేకపోయినా, జీవితం 'వెలితి'గానే సాగుతుంది. ఒంటెద్దుబండి లాగే సాగుతుంది.

ఆ విధంగా పరిశీలిస్తే 'కళ', 'శాస్త్ర' స్వభావానికి విరోధీ కాదు, దూరం కూడా కాదు. చాలా దగ్గరి సంబంధమే ఉంది. 'శాస్త్రం' విజ్ఞానదాయకమంటారు. 'కళ' వినోదదాయకమంటారు. శాస్త్రం, సాంకేతిక, సామాజిక ప్రగతిలో – శాస్త్రం 'కళ' విధిని కూడా నిర్వర్తిస్తుంది. వినోదాన్ని, ఆనందాన్ని పంచుతుంది. ఉదాహరణగా చెప్పుకోవాలంటే, 'మెదడు' యొక్క సృజనాత్మక విధిని పంచుకుంటున్న కంప్యూటర్ విజ్ఞానం, 'కళ' విధిని నిర్వర్తిస్తుంది. 'కళ' కూడా 'శాస్త్రం' విధి నిర్వర్తిస్తుంది. ఉదాహరణగా శాస్త్రానికి 'సృజనాత్మకత'ను అందిస్తుంది. ఉదాహరణగా అణువిజ్ఞానం ప్రయోజనంతోపాటు సృష్టిస్తున్న విధ్వంసాన్ని అదే విధంగా ప్రపంచీకరణ సృష్టిస్తున్న విధ్వంసాన్ని 'కళ' విశ్లేషించి, శాస్త్రం కంటే ముందే ముందడుగు వేసి ప్రజలముందు పెడుతుంది.

ఆ విధంగా 'కళ' శాస్త్ర స్వభావాన్ని, 'శాస్త్రం' కళ స్వభావాన్ని సంతరించు కుంటున్నాయి. పరస్పరం విధులను పంచుకుంటూ సహకరించుకుంటున్నాయి.

గెలీలియో 'భూపరిభ్రమణ సిద్ధాంతం' (క్రీ.శ. 1640) నుంచి విజ్ఞాన సమాచారం విస్తృతమౌతూ వస్తోంది. ఆ విజ్ఞానం ప్రభావంలో, యాంత్రీకరణ ప్రభావంలో, పారిశ్రామికీకరణ ప్రభావంలో సామాజిక జీవన విధానాల్లో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. నూతన జీవన 'సంస్కృతి'కి మార్గాలు ఏర్పడ్డాయి. నూతన జీవన సంస్కృతికి 'హేతువు' ప్రధాన పాత్రధారి అయింది. ఆ ప్రభావంలో నూతన జ్ఞాన సమాచారం పలు శాఖాలుగా వర్గీకరింపబడింది. ఈ వర్గీకరణలో– ఓ గొప్ప సూత్రం కనిపిస్తుంది. ఏ శాఖాకాశాఖ అభివృద్ధి చెందుతూ, ఇతర శాఖలతో పరస్పరం సహకరించుకుంటూ, పరస్పరాభివృద్ధి జరిగేలా నిర్మాణం జరిగింది. విజ్ఞానశాస్త్ర పద్ధతులు పలు సామాజిక శాస్త్రాల్లో ఉపయోగించడం ప్రారంభమైంది. సంపూర్ణ పరిమాణ విశ్లేషణ పద్ధతి Complete quantitative method అదేవిధంగా, సమాచార సేకరణ, వర్గీకరణ, విశ్లేషణ, సూత్రీకరణ వంటి పద్ధతులు ఉపయోగంలోకి వచ్చాయి.

ఆ విధంగా ఒకవైపు విజ్ఞానమానం, మరోవైపు సమసమాజం లక్ష్యంగా శాస్త్రజ్ఞానం ముందుకి సాగుతూ వస్తోంది. సమస్త కళల్లో, సాహితీకళ, అగ్రస్థానం ఆక్రమించుకుంది. 'అక్షరం' ఆయుధంగా ఉండబట్టే, అగ్రస్థానాన్ని దక్కించుకుంది. శాస్త్రజ్ఞాన ప్రభావంలో, చరిత్ర ప్రభావంలో సాహిత్యం తన గురించి తాను పరిశీలించుకుంది. 'కళ' 'కళ'గానే ఉండిపోవాలా? అని ప్రశ్నించుకుంది. సమస్త శాస్త్రాలు 'హేతువు' ఆధారంగా అభివృద్ధి చెందుతున్నాయి. సామాజిక జీవనం 'హేతువు' దిశలో 'నూతన సంస్కృతి' కోసం పెనుగులాడుతోంది. అటువంటప్పుడు, సాహిత్యం 'హేతువు'ని స్వీకరించి, నూతన సంస్కృతి కోసం ఉన్నతీకరణ కోసం ఎందుకు విస్తృతం కాకూడదు? అన్న ఆలోచనా విధానం రూపుదిద్దుకుంది. ఆ విధంగా సాహిత్యం, సామాజిక బాధ్యతను తనమీద వేసుకుంది. ఈ సందర్భంలో కోమ్టే అనే తత్త్వవేత్త ప్రతిపాదించిన సౌమ్యవాదం (Positivism) సారాంశాన్ని గుర్తు చేసుకుందాం.

"దైవ సంబంధమైన ప్రాథమిక స్వరూపం నుంచి శక్తి, బలం, ఆకర్షణ, వంటి జ్ఞానదశకూ, తదుపరి ఉత్పత్తి యంత్రం, వేగం వంటి శాస్త్ర వినిమయ దశకూ మనిషి

పురోగమనం అనివార్యం". దీన్ని 'ప్రత్యక్ష జ్ఞానవాదం' అని కూడా అంటారు. కారల్‌మార్క్స్ దీనివల్ల ప్రభావితుడైనట్లు తెలుస్తుంది. అయితే అతడే మార్పుకి అవసరమైన ఆచరణ లేదు అని విమర్శించాడు. 1867లో 'పెట్టుబడి' గ్రంథం వచ్చింది. పలుశాస్త్రాల జ్ఞానాన్ని తనలో ఇముడ్చుకుని, 'మిశ్రమ జ్ఞానతత్త్వం'గా రూపుదిద్దుకుంది. ఫ్రాయిడ్ 'మనోవిశ్లేషణ' 1890లో వచ్చింది.

హేతువు, మార్క్సిజం, ఫ్రాయిడిజం ప్రభావంలో, సాహిత్యం "విజ్ఞాన సమాజంలో", "వర్గరహిత సమాజం" లక్ష్యాల దిశలో శాస్త్రజ్ఞాన స్వరూప స్వభావాలు సంతరించుకుని ముందుకు సాగుతూ వస్తోంది. వర్గరహిత, కులరహిత, వివక్షరహిత సమసమాజ ప్రజాస్వామ్య సహజీవన సంస్కృతి కోసం సాహిత్యం పనిచేస్తోంది. శాస్త్ర విధులను నిర్వర్తిస్తుంది. ఆ విధంగా సాహిత్యం సాహిత్యశాస్త్రంగా పరిగణింపబడింది. సాహిత్యశాస్త్రం, సామాజికశాస్త్ర పద్ధతులను ఉపయోగిస్తుంది.

1. భాష, సాహిత్యప్రక్రియ, సాహిత్య మాధ్యమం వంటి సాహిత్య అంశాలకు 'పరిణామ సిద్ధాంతం' వర్తిస్తుంది.

2. సాహిత్య పరిశోధనల్లో సామాజిక శాస్త్ర పద్ధతులను ఉపయోగిస్తారు. సమాచార సేకరణ, వర్గీకరణ, విశ్లేషణ, సూత్రీకరణ పద్ధతులు వాడుతున్నారు.

3. గతితర్కం, చారిత్రక వాస్తవం, చారిత్రక చిహ్నం, చారిత్రక పరిణామం వంటి పలు చరిత్ర పద్ధతులు సాహిత్యంలో వినిమయమౌతున్నాయి.

4. సాహిత్యం రచించే వాడికోసం కాదు. అది ప్రజల కోసం, ప్రజాచైతన్యం కోసం, అన్న ఉన్నతమైన ప్రజాస్వామ్యతత్త్వం కలిగి ఉంది.

5. శాస్త్రస్వభావం ఉన్న 'సామాజిక వాస్తవికతా కళారూపం' ఆధునిక సాహిత్యంలో ప్రముఖపాత్ర పోషిస్తుంది.

6. ఇతర శాస్త్ర జ్ఞానాలతో కలిసి పనిచేసే పరస్పరాభివృద్ధి సంస్కృతి అలవరచుకుంది.

7. సాహిత్య అంశాలకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణలో అంతిమఫలనిర్ధారణలో గణితపద్ధతులు ఉపయోగిస్తుంది.

ఆ విధంగా స్వరూప స్వభావాల్లో, విధి నిర్వహణల్లో, పద్ధతుల్లో సాహిత్యశాస్త్రంగా పరిగణింపబడి పరిణతి సాధిస్తుంది. సాహిత్య ప్రక్రియలు కూడా సాహిత్యశాస్త్రంగా పరిగణింపబడ్డాయి. శాస్త్రీయ నియమాలతో కూడకుని ఉన్న భాషాశాస్త్రం, ఛందోశాస్త్రం, అలంకారశాస్త్రం, వ్యాకరణశాస్త్రం నాట్యశాస్త్రం వంటివి ప్రాచీనయుగంలోనే శాస్త్రాలుగా పరిగణింపబడ్డాయి. అయితే వాటి ప్రాతిపదిక విభిన్నమైంది. వాటివైన వాటి సొంతమైన, శాస్త్రీయ నియమాల వల్లే అవి శాస్త్రాలుగా పరిగణింపబడ్డాయి.

సాహిత్యకారుడు, ఆర్థిక విషయాలు పైన ఆర్థిక శాస్త్రవేత్తలా ప్రతిభావంతంగా ప్రత్యేక నైపుణ్యంతో రాయగలడా? అదేవిధంగా సామాజిక, రాజకీయ సాంస్కృతిక విజ్ఞానశాస్త్ర విషయాలపైన ఆయా శాస్త్రజ్ఞుల్లా రాయగలడా? ఆ విధంగా రాయలేడు కాబట్టి ఆ విషయాల్లో తల దూర్చడమెందుకు? దానివల్ల ఒనగూరుతున్న ప్రయోజనం ఏమిటి? తన పనిని తాను చూసుకోకుండా ఇతర శాస్త్రజ్ఞుల పనిని ఎందుకు చేస్తాడు? ఎందుకు చేయాలి? ఈ ప్రశ్నలను సాహిత్యకారులు ఎప్పుడూ ఎదుర్కొంటున్నారు. తెలిసిన జవాబు తెలిసినంత మేరకు చెప్పుకుందాం.

1. విద్యావంతులే కాకుండా, సామాన్య ప్రజలకు కూడా అన్ని విషయాల పైన ఎంతో కొంత తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉంటుంది. అలాగని వాళ్లకు నిపుణుల స్థాయిలో తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఉండదు. సాహిత్యకారుడు ఆ పని చేస్తాడు. ఎందుకంటే సాహిత్యం సమస్త విజ్ఞానశాస్త్రాల సారాంశాన్ని తనలో కలుపుకున్న 'మిశ్రమ జ్ఞానతత్త్వ' స్థాయి కలిగి ఉంది.

2. సమాజంలో జరుగుతున్న ప్రతి పరిణామం పట్ల, ప్రతి సంఘటన పట్ల, దానివల్ల సమాజానికీ, ప్రజలకూ కలిగే మంచిచెడ్డల పట్ల, సాహిత్యం స్పందించినంత త్వరగా ఏ ఇతర విజ్ఞానశాస్త్రం స్పందించలేదు. పరిశోధన ఫలితాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళే మార్గమే శాస్త్రజ్ఞులు ఏర్పర్చుకోలేదు.

3. సాహిత్యం 'కళ'గా ప్రజల్లోకి వెళుతుంది. ప్రజలకు కదిలిస్తుంది. చైతన్యపరుస్తుంది. సాహిత్యకళలలో ఆ శక్తి ఉంది. విజ్ఞానశాస్త్రాల్లో ఆ శక్తి లేదు.

4. సమాజం పట్ల, ప్రజలపట్ల, సాహిత్యకారుల్లో బాధ్యత, నిబద్ధతా ఉంది. సాహిత్యశాస్త్రం, తన 'కళాధర్మా'న్ని నిర్వర్తించడంలో ఎప్పుడూ విఫలం కాదు, కాకూడదు; కాజాలదు. ఎందుకంటే – తన కళాధర్మం నిర్వర్తనలోనే సాహిత్యం సామాజిక ప్రయోజనాన్ని సాధిస్తుంది.

సాహిత్యశాస్త్రం సూర్యకిరణం వంటిది. వాయువువంటిది. అంతటా ప్రవేశించగలదు. అంతటా ప్రసరించగలదు. అంతటా ప్రకాశించగలదు.

*(జయంతి పాపారావు గారి*
*'ఆధునిక కథా ప్రస్థానం' పుస్తకం నుండి.)* ◆

విశ్లేషణ






అంపశయ్య నవీన్

# అంపశయ్యతో అర్ధశతాబ్ది

- తెలకపల్లి రవి

ఈ కాలంలో ఒక రచన యాభై ఏళ్ల పాటు ఒక భాషలో ఒక ప్రాంతంలో సజీవంగా నిలిచి వుండటమే తక్కువగా జరుగుతుంది. నిలిచి వుండటమే గాక అర్ధశతాబ్దిలో అనేక కోణాలు మారినా సరే అప్పటిలాగే తన పట్ల ఆసక్తినీ, ఆదరణనూ నిలబట్టుకోవడం మరింత కష్టమైన విషయం. అందులోనూ బహుళ ప్రచారంలోకి రాని ప్రక్రియలో అరుదైన ఉదాహరణల్లో ఒకటిగా ఇంకా చెప్పాలంటే ఒకే ఒక్కటిగా మిగిలి పోవడం మరీ మరీ ఆశ్చర్యకరం. తెలుగు నవలకు సంబంధించినంత వరకూ ఇన్ని విశేషణాలతో విజయవంతంగా యాభై ఒకటో ఏట ప్రవేశించిన నవల నవీన్ అంపశయ్య. ఎంత విజయం అంటే ఆయననే అంపశయ్య నవీన్ చేసేంత. ఇప్పుడు పన్నెండవ ముద్రణ పొందడం ఈ ఆదరణకు నిదర్శనమైతే ఇప్పటికీ ఇంటర్‌నెట్‌లోనూ సాహిత్య పత్రికలూ పేజీలలోనూ దానిపై సవివరమైన సమీక్షలూ చర్చలూ జరుగుతుండడం సందేహాలు అభినందనలూ వ్యక్తమవడం దాని ప్రాసంగికతకు ప్రతిబింబం. 1969లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ రంగస్థలంగా కేవలం 18 గంటల కాలవ్యవధిలో నడిచే ఈ మూడు వందల పేజీల నవల కాలాన్ని జయించింది. తరాల్ని అలరించింది. ఎందరికో ప్రేరణ నిచ్చింది. ఓరిమినిచ్చింది. అవార్డులు తెచ్చిపెట్టింది. అనుసరణలకు దోవచూపింది. అందుకే అంపశయ్య అన్నివిధాల అసాధారణ రచన.

నవల అనగానే కొడవటిగంటి, చలం తర్వాత యుద్ధనపూడి, రావిశాస్త్రి, బీనాదేవి, శ్రీపాద, రంగనాయకమ్మ, కొమ్మూరి ఆ తర్వాత యండమూరి ఇలా కొందరి పేర్లు చెప్పుకుంటాం. వీరంతా ఒకే కోవలో రాసిన వారు కాదు. కాని వారి రచనలు మాత్రం అతి కొద్ది మినహాయింపులతో దాదాపు ఒకే కథన ప్రక్రియకు చెందినవి. అయితే అంపశయ్య నవల అక్షరాలా మనోచిత్రణాశైలిలో సాగి మరే నవల కన్నా మిన్నగా చెరగని ముద్ర వేయగలిగింది. సహజంగానే విమర్శకులు మేధావులు చైతన్యస్రవంతి(స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్) పితామహుడైన జేమ్స్ జాయిస్ యులిసిస్ నవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తారుగాని మొదలు పెట్టినప్పుడు దాని గురించి తెలియదని, తెలిసి చదివాక కూడా సగమే అర్థమైందని నవీన్ చాలా సార్లు చెప్పారు. అంటే తన పరిశీలనల నుంచి జీవితానుభవం లోంచి మానసిక ఘర్షణ లోంచి అంపశయ్యకు అక్షర ప్రతిష్ట చేశారన్న మాట. మహాప్రస్థానం రాసేనాటికి శ్రీశ్రీకి మార్క్సిజం తెలియకపోవడం లాటిదే ఇది కూడా. అప్పటికి తెలుగులో బుచ్చిబాబు చివరకు మిగిలేది (ఆయన రాసిన ఒకే ఒక్క నవల) రావిశాస్త్రి అల్పజీవి మాత్రమే ప్రముఖంగా చెప్పుకోదగిన మనో చిత్రణా నవలలు. రచనా శైలి పరంగా ఇది చైతన్యస్రవంతి అయితే శాస్త్ర విజ్ఞానపరంగా ఫ్రాయిడ్ మనస్తత్వ విశ్లేషణ(సైకో అనాలిసిస్)తో ముడి వేయడం

సర్వసాధారణం. ప్రతివ్యక్తిలో నిరంతరం వ్యక్తావ్యక్తంగా పెనుగులాడే అంతర్గత భావ ఘర్షణ లేదా సంచయం ఇద్ ఈగో, సూపర్ ఈగో అనే మూడు పదాలతో చెబుతుంటారు. స్థూలంగా ఇద్ అంటే స్వాభావిక ప్రేరణలు, ఈగో అంటే వ్యక్తిలో వుండే వాస్తవిక భావన, సూపర్ ఈగో అంటే సామాజిక నైతిక నియమావళి ప్రభావం. ఇద్ కింద శారీరక అవసరాలు సుఖ లాలస, లైంగిక భావనలు వంటివి పనిచేస్తే ఈగో కింద వాటికి సంబంధించిన సాధ్యాసాధ్యాలు సంఘర్షణ పెడతాయి. చివరకు సూపర్ ఈగో నైతిక కొలబద్దలను గుర్తు చేస్తుంది లేదంటే అపరాధ భావన కలిగిస్తుందనీ అనొచ్చు. పదాలు ఏవి వాడినా మనందరిలో ప్రతిక్షణం ఇవన్నీ పెనుగులాడుతుంటాయని మనస్తత్వ శాస్త్రం చెబుతుంది. వరంగల్ జిల్లాలో ఒక పేద కుటుంబంలో పుట్టి తలిదండ్రుల కష్టాల మధ్య పంపిన కొద్దిపాటి డబ్బుతో యూనివర్సిటీలో చేరి హాస్టల్‌లో వుంటున్న రవి అనే కథానాయకుడి జీవితంలో ఒక రోజు 18 గంటల వ్యవధిలో వీటన్నిటినీ చిత్రించిన అంపశయ్య మనకు విశ్వ దర్శనమే చేయిస్తుంది. ఎందుకంటే రవి ఆనాటి సగటు జీవికి లేదా విద్యార్థికి ప్రతినిధి.

రవి కలలో రత్తి కనిపించడంతో కథ మొదలవుతుంది. చిన్న వయసులో అతనికి దగ్గరైన ఆ అభాగ్య యువతి సమాజం కర్కశానికి గురై ఆ కసిని తనలో నింపుకుని వళ్లమ్ముకుని బతుకుతుంటుంది. హాస్టల్‌లోనూ, యూనివర్సిటీలోనూ రకరకాల పాత్రలు ప్రవేశిస్తాయి. ప్రగతిశీలంగా మాట్లాడే వేణు, భూస్వామ్య దురహంకారానికి ప్రతిరూపమైన రెడ్డి, కపటత్వం నిండిన శ్రీశైలం, రంగారెడ్డి, దేవుడి బొమ్మల చాటున సెక్సు పుస్తకాలు చదివే ఆచారి, ఖాన్ ఇలా ఎందరో తారసపడతారు. వారి వారి మాటలనూ చేష్టలను బట్టి రవిలో కలిగే స్పందనలూ భయాందోళనలూ ఆరాధనలూ ఒక వైపు.. హాస్టల్ గోడలపై రాసిన బూతులూ మాటల్లో దొర్లే అసభ్యతలూ ఆ వెంట వెంట లైంగికోద్దీపనలూ అపరాధభావనలూ సినిమాలు హాలివుడ్ తోడేళ్లకు బలైన మర్లిన్ మన్రో, శ్రీశ్రీ చరణాలూ, సిద్ధాంతాలు, మధ్య మధ్య మదిలో మెదిలి మనసును మెలితిప్పే ఆమ్మ బొమ్మ.. కాలేజీల కుల తత్వాలు, తొలి తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ప్రాంతీయ వైరుధ్యాల ప్రభావంతో పరస్పర వాదనలూ తగాదాలు అనుకోగానే పేర్లతో సహా గుర్తు కొచ్చే అమ్మాయిలూ ఈ ప్రవాహంలో మాట్లాడుకుంటూ పోట్లాడుకుంటూ తాళం వేస్తూ తీస్తూ కోపం భయం పెనుగులాడుతూ రవి.. అనుకోకుండా తారసపడే కిరణ్మయి. ఆమెపైన పెరిగిన వ్యామోహంతో పనిగట్టుకుని మాట్లాడితే జోకులేస్తే కమ్ సెప్టెంబర్ సినిమా నుంచి స్ట్రేంజి బెడ్‌ఫెలోస్ వరకూ మాట్టాడితే కుదిరిన ఏకీభావం సత్యజిత్ రే పేరెత్తగానే ఆమెనుంచి రాకపోవడంతో విచారం.. వియత్నాం యుద్ధం విముక్తి ఉద్యమాల వంటివాటిని ఆరాధించే స్వస్వభావం కూడా పక్కకు నెట్టి అనుకూలంగా మాట్లాడాలనే తాపత్రయం. పరస్పర విరుద్ధమైన తమ కలయికను సామ్రాజ్యవాదానికి ప్రతీక అయిన అమెరికా యాత్రలో నయాగరా జలపాతం పక్కన కలుసుకున్నట్టు చెప్పే సంకేతాత్మకత... ఆమె కోసమే.. తను ఎప్పుడూ ఏహ్యంగా చూసే గుర్నాథం అనే హోమో(అప్పట్లోనే ఆ పాత్రను సృష్టించడం నవీన్ వాస్తవికతకు సాహసికతకు అద్దం పడుతుందని చెప్పాలి) దగ్గర అప్పు చేసి మరీ సినిమాకు వెళితే అక్కడ ఆమె మరెవరితోనో వెళ్తూ తనకు బై చెప్పడం.. ఈ నిరాశలోంచి ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధమైన క్షణంలో కాస్త ఆదరణ మరికాస్త ఉపశమనం ప్రోత్సాహం ఇచ్చిన లెక్చరర్ ఆనందరావు అలాటి తరుణంలోనే రెడ్డి బ్యాచి దౌర్జన్యంపై అందరూ కలసి తిరగబడటంతో కలిగిన విశ్వాసం. కళ్లు వాల్చగానే కలలో కనిపించి తనను కొట్టుకుపోకుండా ఆపే అమ్మ...

ఇవీ ఇంకా ఇలాటి చాలా లోతైన విషయాలు కేవలం 18 గంటల్లోనే రవితో పాటు మనకూ కళ్లముందు తిప్పే అంపశయ్య యాభై ఏళ్లతర్వాత కూడా పాఠకాదరణ పొందుతుందంటే ఏకైక కారణం నవీన్ సహజంగా రాయడం. కేవలం చైతన్యస్రవంతి శిల్పం కోసం ఆయన రాయలేదు. దాని గురించి అప్పటికి అంతగా తెలియదు కూడా. బుచ్చిబాబు చివరకు మిగిలేది కథానాయకుడు దయానిధి, అల్పజీవిలో సుబ్బయ్యలా రవి జీవితం చూసిన వాడు కాదు. తొలి పాదంలోనే విద్యార్థి దశలోనే వున్నవాడు. దయానిధిలా పై తరగతి గాని సుబ్బయ్యలా అచ్చమైన మధ్య తరగతి పట్టణజీవి గాని కాదు. పల్లెల్లో అణగారిన వర్గాల నుంచి వచ్చిన వాడు. దయానిధిని అమ్మ భావన వెంటాడింది. సుబ్బయ్యను జీవన భయం వేటాడింది. కాని రవి విషయం వేరు. అతను తనదైన అన్వేషణలో అవసరాలలో ఘర్షణ పడ్డాడు. అంత ఘనీభవించిన భావాలు కూడా అప్పటికి ఏర్పడలేదు. దయానిధిలా తాత్వికమైన నిర్లిప్తత లేదా సుబ్బయ్యలా

# పచ్చ బొట్టు

- స్వప్న మేకల
9052221870



*కొన్ని హృదయాలపై అక్షరాలు*
*పచ్చ బొట్టుగా ముద్రితమై*
*ఎలుగెత్తి చాటుతాయి..*

*కొన్ని కన్నీటి చుక్కలు*
*సిరాలోంచి రాలిపడుతూ*
*శ్వేత పత్రంపై*
*వివర్ణ భావాలతో*
*రంగులొలుకుతాయి..*
*ఆనంద భాష్పాలతో*
*మిళితమై ఆకాశంలో నక్షత్రాలుగా*
*మిణుకు మిణుకుమంటాయి*

*వీక్షించే కన్నులలో*
*నడిచే ప్రతి అడుగులో*
*అక్షరం అలవోకగా*
*పూలబాటలు పరుస్తూ*
*సేద తీరుతుంది*

*కొన్ని భావాలకి అనుభవాలకి*
*నడుమ వర్షం కురిపిస్తూ*
*రైతన్నల చెమటలో స్వేదబింబమై*
*ప్రతిబింబిస్తూ మట్టి కణంగా*
*మెత్తటి మన్నుపై మరల జన్మిస్తుంది*
*తాను మొలకెత్తే అక్షరమని*
*ప్రతి హృదిలో కణమై రగిలే*
*నిప్పు కణికనని ..* ♦

అమితమైన భీరుత్వం అతనికి లేవు. వారిలా పూర్తి వంటరి కూడా కాదు. ఈ నవల పరిధి కాల వ్యవధి కూడా వాటితో పోలిస్తే చాలా తక్కువ. ప్రతిదీ భావాల ప్రవాహంగానే చెప్పడం చూస్తాం. వినుకొండ నాగరాజు ఊబిలో దున్న, కొమ్మూరి వేణుగోపాల రావు వ్యక్తిత్వం లేని మనిషి, వడ్డెర చండీదాస్ హిమజ్వాల వంటి నవలలు గాని లేక మార్మిక వాస్తవికత అనే డా.వి.చంద్రశేఖరరావు నవలలు కథలు గాని ఇంత విస్తృత స్థాయిలో ఆకట్టుకోలేదన్నది వాస్తవం.

ఆనాటి దేశ కాల పరిస్థితులలో సినిమాలు సెంటిమెంటల్ సీరియళ్లు ప్రధానంగా వున్న నేపథ్యంలో అంపశయ్య సృజనలో రెండు భాగాలుగా రాగానే ఎక్కడలేని సంచలనం సృష్టించింది. భిన్న స్పందనలకు కారణమైంది. ఇతివృత్తం శైలి ప్రతీకలూ వర్ణనలూ వాస్తవికంగా వున్నాయని కొందరు అనుకుంటే మరికొందరు అందులో అశ్లీలతను చూశారు. తెలంగాణ విభజన తొలిదశ ఉద్యమం, నక్సలైట్ భావజాలం అంకురిస్తూ దిగంబర కవిత్వం నడుస్తున్న పూర్వరంగం కూడా అందుకు దోహదం చేసింది. అయితే కొద్ది కాలంలోనే పాఠకులూ విమర్శకులూ కూడా అంపశయ్య విశిష్టత అర్థం చేసుకోగలిగారు. శ్రీశ్రీ వంటివారు విశేషంగా మెచ్చుకున్నారు. దాంతో అంపశయ్య అన్నది ఒక స్థాయి చైతన్యం గల విద్యాధిక పాఠకులకు అవశ్య పఠనీయమై పోయింది. అప్పుడప్పుడే ఆధునికమవుతున్న తరంలో వివిధ తరగతుల వారి మనోభావాలు భౌతిక వాస్తవాల మధ్య అంతరాన్ని సామాజిక రాజకీయ ప్రాంతీయ భావజాలాల ప్రభావాన్ని విశదపర్చింది. తెలుగు విశ్వ విద్యాలయాలలో ఉన్నతస్థాయి చదవులకు వచ్చిన యువత బౌద్ధిక పరిణామాన్ని అందులో వికార వికాసాలను కళ్లకు కట్టింది. ఆ విధంగా చూస్తే అంపశయ్య కాలిక నవల అయివుండాలి కాని మనుషుల మనస్తత్వాలను ప్రధానంగా చిత్రించింది గనక కాలరేఖలను దాటి అర్థశతాబ్ది వేడుక చేసుకుంటున్నది. ఇది రచయిత నవీన్ రచనా ప్రతిభకే గాక తెలుగు పాఠకుల అభిరుచికి వైవిధ్య ప్రియతకూ తార్కాణం. 1941లో దొంగరి మల్లయ్యగా పుట్టి అర్థశాస్త్రాధ్యాపకుడుగా పదవీ విరమణ చేసిన కలం ధారి నవీన్ ఈ ఒక్క నవలతో అంపశయ్యగా ఇంటిపేరు సంపాదించుకుని అక్షరాభిషిక్తుడైనారు. తర్వాత కూడా లైఫ్ ఇన్ ఎ క్యాలేజీ ముళ్ల పొదలు ప్రత్యూష కాల రేఖలు బాంధవ్యాలు తదితర అనేక నవలలు కథా సంపుటాలు వెలువరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. చాలా మందిలా కాకుండా ఆయన సమకాలీన సమస్యలను రచనలుగా మార్చడానికి ఇష్టపడతారు. నిరంతరం సాహిత్య సామాజిక కార్యకలాపాలతో స్నేహశీలిగా సంచరించడం ఆయనను నిత్య చైతన్య ధారిగా చేస్తే పరిణత అవగాహన ఆమోదయోగ్యత పెంచింది. ఆయనకివే అంపశయ్య అర్థశతాబ్ది అభినందనలు. ♦

# ఆంధ్రప్రదేశ్ ముస్లింల చరిత్ర - సయ్యద్ నశీర్ అహమ్మద్





సయ్యద్ నశీర్ అహ్మద్

- డా. ఇస్లావత్ భీమానాయక్
9441986976

నశీర్ వృత్తిరీత్యా న్యాయవాది. ప్రవృత్తిరీత్యా పాత్రికేయుడు, పరిశోధకుడు, రచయిత, చరిత్రకారుడు మరియు చిత్రకారుడు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్రను వివరిస్తూ ఇప్పటి వరకు పదమూడు గ్రంథాలను వెలువరించిన ఆయన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రలను వెలికితీసి తెలుగు పాఠకులకు అందిస్తున్న తొలి చరిత్రకారుడిగా ఖ్యాతి గడించారు. ఆయన రాసిన 1. భారత స్వాతంత్ర్యోద్యమం - ముస్లింలు 2. షహీద్-యే-ఆజం అష్ఫాఖుల్లా ఖాన్ గ్రంథాలు 'ఉర్దూ' భాషలో తర్జుమా చేయబడి ప్రచురితమయ్యాయి.

సయ్యద్ నశీర్ అహమ్మద్ 1999వ సంవత్సరం నుండి చరిత్ర గ్రంథాలను వెలువరించడం ఆరంభించారు ఆయన రాసిన పలు గ్రంథాలు: 1. భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లింలు 2. భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం మహిళలు 3. భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం ప్రజాపోరాటాలు 4. భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్ర ప్రదేశ్ ముస్లింలు 5. భారత స్వాతంత్ర్యసంగ్రామం : ముస్లిం యోధులు (ప్రథమభాగం) 6. షహీద్-యే-ఆజం అష్ఫాఖుల్లా ఖాన్ 7. మైసూరు పులి టీపూ సుల్తాన్ 8. చిరస్మరణీయులు 9.1857:ముస్లింలు 10. అక్షరశిల్పులు ( 333 మంది ముస్లిం తెలుగు రచయితల, కవుల వివరాలతో కూడిన పుస్తకం ) 11. కువైట్ కబుర్లు 12. అష్ఫాఖ్ - బిస్మిల్ 13. చరితార్థులు (1757 నుండి 1947 వరకు సాగిన బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన 155 మంది ముస్లిం యోధుల ఆల్బమ్) 14. రాంప్రసాద్ బిస్మిల్ - అష్ఫాక్ఖుల్లా ఖాన్ అనే 14 గ్రంథాలు వెలువరించారు. ఆధునిక ఆంధ్రుల సాహితీ చరిత్రను పునర్మించడంలో సయ్యద్ నశీర్ అహమ్మద్ గారిది ఉన్నతమైన పాత్ర. భారతదేశ వ్యాప్తంగా చరిత్ర నిర్మాణంలో, పరిశోధనా పద్ధతిలో, సబాల్టర్న్ దృక్పధం వచ్చింది. భారతదేశంలో నిర్లక్ష్యం చేయబడిన, నిరాకరించబడిన, అణిచివేయబడిన మూడు తరగతుల వారి చరిత్ర నిర్మాణమే సబాల్టర్న్ చరిత్ర నిర్మాణం అంటారు. జాతీయోద్యమకాలంలో మొదట ఆంగ్లం చేర్చుకున్న బ్రాహ్మణవర్గం, కులీనవర్గం తమకు అనుకూలంగా చరిత్రను మార్చి రాసుకున్నారు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, జమీందారీలు భారత స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపినట్టు పేర్కొన్నారు. ఆదికాదు అని చెప్పడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆనాడే 'గాంధీ-రెనడే-జిన్నా' పుస్తకం రాశాడు. అందులో గాంధీకి సమాంతరంగా, సమానంగా జిన్నాని, రెనడేని ఎక్స్‌పోజ్ చేశాడు. ఇది గొప్ప ప్రయత్నం. ప్రత్యామ్నాయ చరిత్రకి, వ్యక్తిత్వ నిర్మాణానికి ఈ గ్రంథం దిక్సూచి అయ్యింది. సయ్యద్ నశీర్ ఆహమ్మద్ రాసిన 'భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' గ్రంథంలో ఆ స్థాయిలో ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల, జాతీయోద్యమకారుల వ్యక్తిత్వాలను చిత్రించారు.

నశీర్ అహమ్మద్ పాత్రికేయుడు కావడం, చరిత్ర, చట్టం,

వాణిజ్య శాస్త్రం, పాత్రికేయ వైశిష్టం, జనజీవన సంబంధాలు కలిగి ఉండటంతో బహు ముఖీన నైపుణ్యాన్ని ఈ గ్రంథంలో చూపించాడు. ఈ గ్రంథంలోనే కాదు భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్రను వివరిస్తూ నశీర్ రాసిన ప్రతి గ్రంథంలో బహు ముఖీన నైపుణ్యం సుస్పష్టమవుతుంది. ఈయన రచనా పద్ధతిలో ప్రవాహశీలత పాఠకుడ్ని తన వెంట నడిపించుకుంటూ వెడుతుంది. ఆ కారణంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్రను వివరిస్తూ నశీర్ రాసిన తొమ్మిది గ్రంథాలలో ఐదు గ్రంథాలు మూడుసార్లు, నాలుగు గ్రంథాలు రెండుసార్లు పునర్ముద్రణ అయ్యాయి. ఒక ఉద్యమాన్ని, చరిత్రను సమన్వయించి రాసేప్పుడు సమకాలీన సామాజిక ద ృష్టి ఉండాలి. భారత స్వాతంత్ర్యోద్యమం, జాతీయోద్యమాన్ని రచించిన రచయితలకు పాఠ్యగ్రంథ రచనా పద్ధతి అలవడింది. అందులో తేదిలు, ఘటనలు, నామవాచకాలు, నుతులు, స్తుతులు తప్ప గుండెను కదిలించే వర్ణనలు, విశ్లేషణలు తక్కువ. కానీ నశీర్ అహమ్మద్ గ్రంథాలన్నీ కదులుతున్న సముద్రంలా ఉంటాయి. పాఠకుడ్ని ఆ ఘటనల్లోని ఉద్వేగంలోకి తీసుకెడుతాడు నశీర్. అది ఆయనకు 'ఉదయం' లోనూ, 'వార్త' దినపత్రికల్లో ప్రజాజీవనాన్ని చిత్రించిన నైపుణ్యం నుండి వచ్చింది.

సయ్యద్ నశీర్ అహమ్మద్ కోట్ చేసే అంశాలు కూడా ప్రమాణబద్ధమైనవి. ఆయన నూతన గ్రంథం 'భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' గ్రంథానికి రాసిన ఉపోద్ఘాతం (కథనం) ఆయన ద ృక్పథానికి గీటురాయి. ఆయన కేవలం రచయిత కాదు, కేవలం విశ్లేషకుడు కాదు, ఒక దృక్పథానికి ప్రతినిధి. అందుకే ఈ తరం ఆయన వైపు చూడాల్సిన అవసరాన్ని ఆయన సృష్టించాడు. ఆ దృక్పథమే ఆయన రచనకు జీవం. అదే ఆయనను 'చరిత్ర నిర్మాణ శాస్త్రవేత్త'గా మార్చింది. డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కూడా 'అస్పృశ్యులెవ్వరు?' గ్రంథం రాసేప్పుడు ఆయన పీఠిక రాశాడు. అందులో తన చారిత్రక దృక్పథం ఏమిటో చెప్పాడు. అందుకనే సబాల్టన్ హిస్టోగ్రఫీకి అంబేద్కర్ ఆద్యుడయ్యాడు. ఆ రచనా విధానం కొనసాగింపులోనే సయ్యద్ నశీర్ అహమ్మద్ రూపొందారు.

ఆయన దృక్పథంలో ప్రధానాంశం భారతీయ ముస్లింలు, జాతీయోద్యమం నుండి అంతకుముందు సాగిన సాయుధ పోరాటం నుండి భారతదేశాన్ని రక్షించడానికి, విముక్తం చేయడానికి భారత స్వాతంత్ర్యోద్యమంలో తమ నెత్తురు ధారబోశారు. అది ఈ భూమిలోకి ఇంకినంతగా అక్షరాల్లోకి ప్రవహించలేదు. ఆ కారణంగా ప్రజాబాహుళ్యం ఎరుకలోకి రాలేదు. ఇది కుట్ర అని ఆయన ఉద్దేశం. అంతేకాదు భారతీయ ముస్లింలు భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రజాస్వామిక సైన్యంగా పాల్గొన్నారు, పోరాడారు. తమ సామాజిక శక్తిని, రాజకీయశక్తిని మొత్తంగా భారతీయ సమాజానికి అర్పించారు. చరిత్ర ఈ విషయాన్ని విస్మరిస్తే అది అసమగ్ర చరిత్ర అవుతుందని నశీర్ అహమ్మద్ ప్రతిపాదన. ఈ ప్రతిపాదనే ఆయన నూతన చారిత్రిక దృక్పథానికి వెలుగు తెచ్చింది. అయితే ఇటువంటి ప్రతిపాదనలు చేయడం అంత తేలికైన పనికాదు. అణిచివేసిన వాడి నుండే ఆయుధాన్ని చేత బూనాలి. అంతేకాదు దేన్ని నాశనం చేశారో అక్కడి నుండే మూలాలు వెతకాలి. దానికి అవసరమగు పరిశోధనా దృష్టి నశీర్‌కు ఉంది. చరిత్రకారుడు పరిశోధకుడు కలిస్తే చరిత్ర కాల్పనికం కాకుండా సత్యనిష్టం అవుతుంది. అందుకనే తాను రాసిన చరిత్ర గ్రంథాలలో ఆయన పుంఖాను పుంఖాలుగా ఉపపత్తులు మన ముందుంచుతున్నారు. ఎవ్వరూ కాదనలేని ప్రమాణాలు చూపిస్తున్నారు. అది సత్యనిష్టయే కాకుండా చారిత్రక పరివర్తితం కావడం కోసం తేదిలు, సంఘటనలు కూడా ఆయన ఇస్తున్నారు. దీంతో ఆయన ఒక ప్రామాణిక చరిత్రకారుడుగా నిగ్గుతేలారు.

ముస్లింల చరిత్రలో మూడు గొప్పతనాలు ఉన్నాయి. ముస్లింలు లేకుండా భారతదేశ చరిత్ర నిర్మించలేము. ముస్లింల శ్రమ లేకుండా భారత ఉత్పత్తులు లేవు. ముస్లింల సంస్కృతి లేకుండా భారతదేశ సంస్కృతి-నాగరికత పరిపూర్ణం కాదు. ఈ మూడు అంశాలను నశీర్ అహమ్మద్ తన గ్రంథాలలో అంతర్లయగా ప్రవహింపచేశారు. అంతేకాదు సోషలిస్టులుగా, గాంధేయువాదులుగా, విప్లవోద్యమకారులుగా, సెక్యులరిస్టులుగా ముస్లింల భావజాల ఉద్యమాలను కూడా లిఖించడం, ఆయనలోని హేతుబద్ధ ఆలోచన విధానం వల్లే సాధ్యమైంది. మత దురహంకారానికి భిన్నంగా ఎవరెవరు ప్రవర్తించారో చెబుతూ, భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' గ్రంథం (101వ పుట) లో ఆయన ఇలా పేర్కొన్నాడు.

'ఆ రోజుల్లో మత దురహంకారానికి దూరంగా ఉన్న సిరాజుల్ హసన్ తిర్మిజ్, డాక్టర్ అక్బర్ అలీ, జలాలుద్దీన్, హసన్ ముహమ్మద్ పహిల్వాన్, వీరేర్ అహమ్మద్ అలీ ఖాన్, డాక్టర్ లతీఫ్ సయీద్ లాంటి వారు స్వాతంత్ర్యోద్యమంలో

పాల్గొనడం మాత్రమే కాదు విలీనం కోరుతూ కూడా ఉద్యమించారు. సామ్యవాద సిద్ధాంతాలకు ఆకర్షితులై సమసమాజ స్థాపన లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీలో భాగస్వాములైన మగ్దూం మొహిద్దీన్, అలం ఖుంద్ మిరీర్, హసన్ నాసిర్, జవ్వాద్ రజ్వీ, అఖ్తర్ హుస్సేన్, జహందర్ అస్ఫర్, కుతుబ్-యే-ఆలం, అహసన్ అలీ మిరీరజ్, మిరీరాజ్ హైదర్ హుస్సేన్, హుస్సేని షాహిద్ లాంటి వివిధ రంగాలలో ప్రతిభావంతులైన ప్రముఖులు నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలని డిమాండ్ చేశారు.' ఇందులో ఆయన ఇరువది నామవాచకాలను ఇచ్చారు. ఇవన్నీ చరిత్రలో నిర్లక్ష్యం చేయబడిన పేర్లే.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 'వాట్ కాంగ్రెస్ అండ్ గాంధీ హ్యావ్ డన్ టు అన్‌టచ్‌బుల్స్' గ్రంథంలో గాంధీ కాంగ్రెస్ అస్పృశ్యులను నిర్లక్ష్యం చేసిందని చెప్పాడు. 'భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' గ్రంథంతోపాటుగా సయ్యద్ నశీర్ అహమ్మద్ వెలువరించిన గ్రంథాలన్నిటిలో జాతీయోద్యమంలో పనిచేసిన ముస్లింలు చారిత్రక నిర్లక్ష్యానికి గురయ్యారని సాధికారికంగా, సప్రమాణంగా నిరూపించారు. అంతేకాకుండా ఆయన ప్రతిపాదించిన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులందరూ ఏదో ఒక అంశంలో ప్రతిభావంతులు అని కూడా నిగ్గుతేల్చారు. నశీర్ గొప్పతనం ఏమిటంటే మెయిన్ స్ట్రీమ్ సమాజం కూడా వీటినుండి ఎంతో నేర్చుకోవాల్సి ఉంది అని చెప్పాడు. వ్యక్తిత్వ నిర్మాణం మీద కూడా ఆయన తన గ్రంథాలలో కృషిచేశారు. దీని వల్ల ముస్లిం విద్యార్థులు, మేధావులు ఈయన గ్రంథాలను చదివి 'మాలో నుండి ఇంతమంది గొప్పవారు వచ్చారు. వీరంతా మాకు ఆదర్శం. వీరి జీవితాలను అధ్యయనం చేయడంవల్ల మాలో కూడా గొప్ప వ్యక్తిత్వ నిర్మాతలున్నారు' అనే ఆత్మగౌరవ భావం ప్రదీప్తమవుతుంది.

భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముస్లింల గురించి ఆశ్చర్యాన్ని కలిగించే వివరాలతో నశీర్ రూపొందించిన 'భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్ ముస్లింలు'లో మీర్ అక్బర్ అలీ ఖాన్ గురించి రాస్తూ, ముస్లింల్లోని ప్రముఖులు జాతీయోద్యమ కాలంలో కళాశాల నుండి విశ్వవిద్యాలయాల నుండి పోరాటాలలో పాల్గొని ఆ తరువాత లండన్ వెళ్ళి తమ విద్యాభ్యాసాలు కొనసాగించి మళ్ళీ తమకు తాము ఎలా నిలబడ్డారో (279 పేజీలోని) ఒక్క పేరాలోనే ఆయన ఇలా చెప్పాడు. 1920లో ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా ప్రభుత్వ గ్రాంటులతో నడుస్తున్న కళాశాలలను బహిష్కరించమని గాంధీజీ ఇచ్చిన పిలుపు మేరకు అలీఘర్‌లో విద్యాభ్యాసం చేస్తున్న అక్బర్ అలీ ఖాన్, డాక్టర్ జాకీర్ హుస్సేన్ లాంటి ప్రముఖుల బాటలో జాతీయోద్యమంలో ప్రవేశించి కళాశాలను బహిష్కరించారు. ఆ తరువాత జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయం (జామియా మిలియా ఇస్లామియా) లో ప్రవేశించి విద్యాభ్యాసం చేస్తూ జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఆ ఉద్యమ విరమణ తరువాత లండన్ వెళ్ళి న్యాయశాస్త్రంలో పట్టా పొంది న్యాయవాదిగా తిరిగి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు'. నశీర్ రాసిన ఈ చరిత్రను చదివితే ఆయనలోని అధ్యయనశీలత బయటపడుతుంది. అంటే అనేక అంశాలను తన దృక్పథం నుండి సంక్షిప్తీకరించి చెప్పడం.

నశీర్ అహమ్మద్ చరిత్రను తరంగాలు తరంగాలుగా పెయింట్ చేస్తారు. అంటే ఆయన రచనా క్రమంలో ఒక విజ్యువలైజేషన్ ఉంది. అందువల్లే ఆయన పుస్తకాలు ఆయనతోపాటుగా పాఠకుడ్ని సుదూరాలకు తీసుకువెడతాయి. దృక్పథం లేని గ్రంథాలు విజ్ఞానంగా మిగిలిపోతాయి. మన గ్రంథాలయాలన్నీ ఈ పుస్తకాలతో నిండి పోయాయి. పుస్తకం చదివాక ఒక ఫీల్ ఉంటుంది గాని ఒక దిశానిర్దేశనం ఉండటం లేదు.

నశీర్ గ్రంథాల్లో దిశానిర్దేశనం ఉంది. స్పష్టమైన మార్గం ఉంది. అందుకే ఆయనను మనం చరిత్రకారుడుగానే కాకుండా ఇంటలెక్చువల్‌గా చూడాలి. ఇంటలెక్చువల్ అంటే విషయ సంపన్నంగా ప్రచారం ఉంది. కాని విషయం నుండి కొత్త అంశాన్ని సృష్టించే వారినే ఇంటలెక్చువల్ అంటాం. ఇటువంటి కొత్త ప్రతిపాదనలు నశీర్ చాలా చేశారు. చాలా నిశితంగా చూసినప్పుడు ఆయన ప్రతిపాదనలు అందుతాయి. పాఠకుడు నశీర్‌ను అభిమానించటమో, ప్రేమించటమో చేయాలి. చేయకపోతే సమాచారాన్ని మాత్రమే అందుకుంటాడు. అయన అంతర్గతంగా ప్రవహింప చేసిన భావజాలాన్ని, భావోద్వేగాన్ని అందుకోలేడు. అందుకని పాఠకుడ్ని ఒక మూడుసార్లన్నా ఆయన ప్రతి గ్రంథం చదవమని నేను కోరుతున్నా.

1857 కంటే 70 ఏండ్ల ముందుగా మన విశాఖపట్నంలోని ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక స్థావరంలో ఆంగ్లేయాధికారుల మీద తిరుగుబాటు పతాకాన్ని ఎగురవేసిన సుబేదార్ షేక్ అహమ్మద్ సాహసోపేత పోరాటాన్ని రాసేప్పుడు

యుద్ధకౌశల్యం, ఎత్తుగడలు, ప్రతి వ్యూహాలు, ఆంగ్లేయులను దెబ్బతీసే విధానాలు కండ్లకు కట్టినట్టుగా చిత్రించాడు.

ఆనాటి ప్రప్రథమ సైనిక తిరుగుబాటు నాయకుని గురించి 'భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' గ్రంథంలో రాసే సందర్భంగా (128వ పేజీలో) ఇలా వర్ణించారు. 'సుబేదార్ అహమ్మద్ నేతృత్వంలో తిరుగుబాటు యోధులు విజయపథాన కదం తొక్కుతూ సైనిక స్థావరం అధికారి కాసామేజర్ ను అరెస్టు చేశారు. అతని మీద కూడా కాల్పులు జరిగాయి. ఆ సమయంలో ఒక సిపాయి అడ్డుపడి వారించడంతో అతను బ్రతికిపోయాడు. అనంతరం అతడి నుండి స్థావరానికి సంబంధించిన పూర్తి రహస్యాలు, ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన ఆస్తిపాస్తుల వివరాలు తెలుసుకున్న సుబేదార్ అహమ్మద్ ఆయన సహచరులు విశాఖపట్నం సైనిక స్థావరాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. సైనిక ఆయుధాగారాన్ని హస్తగతం చేసుకున్నారు. స్థావరంలోని ఖజానాలో ఉన్న 21,999 రూపాయలను సొంతం చేసుకున్నారు. కాసామేజర్ స్వంత సొమ్ము సుమారు 15 వేల రూపాయలు కైవసం చేసుకున్నారు. ఆ సందర్భంగా ఆంగ్లేయుల స్థావరంలో బందీగా ఉన్న ఫ్రెంచ్ గూఢచారిని బంధ విముక్తుణ్ని చేశారు. ఈ చర్యలలో స్థానిక ప్రజలు కూడా భాగస్వాములయ్యారు.'

ప్రస్తుత 'భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' గ్రంథం ఇంతకుముందు రాసిన 'మైసూరు పులి టిపూ సుల్తాన్'లో పెల్లుబికిన స్ఫూర్తితో ఉంది. చరిత్రలో వర్ణణాత్మక విధానం అత్యున్నతమైనది. ఈ గ్రంథం ద్వారా ఉర్దూ, పారశీక, ఆంగ్ల పదాలను తెలుగు నుడికారాన్నీ ఆంధ్ర పాఠకులకు వందలాదిగా అందించారు. దీన్నే భాషా సంపన్న రచన అంటారు. అంటే రచయిత తన రచనల ద్వారా భాషను కూడా నేర్పుతున్నారు. ఇక్కడ నశీర్‌లోని చాలా బలమైన పాత్రికేయుడు కన్పిస్తాడు. నశీర్ ఒక రచయితే కాదు, బోధకుడు, నిర్మాణకర్త కూడా. ఆయన ఈ మూడు దశబ్దాల్లో చాలా సభల్లో, సదస్సుల్లో పాల్గొన్నారు. సాధికారిక ఉపన్యాసాలు, ప్రసంగాలు చేశారు. పలు సామాజిక ప్రజా ఉద్యమాల నిర్మాణంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన నిరంతరం డిబేటబుల్ పర్సన్. ఆయనలోని గొప్పదనం 'వాది-ప్రతివాది'. ఏదైనా చెప్పదలచుకుంటే సూటిగా చెబుతారు. మార్మికత లేదు. నశీర్‌కు పత్రికలు నడిపిన అనుభవం ఉంది. ఆయన మానవతా ప్రదీపకుడు. ఒక పోరాట యోధుణ్ని ఆయన జీవితం ముగియక ముందే రికార్డు చేయాలన్న పట్టుదల, తపన తన గ్రంథాలలో కన్పిస్తుంది. ఇలా రాయక ఎందరో త్యాగమూర్తుల జీవితాలు అక్షరబద్ధం కాలేదు.

భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు నిర్వహించిన ప్రత్యేక విషయాలను ప్రస్తుత గ్రంథం 'భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' జనబాహుళ్యం ఎరుకలోకి తెచ్చారు. 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం కంటే ముందుగా 1780లో విశాఖపట్నం సైనిక స్థావరంలో తిరుగుబాటు బావుటాను ఎగురేసిన సుబేదార్ షేక్ అహమ్మద్ (సత్తెనపల్లి), పరాయి పాలకులను పాలద్రోలడానికి సర్వం ఒడ్డి కృషి సల్పిన నిజాం రాజకుమారుడు ముబారిద్దౌలా (హైదరాబాద్), ఆంగ్లేయుల మీద యుద్ధభేరి మ్రోగించడానికి తన కోటను ఆయుధాల కర్మాగారం-గిడ్డంగిగా మార్చిన కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్ (కర్నూలు), ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా తిరుగుబాటుకు యత్నించిన పుట్టు అంధుడైన వ్యూహకర్త షేక్ పీర్ షా (కడప), నిజాం రెసిడెన్సీ మీదకు వీర యోధుల్ని నడిపిన మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్, పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ (హైదరాబాద్) లాంటి యోధులు విశేషాంశాలను తన ఉద్గ్రంథం ద్వారా నశీర్ తెలుగు పాఠకుల దృష్టిలోకి తెచ్చారు.

ప్రజా క్షేమం పట్టని ప్రభువులను కూడా ప్రశ్నించవచ్చన్న చైతన్యాన్ని సామాన్య ప్రజానీకంలో కలిగించిన పునర్వికాసోద్యమ నిర్మాత ముల్లా అబ్దుల్ ఖయ్యూం (హైదరాబాద్), ఖిలాఫత్- సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా తెలుగు గడ్డ మీద ప్రప్రథమంగా అధికార పదవిని త్యజించిన త్యాగశీలి మహమ్మద్ గులాం మోహిద్దీన్ (విజయవాడ) గాంధీజి ఆరంభించిన ఖద్దరు ఉద్యమంతో మమేకమై 'ఖద్దరు ఇస్మాయిల్' గా పేర్గాంచిన మహమ్మద్ ఇస్మాయిల్ (తెనాలి) మన్నెం యోధుడు అల్లూరి సీతారామరాజుకు అండదండలందించిన ఆంగ్ల ప్రభుత్వంలోని అధికారి ఫజులుల్లా ఖాన్, గాంధీ బాటలో సాగి 'విశాఖ గాంధీ'గా విఖ్యాతి చెందిన ఫరీదుల్ జమా (విశాఖపట్నం), భారత స్వాతంత్ర్యోద్యమ సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న 'జైహింద్', 'నేతాజి' అను అద్భుత పదాల సృష్టికర్త అబిద్ హసన్ సఫ్రాని (హైదరాబాద్), ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానాన్ని విలీనం చేయాలంటూ నిజాం నవాబుకు నేరుగా లేఖ రాసిన సాహసి ఫరీద్ మీర్జా (హైదరాబాద్), ఆజాద్ హింద్ ఫౌజ్‌కు తాను కూడబెట్టుకున్న సంపాదనంతా విరాళంగా ఇచ్చివేసిన యువకులు షేక్ ఖాదర్ మొహిద్దీన్ (విజయనగరం), విలీనోద్యమంలో ప్రజాపక్షంగా

## కవిత

# ఇల్లు



- నూతలపాటి సాంబయ్య
98480 34930

*ఇల్లంటే సిమెంటు ఇటుకలతో కట్టిన*
*నాలుగు గోడల కట్టడం కాదు*
*అది ఓ అందమైన మమతల విరిమందిరం*
*జీవితాన్ని చదివించే విలువల బడి ..ఇల్లు*
*మధిరిమలు ఒలికించే మనసుల ముడి ఇల్లు*
*పసిపాపలను పంటలుగా పండించే ఆశల మడి ఇల్లు*
*కష్టాలు, కన్నీళ్లు చీకటిగా ముసిరితే*
*వెలుగు చూపి నడిపించే వెన్నెల జడి ఇల్లు*
*మానవ సంబంధాలను, అనుబంధాలను*
*అనుసంధానం చేసే దేవాలయం ఇల్లు*
*పగలంతా అలసి, సొలసి పోయిన హృదయాలకు*
*రాత్రి హాయినిచ్చే చలివేంద్రం ఇల్లు*
*అతిథులకు, అన్నార్తులకు ఆహ్వానం*
*పలికే అక్షయ పాత్ర ఇల్లు*
*అనురాగ దంపతుల స్మృతి వనం ఇల్లు*
*వయోధికుల అనుభవాల విజ్ఞాన వీచికలు*
*ప్రసరించే నందన వనం ఇల్లు*
*ఆరోగ్యానికి హరివిల్లు ఇల్లు*
*ప్రశాంతతకు పొదరిల్లు ఇల్లు*
*ఇల్లే కదా స్వర్గం అవనిలో అందరికి...!*

◆

---

అక్షరయుద్ధం చేసినందుకు భయానక హత్యకు గురైన సంపాదకులు షోయాబుల్లా ఖాన్ (మహబూబాబాద్), నిజాం సంస్థానం పరగణాలో 'పరిటాల రిపబ్లిక్' ఏర్పాటును ప్రకటిస్తూ స్వాతంత్ర్య పతాకాన్ని ఎగురవేసిన ధైర్యశాలి షేక్ మౌలా సాహెబ్ (పరిటాల) లాంటి విశిష్ట వ్యక్తుల పోరాట స్ఫూర్తిని నశీర్ సప్రమాణంగా వివరించారు. ఆ తరువాత జాతీయోద్యమానికి కొనసాగింపుగా జరిగిన పోరాటాలలో పాల్గొన్న యోధులకు కూడా తన గ్రంథంలో స్థానం కల్పిస్తూ, తెలంగాణా ప్రాంతంలోని దేశ్‌ముఖ్‌ల ఆధిపత్యానికి వ్యతిరేకంగా న్యాయపోరాటం సాగిస్తూ దారుణ హత్యకు గురైన షేక్ బందగీ సాహెబ్ (కామారెడ్డి గూడెం), విద్యార్థిగా జాతీయోద్యమం చివరి దశలో ఉద్యమించడం మాత్రమే కాకుండా కార్మిక-కర్షక హితాన్ని ఆశిస్తూ పోరుబాట సాగి చివరకు పాకిస్థాన్ జైలులో అమరత్వం పొందిన సయ్యద్ హసన్ నాసిర్ (హైదరాబాద్), తెలంగాణా సాయుధపోరాట యోధుడు షేక్ నన్నే బచ్చా, నిజాం వంశీకుడైనా పాత్రికేయుడిగా ప్రజల పక్షం వహించిన జహందర్ అఫ్సర్ లాంటి యోధుల సాహసోపేత చరిత్రలను దృశ్యమనంగా నశీర్ అహమ్మద్ 'భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్ర ప్రదేశ్ ముస్లింలు' అను గ్రంథంలో స్థానం కల్పించారు.

నశీర్ రచనల్లో ఉన్న గొప్పదనం 'నేటివిటీ', రచన మొత్తంగా దేశీయంగా ఉంటుంది. సెక్యులర్‌గా ఉంటుంది. డెమాక్రటిక్ పర్స్పెక్టివ్ ఉంటుంది. చాలా చరిత్ర రచనల్లో ఈ అంశాలు దొరకవు. ఎందుకంటె చరిత్ర ఎప్పుడు కథనాత్మకం. నశీర్ చరిత్రను చెప్పారు, చెప్పించారు. దీనికి ప్రజాస్వామిక దృక్పథం కావాలి. అది ఈయన రచనల్లో మెండుగా ఉంది. ఈయనది వర్ణణాత్మక -విశ్లేషణాత్మక రచన. చరిత్రతో క్రూడ్ కంటెంట్‌ను ఇవ్వడం ఆనవాయితీ అయ్యింది. ఈయన చారిత్రక సమాచారాన్ని అందివ్వడం మాత్రమే కాకుండా మానవతా స్ఫూర్తిని కల్పించారు. ఈ రచనా పద్ధతి ఆయన్ని పాఠకుల హృదయాలలో నిలబెడుతుంది. ఒక పాత్రికేయుడు చరిత్రకారుడిగా మారితే మనకు ఈ వెలుగులు లభిస్తాయి. నశీర్‌లో వేదన ఉంది. అది ఆయన చాలా పర్స్పెక్టివ్‌తో చెబుతున్నారు.

ఎక్కువమంది వేదనను వైయక్తికం చేస్తారు. నశీర్ సామాజికం చేశారు. ఇస్లాంలో ఉన్న ఇంటిగ్రిటినీ ఆయన కన్వే చేయగలిగారు. ఆయన తన రచనలతో ముస్లింలలో కల్పించబడుతున్న ఇనెసెక్యూరిటీన్ని తొలిగిస్తున్నారు. ముస్లింల మీద రుద్దబడుతున్న ఆపరాధనా భావాన్ని, ఆత్మన్యూన్యతా భావజాలాన్నీ తుత్తినియలు చేస్తున్నారు. ఈ దేశం మనదేనని గర్వంగా చెబుతున్నాడు. సబాల్ట్రన్ స్టడీస్‌లలో ఇదే ప్రధానం. ఒక గిరిజనుడు, ఒక దళితుడు, ఒక ముస్లిం, ఒక మహిళ తమకు తాముగా నిలబడి తమ జనసముదాయాల గురించి మాట్లాడటమే సబాల్ట్రన్ స్టడీస్ మూలమైన అంశం. నశీర్ తన సమాజం నుండి మొత్తం సమాజం గురించి మాట్లాడుతున్నారు. ఇదే నిజమైన చరిత్ర.

◆

## పెదవి విప్పి...

- విజయచంద్ర
9438720409

భయమేస్తోందా
వంటిట్లో భార్యతో మాట్లాడు
వృద్ధురాలైన తల్లితో మాట్లాడు

నీ  బిడ్డను ఎత్తుకొని
గాలిలో ఎగరేస్తూ మాట్లాడు



ఉదయం గెడ్డం
చేసుకుంటూ మాట్లాడు
బాత్రూం లో మాట్లాడు
అద్దం ముందు
తల దువ్వుకుంటూ
పౌడర్ రాసుకుంటూ
నీలో నువ్వు మాట్లాడు

కూరగాయలమ్మే అమ్మి వస్తే
గడప దగ్గర కాసేపు
నిల్చొని మాట్లాడు

మార్నింగు వాకులో
స్నేహితులతో మాట్లాడు
ట్రైన్లో బస్సులో
సహ ప్రయాణికులతో మాట్లాడు

ఇంటి కొచ్చే
పాలవాడితో మాట్లాడు
బి.పి.  చెక్ చేసే
డాక్టరు గారితో మాట్లాడు

పేపర్ బాయ్ తో మాట్లాడు
వీధి  చివర
టీ కొట్టు  వాడితో మాట్లాడు
సినిమా హాల్లో పక్కనున్న
అపరిచితుడితో  మాట్లాడు

ఆటో వాడితో మాట్లాడు
రోడ్డు మీద యాచించే
బిచ్చగత్తె తో మాట్లాడు
కనిపించిన ప్రతీవాడితో  మాట్లాడుతూ ఉండు
ఆగకు
మాట్లాడటం ఆపకు

సంకట ఘడియలు దాపరించినప్పుడు
ఒకాయన పచ్చళ్ళ గురించి మాట్లాడుతాడు
మరొకాయన సంగీతాన్ని చర్చిస్తాడు
ఇంకొకడు ప్రియురాలు నగుమోము వర్ణిస్తూ ఉంటాడు
ఆ వైపు చూడకు

ఆకలి గురించి మాట్లాడు
అవసరాలు తీరక పోవడం  గురించి మాట్లాడు
కలవర పెడుతున్న ఆంక్షల గురించి మాట్లాడు
భయ కంపితుల్ని చేస్తున్న
నయా యమకింకర్ల గురించి మాట్లాడు

వారి భాష గురించి మాట్లాడు
వారి బెదిరింపుల గురించి మాట్లాడు
బిగ్గరగా అరిచి మరీ మాట్లాడు
రాత్రి నిద్రలో అదే తలచుకొని
కలలో పదే పదే పలవరించి మాట్లాడు

ఇంటి నుండి
వంటి నుండి
భయం భూతాన్ని తరిమికొట్టి
మాట్లాడు

మాట విశ్వగానం చేసి మాట్లాడు
ప్రళయ ఘోష చేసి మాట్లాడు
ఈ దేశం కంఠమై మాట్లాడు
గొంతుకలు లేనివారికి ఒక గొంతై మాట్లాడు ♦

# ప్రేరణ

- ఆంటోనీ చెకోవ్
తెలుగు: కె. ఉషారాణి
9492879210



"అయ్యా, మీరెంత దయామయులో కదా, ఒక నిరుపేద, ఆకలితో అలమటిస్తున్న ఒక మనిషిని గమనించారు. నేను అన్నం ముఖం చూసి మూడు రోజులయింది. నా దగ్గర అయిదు కోపెక్‌లు కూడా లేవు. రాత్రి నిద్రపోయేందుకు ఓ జాగా చూసుకోవాలన్నా డబ్బులు లేవు. దేవుడిమీద ప్రమాణం చేసి చెపుతున్నాను, నేనో గ్రామంలో బడిలో పంతులుగా పనిచేసాను. అక్కడి పంచాయితీలో వచ్చిన తగాదాల కారణంగా నా ఉద్యోగం ఊడిపోయింది. నిజానికి కొందరు తప్పుడు సాక్ష్యాలు చెప్పి నా ఉద్యోగాన్ని ఊడగొట్టారు. నా ఉద్యోగం పోయి ఇప్పటికి ఏడాది దాటిపోయింది."

స్కార్ట్స్వోవ్ పీటర్స్‌బర్గ్‌లో ఒక న్యాయవాది. బిచ్చగాని చిరిగిన నీలం కోటు వైపు ఒకసారి ఎగాదిగా చూసాడు. తాగుబోతు కళ్ళు, బుగ్గలపై ఎర్రటి మచ్చలు, చూడగానే ఇంతకు ముందే ఎక్కడో చూసినట్టనిపించింది స్కార్ట్స్వోవ్‌కి.

"ఇన్నాళ్ల తరువాత ఇప్పుడు నాకో అవకాశం వచ్చింది. కలుగా ప్రాంతంలో నాకో ఉద్యోగం వచ్చింది. అయితే అక్కడికి వెళ్ళడానికి దారి ఖర్చులకు నా దగ్గర సరిపడ డబ్బులు లేవు. దయతో మీరు సహాయం చేస్తే.. నాకూ అడగాలంటే సిగ్గుగానే ఉంది, కానీ తప్పని పరిస్థితులలో మిమ్మల్ని అడగవలసి వస్తున్నది." అంటూ తన విన్నపాన్ని కొనసాగించాడా బిచ్చగాడు.

స్కార్ట్స్వోవ్ యథాలాపంగా అతని పాదాల వైపు చూసాడు. ఒక కాలి బూటు కేవలం చెప్పులా గుంటే రెండోది మాత్రం బూటు లాగే ఉంది. గబుక్కున స్కార్ట్స్వోవ్‌కి గుర్తొచ్చింది.

"ఆ, మొన్న నువ్వు నన్ను సదవోయ్ వీధిలో కలిసావు! అప్పుడు నువ్వు ఒక స్కూల్ టీచర్ పని అనలేదే. ఒక విద్యార్థినని విద్యాలయం నుండి బహిష్కరించ బడ్డానని చెప్పావు. గుర్తుందా?"

"కాదు కాదు. అలా జరిగే అవకాశమే లేదు" అంటూ కలవర పాటుతో గొణిగాడు బిచ్చగాడు. మీకు అనుమానంగా ఉంటే నా దగ్గర ఆధారాలను కూడా చూపెడతాను" అన్నాడు.

"ఇక అబద్ధాలు ఆపు. మొన్నే విద్యార్థినన్నావు. పైగా బహిష్కరించబడ్డట్టు కూడా చెప్పుకున్నావు. నీకు జ్ఞాపకం లేదా?"

స్కార్ట్స్వోవ్ చీదరించుకుని బిచ్చగాని వైపు నుండి పక్కకు మొఖం తిప్పుకున్నాడు. "నువ్వు చేస్తున్నది నేరం. పేదవాడివి ఆకలితో ఉన్నవాడివి అయినంత మాత్రాన నీకు ఇంత నిస్సిగ్గుగా నేరం చేసే హక్కు లేదు !"

"నేను అబద్ధం చెప్పడం లేదయ్యా. కావాలంటే నా ఆధారాలు కూడా చూపెడతాను" అంటూ మళ్లీ బతిమాలుతూ గొణగడం మొదలెట్టాడు బిచ్చగాడు."

"నిన్నెవరయ్యా నమ్మేది!? అంటూ అసహ్యించుకున్నాడు

స్కార్త్సోవ్. "విద్యార్థుల పట్ల, స్కూల్ టీచర్ల పట్ల ప్రజలకున్న దయా హృదయాన్ని ఆసరాగా చేసుకుని నువ్విలాగ వేషాలు వేస్తున్నావు. ఎంతటి దిగజారుడు, ఎంతటి నికృష్టత, తలుచుకుంటేనే వాంతి వస్తుంది!" అంటూ స్కార్త్సోవ్ నిర్దాక్షిణ్యంగా బిచ్చగాడిని తిట్టి పోసాడు. మరో వైపు తనలోని ప్రేమకు, దయా హృదయానికి తానే పొంగిపోయాడు. బిచ్చగాడు అబద్ధాలు చెప్పడం చూస్తే అతనికి అసహ్యం వేయడమే కాదు. అతని మనసు గాయపడింది కూడా. ఆలా నిస్సిగ్గుగా బయటపడి ఇతరులకు బాధలు చెప్పుకోవడం ఒక విధంగా దయార్ద్ర హృదయాలపై దాడే అని అనిపించింది. మంచి మనసున్న వారు పేదలకి దానం చేయాలన్న సత్ సంకల్పాలన్నీ ఈ అబద్ధాలు చెప్పేవారి వలన నీరుగారి పోతాయి అని నిట్టూర్చాడు.

మొదట్లో బిచ్చగాడు తనని తాను సమర్థించుకున్నాడు. ఒట్లేసాడు. ఆ తరువాత సిగ్గుతో తల దించుకున్నాడు. మౌనంగా ఉండి పోయాడు.

కాసేపయిన తరువాత గుండెలు మీద చెయ్యి వేసుకుని, తల దించుకునే, "అయ్యా! నేను అబద్ధాలు చెప్పిన మాట నిజమే. నేను స్కూల్ టీచర్ని కాదు. విద్యార్థిని కూడా కాదు. అదంతా కట్టు కథే. నేను రష్యాలో భక్తి గీతాలు పాడేబృందంలో ఒకడిని. తాగుడుకు బానిసని అవడం వలన నన్నా పనిలో నుంచి తీసేసారు. కానీ ఏంచేయను? దేవుని మీద ప్రమాణం చేసి చెపుతున్నాను, అబద్ధాలు చెప్పకుండా నాకు దినం గడవదు. నేను నిజం చెపితే నాకు ఎవరూ ఏ సహాయం చేయరు. నిజం చెప్పి ఆకలితో మాడి పోవాలి. చలిలో గడ్డ కట్టాలి. మీరన్నది నిజమే. నేను అబద్ధాలే చెప్పాను. కానీ నాకు గత్యంతరం లేకపోయింది. ఏం చేయను?"

''ఏం చేయాలా ? ఏం చేయాలి అని నన్ను అడుగుతావా? సిగ్గు లేదూ??" స్కార్త్సోవ్ బిచ్చగాని పైపైకి ఎగబడి మరీ గట్టిగా కేకలేశాడు. "పని చెయ్యి. పని. నువ్వు చెయవలసింది అదే." అంటూ హుంకరించాడు .

"పని .... పని చేయాలని నాకు కూడా తెలుసు. కానీ పని ఎక్కడుంది"

"అర్థం లేకుండా మాట్లాడకు. నువ్వు యవ్వనంలో ఉన్నావు. బలంగా ఉన్నావు. ఆరోగ్యంగా ఉన్నావు. నీకు చెయ్యాలనుకుంటే పనే దొరకదా. నువ్వొక బద్ధకస్తుడివి. తాగుబోతువి. కొవ్వెక్కి బలిసావు. వోడ్కా తాగి తాగి పొట్ట పెంచావు. అబద్ధాలు చెప్పడం మరిగావు. నీ నిలువెల్లా అవినీతే. ఎందుకూ పనికి రాకుండా పోయావు. అబద్ధాలు చెప్పడం, అడుక్కోవడం, ఇంతే నీ బతుకు. ఒక ఆఫీస్‌లో కూచుని మాత్రమే నువ్వు పని చేయడానికి సిద్ధపడతావు. రష్యన్ భక్తి గీతాలు బృందగానం చేయడమో లేదా బిలియర్డ్ ఆటలో గుర్తులు గీచే పనో మాత్రమే చేయాలనుకుంటావు. నీకు పనేం ఉండకూడదు. నెల నెలా జీతం మాత్రం రావాలి.

"కాయ కష్టం చేయడం నీకు సరిపడదు కదా ! ఏ ఫ్యాక్టరీ లోనో, ఏ బరువులు మోసే పనో చేయొచ్చుకదా! నువ్వు నాజూకయిన పనులే చేయాలనుకుంటావు అవునా?".

"మీరన్నవన్నీ నిజమనుకోవలసి వస్తుంది ఎవరయినా. కానీ నాకు అటువంటి పనులు మాత్రం ఎవరిస్తారు? అన్నాడు విచారంగా బిచ్చగాడు. "కూలి పని చేసే వయసు కాదు నాది.. ఓ వ్యాపారం చేసే వయసూ కాదు. వ్యాపారం చేయాలన్నా సహాయకుడి దగ్గరి నుండి మొదలు పెట్టాలి. "ఇప్పుడు ఈ వయసులో నాకా పనులు ఎవరిస్తారు చెప్పండి. నేనా తరగతి మనిషిని కూడా కాదు కదా ! ఫ్యాక్టరీలో పనా నాకు చేతకాదు. పని చేయడానికి పనిలో మెళుకువలు తెలియాలి కదా! నాకటువంటి పనులు రానే రావు."

"చెత్తవాగుడు కట్టి పెట్టు ! నువ్వు చేసే పనిని సమర్థించుకోడానికి ఏదో ఒకటి వాగకు. కట్టెలు కొట్టే పని నేనిస్తాను. చేస్తావా ?" దబాయించాడు స్కార్త్సోవ్.

"నాకేం అభ్యంతరం లేదు. అయితే ఇప్పుడు కట్టెలు కొట్టే వాడికి పని పోతుంది పాపం" అనక తప్పలేదు బిచ్చగాడికి.

" సోమరి పోతులంతా చెప్పే కుంటి సాకులే ఇవి ! పని ఇవ్వగానే ఏదో వంక పెడతారు'.

"అబ్బే అదేం లేదండి. నేను తప్పకుండా చేస్తాను"

"మంచిది, అదీ చూద్దాం ... అన్నాడు స్కార్త్సోవ్. వెంటనే కాస్తంత వికృతానందంతో తన ఇంట్లో పనిచేసే వంట అమ్మాయిని కేకేశాడు.

"ఓల్గా ! ఈతనిని మన కట్టెల కొట్టంలోకి తీసుకెళ్ళు. అక్కడ కట్టెలు కొట్టే పనిని పురమాయించు" అని చెప్పాడు.

బిచ్చగాడు విధిలేక ఆమెను అనుసరించాడు. అతని నడతను బట్టి చూస్తే ఆకలికి తాళలేక కట్టెలు కొట్టడానికి

ఒప్పుకున్నట్టు కనిపించదు. కేవలం అవమానం నుండి బయట పడడానికి, మాట తప్పలేక ఒప్పుకున్నట్టు కనిపిస్తుంది. వోడ్కా ప్రభావం వల్ల కూడా పని చేయడానికి ఏ మాత్రం ఇష్టపడి ఉండదు.

స్కార్ట్సోవ్ వెంటనే డైనింగ్ గదిలోకి వెళ్ళాడు. అక్కడి నుండి కట్టెలు కొట్టే కొట్టం కనిపిస్తుంటుంది. కిటికీ దగ్గర నిలబడి అటువైపే చూడడం మొదలు పెట్టాడు.

స్కార్ట్సోవ్, వంటామె, బిచ్చగాడు పెరట్లోకి వెళ్లడం గమనించాడు. కొట్టం వైపు నడవడం చూసాడు. ఓల్గా వాడిని కోపంతో తిట్టడం, చేతులూపడం, కట్టెల కొట్టం తలుపు తీయడం, తలుపు దభాల్న వేయడం అన్నీ కనపడుతూనే ఉన్నాయి.

''ఈమె కాఫీ తాగుతుండగా మధ్యలో పిలిచాననుకుంటాను. అందుకే మండి పడుతున్నట్టు ఉంది. విచిత్రమైన మనిషి" అనుకున్నాడు.

నకిలీ స్కూల్ మాస్టర్, నకిలీ విద్యార్థి ఓ చెక్క ముక్కను పట్టుకుని ఎర్రటి తన బుగ్గలకు ఆనించడం, ఆలోచనలలో మునగడం చూసాడు. వంటామె ఓ గొడ్డలి వాడి ముఖాన కొట్టింది. కాండ్రించి నేలపై ఉమ్మింది. ఆమె హావభావాలు చూస్తే అతనిని తిట్టి పోస్తున్నట్టు కనిపిస్తూనే ఉంది. బిచ్చగాడు ఇక తప్పదన్నట్టు ఓ కట్టెను లాక్కొని కాళ్ళ మధ్య పెట్టి కొట్టడం మొదలెట్టాడు. కానీ చెక్క ముక్క నిలవడం లేదు అటు ఇటు కదులుతున్నది. కింద మీద జారి పడి పోతున్నది. గొడ్డలి దెబ్బదానిపై పడడమే లేదు. ఆఖరికి చెక్కను మళ్ళీ కాళ్ళ మధ్య గట్టిగా అదిమి పెట్టుకున్నాడు. గొడ్డలిని కర్ర పైకిఎత్తి వేటు వేసాడు. అయినా కర్ర కదిలి పోయింది. ఊపిరి బిగ బట్టి ప్రయత్నం చేసాడు. ఈ సారి గొడ్డలిని మరింత జాగ్రత్తగా గురిపెట్టి కర్రపై వేసాడు. అయినా చెక్క ముక్క జారిపోతూనే ఉంది. బిచ్చగాడు ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

స్కార్ట్సోవ్‌కి కొంచం సిగ్గనిపించింది. ఏ మాత్రం అనుభవం లేని ఓ తాగుబోతుని, రోగిష్టిని కఠినమైన పనిలో పెట్టానేమో అని కాస్త బాధనిపించింది కూడా. అయినా వెంటనే తేరుకున్నాడు.

"ఫరవాలేదు, పని చెయ్యనీ ..." అతని మంచి కోసమే కదా నేను చెప్పింది" అని సంతృప్తి పడ్డాడు. అలా ఆలోచిస్తూ డైనింగ్ గది నుండి చదువుకునే గదిలోకి వెళ్లి పోయాడు.

ఓ గంట గడిచిన తరువాత ఓల్గా వచ్చింది. కట్టెలు కొట్టే పని అయిందని చెప్పింది.

"ఇదిగో ఈ అర్ధరూబుల్ అతనికి ఇచ్చేయి" అన్నాడు స్కార్ట్సోవ్. "అతనికి పని నచ్చితే మళ్ళీ రమ్మను. అతనికి పని ఎప్పుడూ ఉంటుందని చెప్పు"

అలా నెలలోని ప్రతి మొదటి రోజు బిచ్చగాడు వచ్చి కట్టెలు కొట్టి అర్ధరూబుల్ తీసుకెళ్లడం మొదలయింది. నిజానికి అతను నిలబడడమే కష్టంగా ఉన్నట్టు కనిపించే వాడు మొదట్లో. పోను పోను మరింత క్రమం తప్పకుండా రావడం, నెలలో మరిన్ని ఎక్కువ సార్లు రావడం మొదలు పెట్టాడు. అలా కట్టెల కొట్టంలోని కట్టెలన్నీ కొట్టడం పూర్తి చేసేసాడు. అతను వచ్చిన తరువాత ఏ పని చెప్పినా చేసేవాడు. ఒక్కొక్క సారి పేరుకు పోయిన మంచును అంతా ఊడ్చేసేవాడు... చెత్తను తుడిచేవాడు. తివాసీలకుండే దూళి దులిపేసేవాడు. రగ్గులను శుభ్రం చేసేసేవాడు. ఎప్పుడూ వారానికి 35, 40 కోపెక్కులకు తక్కువ కాకుండా ఆర్జించేవాడు. ఒక సారైతే ఏకంగా పాత కోటును కూడా సంపాదించుకున్నాడు.

స్కార్ట్సోవ్ వేరే ఊరు మారాల్సి వచ్చినప్పుడు వస్తువులు సర్దడానికి, ఫర్నిచర్ మార్చడానికి కూడా అతనినే ఉపయోగించుకున్నాడు. అటువంటి సమయంలో కూడా బిచ్చగాడు తల వేళ్ళాడేసుకుని బండి పక్కన నడుస్తుండేవాడు. విచారంగా నెమ్మదిగా అడుగులేసే వాడు. కనీసం హడావుడి పడుతున్నట్టు కనిపించనన్నా కనిపించే వాడు కాదు. ఫర్నిచర్‌ని ముట్టుకున్నట్టు కూడా అనిపించేది కాదు. చలితో వణికి పోయేవాడు. వేన్‌లోని మిగిలిన పనివారంతా ఏమి పట్టనట్టు, గందర గోళంగా ఉండి, పెద్ద మనుషుల కోటు వేసుకున్న ఈ బిచ్చగాడిని చూసి తెగ ఎగతాళి చేసే వారు.

పనంతా అయిన తరువాత స్కార్ట్సోవ్ అతనిని పిలిచి, "నా మాటలు నీకు బాగా ఉపయోగపడ్డా యనుకుంటున్నాను" అంటూ చేతిలో ఒక రూబుల్ పెట్టాడు. "ఇది నీ కష్టానికి. ఇప్పుడు నువ్వు నెమ్మదస్తుడిగా తయారయ్యావు. పనికి బెదరడం లేదు. ఇంతకీ నీ పేరేంటి ? అని అడిగాడు.

"లూషకోవ్"

"చూడు లూషకోవ్, నేను నీకు ఇంతకంటే మంచి పని ఇవ్వగలను. నీకు రాయడం వచ్చా?" అని అడిగాడు.

"వచ్చుండి."

"అయితే రేపు నాతో పనిచేసిన నా స్నేహితుడి దగ్గరకు వెళ్ళు. అతను నీకు చూచివ్రాతలు వ్రాసే పనిని అప్పగిస్తాడు. బాధ్యతగా చేసుకో. నేను చెప్పిన మాటలు ఎప్పుడూ గుర్తు పెట్టుకో. కష్టపడి పని చెయ్యి. జీవితంలో బాగుపడు. నేను చెప్పినవి ఎప్పుడూ మర్చిపోకు! సరేనా !!" అని చెప్పి స్నేహితునికి వ్రాసిన ఉత్తరాన్ని అతని చేతిలో పెట్టాడు.

తానొక మనిషిని సన్మార్గంలో పెట్టినందుకు స్కొర్ట్సోవ్ చాలా తృప్తిగా ఉన్నాడు. లూషకోవ్ భుజం తట్టి కరచాలనం చేసాడు.

మర్నాడు లూషకోవ్, స్కొర్ట్సోవ్ ఇచ్చిన ఉత్తరాన్ని తీసుకుని అతని స్నేహితుని దగ్గరకు వెళ్లాడు. ఆ తరువాత స్కొర్ట్సోవ్ పెరట్లో పని చేయడానికి అతనెన్నడూ రాలేదు.

కాల చక్రంలో రెండేళ్లు గడిచిపోయాయి. ఓ రోజు స్కొర్ట్సోవ్ సినిమాటికెట్ కొనుక్కోడానికి థియేటర్ క్యూలో నిలబడి ఉన్నాడు. టికెట్ ఇచ్చే వ్యక్తికి డబ్బులు ఇచ్చేటప్పుడు, అతని పక్కనే ఉన్న ఒక పొట్టి మనిషిని చూసాడు. అతను మేక చర్మం కాలర్ ఉన్న చొక్కా తొడుక్కుని, పిల్లి చర్మం టోపీ పెట్టుకుని మురికి బట్టలేసుకుని ఉన్నాడు. అతడు గ్యాలరీ టికెట్ అడుగుతున్నాడు. అందుకు తన దగ్గరున్న కోపెక్‌లను పోగుచేసి ఇస్తున్నాడు.

"నువ్వు లూషకోవ్ కదూ " అని అడిగాడు స్కొర్ట్సోవ్. తన దగ్గర కట్టెలు కొట్టిన నాటి లూషకోవ్‌ను గుర్తు చేసుకుంటూ.

"ఇప్పుడేం చేస్తున్నావ్? బాగున్నావ్ కదా" అంటూ కుశలమడిగాడు.

"తమరి దయ వలన బాగున్నానండి" నేనిప్పుడు ఒక నోటరీ ఆఫీస్‌లో పని చేస్తున్నాను. 35 రూబుల్స్ సంపాదిస్తాను." జవాబిచ్చాడు లూషకోవ్.

"దేముడి దయవలన బాగుపడ్డావన్నమాట. నాకు చాలా సంతోషంగా ఉంది. నిజానికి నువ్వు నాకు మనవడి లాంటి వాడివి. నేనే నిన్ను సరైన దారిలో పెట్టాను. నేను నిన్నెంతగా తిట్టానో నీకు గుర్తుండే ఉంటుంది. అప్పుడయితే నువ్వు భరించలేక కుప్ప కూలి పోయావు. నా మాట విని బాగు బడినందుకు నాకు చాల సంతోషంగా ఉంది."

"ధన్యవాదాలు స్కొర్ట్సోవ్, అన్నాడు లూషకోవ్. నేనా రోజు మీ దగ్గరకు రాకపోయి ఉంటే ఇప్పటికీ నన్నో స్కూల్ మాస్టారిగానో, విద్యార్థిగానో పరిచయం చేసుకుంటూ ఉండేవాడిని. మీ ఇంటికి రావడం వలనే నేను బురద గుంట నుండి బయట పడ్డాను. నా జీవితం మలుపు తిరిగింది"

"నాకెంతో సంతోషంగా ఉంది."

"మీ మాటలకు చేతలకు కృతజ్ఞతలు. ఆ రోజు మీరు చెప్పిన మాటలు ఆణి ముత్యాలు. మీకు, ముఖ్యంగా మీ వంటామెకు నేను ధన్యవాదాలు చెప్పాలి. ఆ ఆదర్శమూర్తికి, కరుణామయికి శిరసు వంచి నమస్కరిస్తున్నాను. నేను బతికినన్ని రోజులు మీకు రుణపడే ఉంటాను. కానీ నన్ను నిజంగా కాపాడింది మాత్రం మీ వంటామే."

"అదెలా ?" ఆశ్చర్య పోయాడు స్కొర్ట్సోవ్.

"అదెలాగంటే, నేను మీ దగ్గరికి కట్టెలు కొట్టేందుకు వచ్చే వాడిని కదా !. రాంగానే ఆమె "ఓ తాగుబోతా" అంటూ తిట్ల దండకం మొదలు పెట్టేది. "భగవంతుడు నిన్ను వదిలించుకున్నాడు. అయినా నీకు చావు రాదు" అని నా ఎదురు గుండా కూచుని తిట్టి పోసేది, నా ముఖంలోకి చూస్తూ.. దుఃఖపడేది.. ఏడ్చేది.. "నష్ట జాతకుడా ! నీ జీవితంలో సుఖమనేదే లేదు కదా, నువ్వు యమలోకంలో నిలువునా కాలిపోతావు, తాగుబోతా! ఏడుపుగొట్టు వెధవ! నువ్వు బాగుపడవు" అంటూ అదే తరహాలో తిట్ల దండకం మొదలు పెట్టేది. నా గురించి ఎన్ని సార్లు మదన పడిందో! ఎంతగా దుఃఖించిందో నేను చెప్పలేను. కానీ నన్ను పూర్తిగా కదిలించింది మాత్రం ఒకే ఒక్క విషయం... నేను కొట్టవలిసిన కట్టెలు ఆమె కొట్టడం! నేను ఒక్క కట్టెముక్కను కూడా మీ ఇంట్లో కొట్టలేదన్న విషయం మీకు తెలుసా?! నా బదులు ఆమే కట్టెలు కొట్టేది. ఆమే నన్ను కాపాడింది. నేను మారడానికి కారణం అమే. ఆమె ప్రవర్తనే నన్ను పూర్తిగా మార్చేసింది. ఆమె ప్రభావంతోనే క్రమంగా నేను తాగడం మానేసాను. ఎందుకంటే నేను చెప్పలేను. ఆమె మాట తీరు, చేతలు, ఆమె చెప్పే విధానం, అన్నీ నన్ను పూర్తిగా మార్చేసాయి. నేను ఎన్నటికీ ఆమెను మర్చిపోలేను," అంటూ ఆగాడు.

కాసేపటికి తేరుకుని, మనం లోపలకి వెళ్లాల్సిన సమయం వచ్చింది. బెల్ మోగబోతున్నది. ఇక మనం బయలు దేరదాం" అంటూ లూషకోవ్ స్కొర్ట్సోవ్‌కి నమస్కరించి గ్యాలరీ వైపు అడుగులు వేసాడు. ♦

## కవిత

# ఆకలి తీర్చేదెవరు?

- పంబి మురళి కృష్ణ
6301223677

పొద్దు పొడవకమునుపే
మొద్దు నిద్ర విడచి
ఎద్దు కాడిపట్టి, సద్ది సంకనెట్టి
పచ్చని పొలానికి, వెచ్చని సూరీడు మాదిరి
ఉపిరులూదగానే...
మా ఆ సా(స్వా)మి వచ్చాడంటూ
పంటసైతం కంకులు వంచి
నీకు వందనమంటుంది.
బుక్క నిండడానికి
గుప్పెడు బువ్వ నీకు లేకున్నా
చేతికొస్తున్న పంటకొడుక్కి
పరమాన్నమంటి ప్రసాదాన్ని
పై మందుగా చల్లుతాడు
మట్టివాసననే తనకు
నిత్యం శ్వాసగా సేవిస్తాడు
అందలంలో ఆకాశగంగా ఉంటే
అందుబాటులో ఉన్న నీ స్వేదాన్ని
సేద్యానికి అందించి ఆనందిస్తాడు..
మండుటెండలో మంచెనెక్కి
బువ్వ తిన్నాక సేద తీరితే
నా సేనేమౌతుందో అని ఒళ్ళంతా కన్నులు చేసి
పచ్చని తన పొలాన్ని చూసుకుంటూ
మండుటెండని కూడా లెక్కచేయడు,
పంటనే ప్రపంచంగా భావించి,
పంటపైనే పంచప్రాణాలు పెట్టుకుని,
అలుపన్న మాటే తెలియనంతలా
నలుపైన చీకటి కూడా నీ స్నేహితుడిలా



నిన్ను నడిపిస్తూ ఆ రాత్రి ఆరా తీయకుండా
నీ ఆతృతను చూసి ఆనందపడుతుంది.
ఆ ఆనందంలో నందనవనంలా అగుపిస్తుంది నీ పొలం,
నీ భుజానికి మొలిచినట్టుగా ఉంటుంది ఆ హలం
నువ్వు హలం పట్టుకుని అలా దున్నుతుంటే
ఆ హాలాహలాన్ని మదించినట్లుంది
ఫలించిన పంట చేతికి రాగానే నీ కన్నులవెంట
ఆనంద అల జలంలా జారుతుంది
పంట ప్రాణాన్ని చేతిన పట్టుకుని
చరకా యంత్రంలా యార్డులు చుట్టూ తిరిగెవు
పంట దాచుకొనికి గిడ్డంగులు లేవుకానీ
అడుగడుగునా అడ్డంకులే
కాలం గడుస్తున్నా, కళ్ళు తడుస్తున్న,
కాళ్ళు అరుగుతున్న కాని కనికరం కలగడంలేదు
గిట్టుబాటు ధర పెరగడం లేదు, కంటినీరు ఆగడంలేదు
కన్న కొడుకు చూడడంలేదు, కాడుపాకలి తీరడంలేదు
ఏడాది కష్టానికి కనీస శ్రమ గుర్తింపులేక
కన్నీటిని పన్నీరులా దిగమింగలేక
పురుగుల మందుని ఇకపై పసిడి పంటకు
ప్రయోగించడం ఇష్టంలేక ఏం చెయ్యాలో పాలుపోక
పచ్చని పంట కౌగిట ఒదిగి ఓడిపోతున్నారు మన
రైతన్నలు... ♦

# తపన

- డా॥ జి. శైలమ్మ
9618361905

ప్రాణమున్నన్ని నాళ్లు..
మనస్సు వున్నన్ని నాళ్లు..
పెరటి మొక్కనై పువ్వులనిస్తా!
పచ్చని పొలాన్నై పంటనిస్తా!
తరువు అనగలదేమో..
మనిషి అనగలడా?
ధైర్యంగా...
నమ్మకంగా...
పదుగురికి ఆశ్రయమివ్వగలడా?
వానాకాలంలో వానచినుకులా...
ఎండాకాలంలో మండే ఎండలా...
ఉరుముల మెరుపుల మధ్య పిడుగులా
నింగీనేలకు పొత్తుకుదిరినట్టు
బాల్యంలో సేవలు పొందుతూ...
యవ్వనంలో బాధ్యతలు తీసుకొంటూ...
వృద్ధాప్యంలో సేవలందిస్తూ...
తలలో నాలుకలా
వుండాలన్న తపనలు



మానవత్వపు విలువలకు
నెలవు దొరికినట్లే
మనిషన్న మాటకు అర్థం
అలంకారం అందం ♦

# కాశ్మీర్ చేరిన మోడీ - షా కౌటిల్యం




- తెలకపల్లి రవి

కాశ్మీర్‌లో షూటింగులకు రావాలని ప్రధాని మోడీ జాతి నుద్దేశించి ప్రసంగం చేస్తున్నప్పుడే ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ ప్రతిపక్ష నేత గులామ్ నబీ ఆజాద్‌నూ, ఉభయ కమ్యూనిస్టు పార్టీల ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి.రాజాలను పోలీసులు విమానాశ్రయంలో అడ్డుకుని అరెస్టు చేసి ఢిల్లీ తిప్పి పంపేశారు. భద్రతా సలహాదారు అజిత్ దోవల్ స్థానికులతో కలసి హాయిగా భోజనం చేసి కబుర్లు చెప్పుకుంటున్న చిత్రాలు మాత్రం మీడియాలో పచార్లు కొడుతున్నాయి. మరో ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ కూడా గృహ నిర్బంధంలో కొనసాగుతున్నారు. బిజెపి కుటిల నీతికి, ద్వంద్వ క్రీడకూ ఇంతకు మించిన ఉదాహరణ అవసరం లేదు. సాయుధ బలగాల పహారాలో, ఆంక్షల వలయంలో దిగ్బంధితమైన కాశ్మీర్ ప్రశాంతంగా వున్నట్టు ప్రచారాలు సాగుతున్నాయి. హిందూ మెజార్టీ జమ్మూలో కొన్ని చోట్ల ఆంక్షలు సడలించి దాన్నే సాధారణ పరిస్థితిగా చూపించే ప్రయత్నం జరుగుతున్నది. శుక్రవారం ప్రార్థనల కోసం కొద్దిగా సడలింపు ఇచ్చినట్టు అదే సోమవారం ఈద్ సందర్భంగా మరింత పెంచనున్నట్టు చెబుతున్నారు. కాశ్మీర్ నివురు గప్పిన నిప్పులా వుందని ప్రతివారికీ తెలిసినా మభ్య పెట్టే కేంద్ర వ్యూహం ఇది. 'మోడియా'గా మారిన మీడియా సంస్థలు కొన్ని ఈ ప్రచారాన్ని ప్రజల బుర్రల్లోకి విజయవంతంగా ఎక్కించాయి. ఎందుకంటే కాశ్మీర్ 370వ అధికరణం రద్దు, 35(ఎ) తొలగింపు వీర కృత్యమైనట్టు మోత మోగుతున్నది. ఇది దేశంలో మోడీ మలి దఫా పాలన ప్రతిబింబమే.

**రాజ్యాంగ పరిహాసం**

అసలీ 'రద్దు' తీరులోనే బూటకత్వం ఇమిడి వుంది. 370 అధికరణం కింద కాశ్మీర్‌కు సర్వ స్వతంత్ర హక్కులు సంక్రమించి వుంటే దానిలోని ఒక ఉప నిబంధన తోనే ఎలా రద్దు చేయగలరు? రాజ్యాంగ సవరణ చేయలేదు గనక 370 ఆర్టికల్ ఇప్పటికీ వుంది. కేంద్ర శాసనాలు ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదించాకే కాశ్మీర్‌కు వర్తించాలని వుంటే దాన్ని మార్చి ఇప్పుడు అన్నీ వర్తిస్తాయన్నారు. గతంలోనూ 49 రాష్ట్రపతి ఉత్తర్వులలో 47, కేంద్ర జాబితా లోని 97 అంశాలలో 94 కాశ్మీర్‌కు వర్తింప చేయబడ్డాయి. ఒకటవ అధికరణం ప్రకారం భారత దేశం రాష్ట్రాల సమాఖ్య. ఇది కాశ్మీర్‌కు కూడా పూర్తిగా వర్తిస్తుంది. అంటే కాశ్మీర్‌కు మిగిలిన రాష్ట్రాలకున్న హక్కులు కాక స్వయం ప్రతిపత్తి అదనం. ఇప్పుడు ప్రత్యేక ప్రతిపత్తిని తీసేస్తు న్నామంటూ రాష్ట్ర ప్రతిపత్తినే కత్తిరించారు. రాష్ట్ర ప్రజలతో శాసన సభతో సంప్రదించకుండానే ముక్కలు చేసి రాష్ట్ర హోదా కూడా లేకుండా చేశారు. లడఖ్ అభివృద్ధి కోసం త్రిపుర వామపక్ష ప్రభుత్వం వలె సాధికార ప్రతిపత్తి మండలి కోర్కె వుంది గాని పరాధీన కేంద్ర పాలిత ప్రాంతంగా చేయమని కాదు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా లాగేసి కేంద్రపాలిత ప్రాంతంగా చేయడం ఇన్నేళ్లలో ఏ రాష్ట్రానికీ జరగని అన్యాయం. మాతృ సంస్థ ఆరెస్సెస్ అడుగు జాడల్లో బిజెపి చిరకాలంగా చెబుతూ వచ్చిన విధాన ఫలితం. బిజెపి ఎన్నికల ప్రణాళికలో కూడా 370 రద్దు వుంది. కాని అందరితో సంప్రదించి చేస్తామన్నారు. సాయుధ దళాలను దింపి, సస్పెన్స్ నింపి ఎంపీలకు కూడా తెలియకుండా మెడ మీద పెట్టి

చేయించుకున్నారు.

**స్వార్థ రాజకీయాల ఫలితమే**

భౌగోళిక వ్యూహాత్మక ప్రయోజనం కోసం కాశ్మీర్‌ను మన దేశంలో కలుపుకోవడానికి మనం ఇచ్చిన భరోసా 370. ఈ భరోసాకూ అప్పటి రాజు హరిసింగ్‌కు సంబంధం లేదన్నది మరో అసత్యం. ఆ రాజు అప్పట్లో పాకిస్తాన్ తోనూ మంతనాలు జరిపారు. కాశ్మీర్‌లో ప్రజా నాయకుడుగా వున్న షేక్ అబ్దుల్లా భారత్ వైపు నిలిచారు. పాక్ సైన్యాల మెరుపు దాడిని, గిరిజన తెగల నాయకుల తిరుగుబాటును ఎదుర్కొన్నారు. లేకుంటే కాశ్మీర్ విలీనమే సాధ్యపడేది కాదు. ఆయనను తెగనాడటం బిజెపి రాజకీయాలకు సరిపోతుంది గాని చరిత్ర సత్యం కాదు. ఇతర మతాలకున్న ప్రత్యేక నిబంధనలు చూడకుండా వ్యక్తిగత చట్టాలు ముస్లిములకే వున్నాయని బిజెపి చెబుతుంటుంది. అలాగే ఇతర రాష్ట్రాలకు వున్న ప్రత్యేక అధికరణాలను పట్టించుకోకుండా కాశ్మీర్‌నే చూపిస్తుంటుంది, అవన్నీ నిక్షేపంగా వుంటే కాశ్మీర్ దేశంలో భాగం కాకుండా పోయిందా? కాశ్మీర్ ప్రకృతి వరప్రసాదంగా, సినిమా షూటింగులకు నిలయంగా విరాజిల్లినప్పుడు 370 ఆర్టికల్ లేదా? ఆ పరిస్థితి చెడగొట్టిందెవరు? షేక్ అబ్దుల్లాను జైలులో పెట్టి మీర్ కాసింను ముఖ్యమంత్రిని చేసి పాలించాలని పాకులాడింది కాంగ్రెస్. ఇందిరా గాంధీ ఎన్టీఆర్‌పై కుట్రకు ముందు కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లాను పడగొట్టి ఆయన బావ షా ను తీసుకొచ్చాకే పరిస్థితి మరీ దిగజారింది. ఆఫ్ఘన్ పరిణామాలతో అంతర్జాతీయావరణమూ చెడింది. దానికి వత్తాసుగా పాకిస్తాన్, అమెరికా కుట్రలు నడిపాయి. ఈ నేపథ్యంలో ఉగ్రవాదం వేర్పాటువాదం తీవ్రమైనాయి. ఫరూక్, ఒమర్ అబ్దుల్లా తండ్రీ కొడుకులిద్దరూ బిజెపి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాలలో వున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ తోనూ పిడిపి తోనూ మిశ్రమ ప్రభుత్వాలు నడిపిన చరిత్ర రెండు పెద్ద పార్టీలకూ వుంది. హరిసింగ్ కుమారుడైన కరణ్‌సింగ్ విహెచ్‌పి అంతర్జాతీయ అధ్యక్షుడుగా పని చేశారు. బిజెపి, కాంగ్రెస్‌లు రెండిటికీ నిలయమైన సింధియాల కుటుంబంతో ఆయన వియ్యమందారు కూడా (ఇప్పుడు వీరిద్దరూ కాంగ్రెస్‌లో వుండి సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు). మూడు కుటుంబాల వల్లనే అంతా పాడై పోయిందని చెబుతున్న బిజెపి వాటితో ఎంతగా ముడి వేసుకుందో చెప్పే వాస్తవాలివి. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ అనడమే గాని ఈ రెండు చివరల్లో ఆ రెండు పార్టీలు ఎన్నడూ స్వంతంగా అధికారం లోకి వచ్చే అవకాశమే లేకపోయింది. ఆ ఆరాటం వల్ల కలిగినవే ఈ దుష్పరిణామాలు. రాష్ట్రం లోని పార్టీల అవకాశవాదాలు ఇందుకు తోడైనాయి. అంతేగాని 370 అధికరణంను తిట్టిపోయడటం హాస్యాస్పదం.

370 ఆర్టికల్ చేసిన పాపమేమిటి?

వాస్తవానికి 370 ఆర్టికల్ సహాయంతో షేక్ అబ్దుల్లా ప్రభుత్వం సమూలమైన భూ సంస్కరణలు అమలు చేసింది. యాభైల ముందే రుణ మాఫీ అమలు చేసింది. అందుకే కాశ్మీరీల రుణ భారం, భూమి లేని వ్యవసాయ కార్మికుల శాతం మిగిలిన దేశంలో కన్నా తక్కువగా వుంటాయి. మరో వైపు కాశ్మీర్‌లో భద్రతా వాతావరణం దెబ్బ తిందన్నా, ఉగ్రవాదులు చొరబడ్డారన్నా, విదేశీ శక్తుల కుట్రలు జరుగుతున్నాయన్నా 370 ప్రకారం కేంద్రం బాధ్యతే. రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార సంబంధాలు కేంద్రమే చూస్తుంది. 35(ఎ) కు సంబంధించి కూడా ప్రస్తుత ప్రచారం పూర్తి అసత్యం. 370 ఆర్టికల్ ప్రకారమైనా కాశ్మీర్ ప్రత్యేక రాజ్యాంగం దేశ రాజ్యాంగానికి భిన్నంగా వుండే అవకాశమే లేదు. ఇది రాజుకు సంబంధం లేకుండా షేక్ అబ్దుల్లా, సర్దార్ పటేల్‌కు తెలియకుండా నెహ్రూ చేశారనే ప్రచారం సంఘ పరివార్ కట్టు కథే. ఎన్ని తేడాలున్నా నెహ్రూ, పటేల్ కాంగ్రెస్ నాయకులే. హోం మంత్రి అమిత్ షా చేశారు గనక ప్రధాని మోడీకి సంబంధం లేదంటే బిజెపి ఒప్పుకుంటుందా? నెహ్రూపై కత్తి కట్టి, పటేల్‌ను పైకి లేపి గాంధీజీని తమ ప్రచారాలకు వాడుకునే బిజెపి బృహత్ వ్యూహంలో భాగాలే ఇవి.

**కాషాయ ఎజెండానే**

సరైన విధానాలతో కాశ్మీర్ ప్రజలను విశ్వాసం లోకి తీసుకుని ఉత్పత్తి, ఉపాధి పెంచి వుంటే ఆ సుందర సీమ ఇన్ని విధాల సంక్షుభితమయ్యేది కాదు. ప్రైవేటు పెట్టుబడిదారుల రాకకు ఏ ఆటంకం లేకున్నా వారు ప్రతికూల ప్రకృతి వున్న చోటకి రారు. కేంద్ర ప్రభుత్వం, దేశం మొత్తంలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 339 సంస్థలు స్థాపిస్తే...కాశ్మీర్‌లో రూ. 123 కోట్ల పెట్టుబడితో కేవలం మూడంటే మూడు సంస్థలు ఏర్పాటు చేసి అతి తక్కువ ఉద్యోగాలతో నడిపించారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు 18లో రెండు తప్ప అన్నీ లాభాలతో నడుస్తున్నట్టు మొన్ననే కాగ్

## కవిత

# కొన్ని - ఇంకొన్ని

- డా. స్వర్ణలత గొట్టిముక్కల

*మనసు వాకిలి దాటి*
*ఆప్యాయంగా లోనికి వేసే అడుగులు కొన్ని*
*బయటకు నడిచే అసహనపు అడుగులు ఇంకొన్ని*

*బంధాల దారాలను*
*అలవోకగా నేసే చేతులు కొన్ని*
*చేతకాక చిక్కుముడులేస్తూ*
*పుటుక్కున తెంపే చేతులు ఇంకొన్ని*



*వెన్నెలకురిసే మల్లెలను*
*గుండెకు పొదువుకునే మనసులు కొన్ని*
*చేజార్చుకున్నా చింతించని*
*మమత తెలియని మనసులు ఇంకొన్ని*

*అనుభూతిని*
*అశ్రువులో ఒదిగించే కన్నులు కొన్ని*
*ఆర్ద్రతకు ఎడబాటై*
*పొడిబారిన కన్నులు ఇంకొన్ని*

*వెలుగుకై బాటలు పరిచిన*
*జ్ఞాపకాలు కొన్ని*
*అహాలతో చీకటి నింపిన*
*జ్ఞాపకాలు ఇంకొన్ని*

*ప్రతి రేకునా ప్రేమను పూసే*
*పరిమళాల పువ్వులు కొన్ని*
*నిరాశా నిర్లిప్తతలతో నిలచే*
*విరియని పువ్వులు ఇంకొన్ని* ♦

---

నివేదిక వచ్చింది. ఏమైనా అక్కడ టూరిజం, హస్తకళలే ప్రధానం. కాని రాజకీయ కల్లోలాలతో అవీ వెనక్కు పోయాయి. నిరుద్యోగ యువతనే వేర్పాటు వాదులు, ఉగ్రవాదులు లోబర్చుకునే కుట్రలు సాగించారు. మోడీ ప్రభుత్వం కూడా రాళ్ల దాడుల పేర నోట్ల రద్దు, సర్జికల్ స్ట్రయిక్స్, పుల్వామాకు ప్రతీకారం...లాంటి వాటినే ఊదరగొట్టడం తప్ప ప్రజల స్థితిగతులను మెరుగుపర్చింది లేదు. కాశ్మీర్ దేశంలో అంతర్భాగం అని మనం సరిగానే చెప్పాం గాని కాశ్మీరీలలో దేశం అంతర్భాగం కావడానికి చేయవలసింది చేయలేదు. ప్రత్యేక ప్రతిపత్తిని తోసి పారేసి ప్రత్యేక సాయుధ బలాల చట్టంతో నిర్బంధం సాగించి యువతను దూరం చేసుకున్నాం. ఇప్పుడు శాసనసభ లేకుండా చేసి రాష్ట్రాన్ని చీల్చి హోదా తగ్గించి మరింత గాయపర్చడమే. మోడీ సర్కారు ఏపీకి విభజన హామీలు వమ్ము చేసినా కాశ్మీర్‌కు విలీన హామీలను హుళక్కి చేసినా స్వంత రాజకీయం కోసమే. తెలుగు రాష్ట్రాల లోనూ ఇతర చోట్ల కూడా ప్రధాన ప్రాంతీయ పార్టీలన్నీ ఇందుకు వంత పాడటం దారుణం. దేశాన్ని వంద రాష్ట్రాలు చేయాలనే రాజకీయ స్వప్నం బిజెపిది. మూడేళ్లలో జమిలి ఎన్నికల పాట పాడుతున్న బిజెపి రేపు ఇతర రాష్ట్రాల తోనూ ఆడుకోవడం తథ్యం. కాశ్మీర్ వరకూ చూస్తే ఆగస్టు 15 హడావుడి తర్వాత గుజరాత్ తరహాలో పెట్టుబడిదారుల సదస్సులు ఏదో జరిగిపోయిందనే ఆర్భాటంతో కాశ్మీర్‌లో గెలవడానికి ప్రయత్నం చేస్తుంది. ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో పాల్గొంటాయో లేదో చెప్పడం కష్టం. ఇప్పటికైతే నేషనల్ కాన్ఫరెన్స్ నేతలతో సహా పలువురు కేంద్ర చర్యను సుప్రీం కోర్టులో సవాలు చేశారు. వాటిని వెంటనే విచారించడానికి కోర్టు కూడా నిరాకరించడం కొసమెరుపు. ఇదే సమయంలో అయోధ్య కేసు ఆగమేఘాల మీద నడుస్తున్నది. రాముడిని కూడా కక్షిదారుగా పరిగణించి అక్కడ పుడితే ఆయన వంశస్తులున్నారా అంటూ ఆరాలు తీస్తున్నది. తలాక్ బిల్లును ఇప్పటికే ఆమోదించేసుకుని అలాంటి ఇతర శాసనాల కోసం సన్నాహాలు చేస్తుంది మోడీ ప్రభుత్వం. క్షీణిస్తున్న జిడిపి, పేరుకు పోతున్న నిరుద్యోగం, పారిశ్రామిక ప్రతిష్టంభన, బ్యాంకుల దివాళా, వ్యవసాయ సంక్షోభంతో రైతుల ఆత్మహత్యలు ఇలాంటివేవీ బిజెపికి ముఖ్యం కాదు. హిందూత్వ ఎజెండాను వేగంగా అమలు చేసి రానున్న శాసనసభల ఎన్నికలు గెలవడమే దాని లక్ష్యం. ఈ లోతుపాతులు తెలియని వారు, బిజెపి మార్కు పైత్యకారి జాతీయత వంటబట్టించుకున్న వారు ఎంతైనా పూగిపోవచ్చు గాని వాస్తవంలో ఇవి ఆందోళనకర పరిణామాలు. అనర్థ కారకాలు. ♦



# మాటకు మనసును ముడివేసిన కవిత్వం

- డా॥ పెళ్ళూరు సునీల్
9440255647

*మాట మన కులదేవత*
*మాట మన గ్రామ దేవత*
*మాట మన వర్గ దేవత*

– కె. శివారెడ్డి

ఇంట్లో నేనూ నాలో సగమూ మాట్లాడుకోనప్పుడల్లా మా మధ్య శివారెడ్డి ప్రత్యక్షమై పై కవితా పంక్తుల్ని మంత్రాల్లా నాకుపదేశం చేస్తారు. మాట్లాడుకోవాల్సిన అవసరాన్ని నా చెవిలో ఇల్లుకట్టుకుని చెప్తాడు. కొన్ని క్షణాల్ని యుగాలుగా దొర్లించాక అటునుంచో ఇటునుంచో ఒక్కమాట సాగరస్పర్శలా చల్లగా తాకుతుంది. ఒకరికోసం ఒకరు ప్రయాణించాల్సిన తరుణంలో ఇద్దరి మధ్యలో అడ్డుగోడలు కడుతున్నదెవరు? కాదుకాదు కట్టిస్తున్నదెవరు? కుటుంబ విలువలను యాంత్రిక బంధనాలుగా తయారు చేస్తున్నదెవరు? మన విస్తృత ప్రపంచంలోంచి తనను విస్మృతి చేస్తున్నదెవరు? అందరమూ యుద్ధప్రాతిపదికన ఆలోచించాల్సిందే. మనల్ని మనం తవ్వుకుని మనసుల్ని తిరిగి అంటుకట్టుకోవాల్సిందే.

ఇటీవలికాలంలో మనిషి డిజిటల్ బానిసగా మారిపోయాడు. అన్న, పాన, నిద్ర మైథునాలను త్యాగం చేసి స్క్రీన్ మీద వేలితో కెలకడంతోనే సరిపుచ్చుతున్నాడు. కుటుంబంలోని సంబంధాల్ని తనకు తానే తగ్గించుకుంటున్నాడు. భార్యా భర్తల ఆత్మీయ అనురాగాలన్నీ డిజిటల్ చట్రంలో ఇరుకున్నాయి. ఈ విషయం గురించి స్పందించిన ఇటీవలి కవిత్వాన్ని ఈ వ్యాసంలో కాస్తంత తరచిచూద్దాం. సమకాలీన సమాజంలో కుటుంబ పరిరక్షణకు కలమెత్తిన కవుల్ని కౌగలించుకుందాం.

చిన్న చిన్న అంశాలుగా విడగొడ్తూ విశ్లేషించడం ఈనాటి విధానం. ఇదే పద్ధతి మనుషులకూ ఆపాదించబడింది. అతికించడానికి వీలులేని ముక్కలుగా మనుషులు మారిపోవడమే అత్యాధునిక విషాదం. మనల్ని, మన సంబంధాల్నీ తిరిగి నిర్మించుకోవడానికి మనలో పేరుకున్న అభిజాత్యాలను కూలగొట్టడమే పరిష్కారమంటున్నారు వర్ఘుల శివకుమార్. అహాన్ని ధ్వంసం చేసి మాటై నిలవడానికి, నాలుగు మాటల పూలను వికసింపజేయడానికీ 'కూలగొట్టాల్సిందే' అంటున్నారు. –

*కూలగొట్టాల్సిందే*
*బాహ్యంగానే కాదు ఆంతర్యంలోనూ*
*ముక్కలౌతున్న మనిషిని పునర్నిర్మించుకుంటూ*
*మాటై నిలువడానికి కూలగొట్టాల్సిందే*
*స్వార్థాన్నో స్వప్రయోజనాన్నో*
*అహాన్నో అభిజాత్యాన్నో వేటినైతేనేం*
*పాతుకు పోయిన పాతవాసనలన్నిటినీ*
*నిస్సంకోచంగా ధ్వంసం చెయ్యాల్సిందే*

**– వఝుల శివకుమార్** (కవిత – కూలగొట్టాల్సిందే)

మనిషికి బిజీ పర్యాయపదంలా మారిపోయాక ఇంట్లో వాతావరణం అస్తవ్యస్తం అయిపోతోంది. ఎవరిలోకంలో వాళ్ళు రెక్కలుకట్టుకుని ఎగురుతుంటే సుపరిచితత్వంలో అపరిచితత్వం పిల్లిమొగ్గలు వేస్తోంది. గడచిన ఈ రోజును మూల్యాంకనం చేసుకుని రేపటి గురించి కలలు కనాల్సిన భార్యాభర్తల మధ్య శత్రుదేశాలంత మౌనం ఎందుకొచ్చిందో అనిల్ డ్యాని చెప్పేశాడు. రెండు గుండెలు ఒకే లయతో స్పందించాల్సిన సమయంలో ఏర్పడిన మౌనానికి సాంకేతికతను కారణంగా చూపుతున్నాడు. ఇది మనందరికీ అనుభవంలోని విషయమే. జీవితానుభవాలను కవిత్వం చేయడం డ్యాని ప్రతిభకు నిదర్శనం–

*ఒకే మంచంపై*
*రెండు ఏకాంతాల గుండెచప్పుళ్ళు*
*రెండు మనసుల మధ్యన*
*శత్రు దేశాలంత మౌనం*
*సాంకేతికత చేసిన*
*దగ్గరపాటి దూరం*
*దూరమైనంత దగ్గర*

**– అనిల్ డ్యాని** (కవిత – ఈ మౌనం మంచి కాదు)

సరే అలాగే అనుకుందాం. మాటలు తగ్గిపోవడం వల్లే మానవ సంబంధాలు దెబ్బ తింటున్నాయన్నది మనకు కష్టమైనా కాసేపు ఒప్పుకుందాం. ఎలాంటి మాటలు ఉండాలన్నది కూడా పెద్ద సమస్యే. మాట్లాడితే గొడవలు, గతాన్ని తవ్వుకోవడాలు, ఆర్థిక వ్యవహారాలు, పట్టింపులు మీదకొస్తుంటే ఎలా మాట్లాడాలి? ఏమి మాట్లాడాలి? అన్నదేకదా మన సందేహం. ఈ సందేహాన్ని తీర్చడానికి పల్లిపట్టు నాగరాజు కవితై మనముందు నిలుస్తున్నాడు. చేరెడు ధైర్యాన్ని నింపే మాట ఒకటుంటే చాలునని మనకు మాటలు నేర్పుతున్నాడు.

*పలకరింపులన్నీ*
*పరికరాల బొందల్లో బందీలైన*
*యాంత్రిక భాష ఏమంత రుచిగాలేదు...*
*అంతరంగపు కడవలో*
*అనుభూతులు చిలకని కరెన్సీకూతలు*
*అక్కరకు రాని మాటలేవీ లెక్కకు మించి అక్కర్లేదు...!*
*బాంధవ్యాల*
*అనురాగం పరిమళించేలా...*
*దిగులు దోసిళ్ళలో చేరెడు ధైర్యాన్నినింపి*
*మాట్లాడే మనసు కావాలి...*

**– పల్లిపట్టు నాగరాజు** (కవిత – మాట్లాడే మనిషి)

ఇంట్లోనే కాదు బయట వారితోనైనా సరే ఎలా మాట్లాడితే వారు మన హితులుగా, సన్నిహితులుగా మారుతారో సుంకర గోపాలయ్య కూడా ఒక కవితలో తెలియజేశాడు. మాట పిలకలు పెట్టుకుని సంతోషం గిట్టుబాటుకావడమే మాటయొక్క పరమ ప్రయోజనం. మాటల్లో ఏయో వస్తువుల సారం ఉండాలో ఏకరువుపెట్టాడు కవి. హృదయాన్ని చేప పిల్లై ఎగరడానికి మాటను సాధనంగా మలిచిన కవిత్వాన్ని మెచ్చుకోవాల్సిందే –

*మాట్లాడుతున్నంత సేపు*
*వట్టివేర్ల సుగంధం వ్యాపించాలి*
*మాటల్లో దవనం, మరువం గుభాళింపు*
*పున్నాగ పరిమళం కావాలి*
*మాటతో మనసు నిండిపోవాలి*
*మాటల ప్రవాహంలో*
*హృదయం చేపపిల్లై ఎగరాలి*

**– సుంకర గోపాలయ్య** (కవిత – మిణుగురు మాటలు)

మనసు విరిగెనేని మరి చేర్చరాదయా అంటాడు వేమన. మన అద్దాల మనసులకు ఎప్పటికప్పుడు టెంపర్ గ్లాస్ తొడుగులు వేసి కాపాడుకోవాలి. కాదని ఒక్కసారి గూడు చెదిరితే మళ్ళీ దాన్ని నిర్మించుకోవడానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. మనం మరింతగా ప్రేమను కోరుకుంటే అంతే మొత్తంలో ప్రేమను ఇవ్వాల్సి ఉంటుంది. కుటుంబం మనదే కదా మన అదుపు ఆజ్ఞల్లోనే ఉంటుందని భార్యా భర్తల్లో ఎవరు అనుకున్నా కల కరిగి నీరైపోతుంది. మనసును మనసుతో అంటుకట్టుకుంటే కుటుంబం కొత్త చిగురులతో అలరారుతుంది. అలా కాకుంటే ఏమవుతుందో మోహన్ రుషి అన్యాపదేశంగా మనకు ఎరుక కలిగిస్తున్నాడు. హృదయాన్ని హృదయంవైపుకు జరపమంటున్నాడు.

*అంటుకడితే ఆనందమయ్యేది*
*అల్లుకుంటే పరిమళమయ్యేది*
*నింపుకుంటే గుండెల నిండా ఒదిగిపోయేది*

*కాదనుకున్నందుకే*
*కల నిజం కాకుండా పోయ్యింది*
*గుండె చప్పుడు వినగలిగితే, గుర్తులు పదిలంగా*
*భద్ర పర్చగలిగితే, మబ్బులోని నీళ్ళ మాయను*
*చూడగలిగితే, హృదయాన్ని హృదయం వైపుకు*
*ఇంకొంచెం జరపగలిగితే*
*తప్పకుండా మరింత ప్రేమ దొరికి వుండేది*

**– మోహన్ రుషి** (కవిత – తిరిగిరాదు)

దూరమవడం ప్రేమలో భరింపరాని సందర్భం. ఉన్నపుడు వాళ్ళ విలువను తెలుసుకోలేక పోవడం మన నేరమే. మన నుంచి భౌతికంగానో, మానసికంగానో మనిషి దూరమైపోయాక నువ్వెన్ని మాట్లాడినా ప్రయోజనం ఉండదు. ముందుగానే మాటతో మనసును ముడివేసుకోవాలి. శ్రీకాంత్ కూడా ఇలాంటి వస్తువుతోనే కవితరాశాడు. తన హృదయానికీ స్పందనలున్నాయనీ రాళ్ళకుసైతం నవ్వులు, గాయాలు, ఏడ్పులు ఉంటాయనీ కవితద్వారా సాక్ష్యం ఇచ్చాడు. ఇక్కడ రాయేమిటో? గాయమేమిటో కవిత చదివితే తప్ప మనం అందుకోలేం. –

*మరి గుర్తుందా*
*అడిగావు నువ్వు నన్ను సరిగ్గా ఇలాగే ఒకప్పుడు*
*మబ్బులు పట్టి, పగలు*
*ఒక నైరాశ్యపు వెలుతురుతో భారంగా,*
*అతి నెమ్మదిగా కదులుతున్నప్పుడు 'రాళ్ళు'!*
*'రాళ్ళు మాట్లాడతాయా!?' ని –*
*ఇదిగో, ఇప్పుడు చెబుతున్నాను విను*
*రాళ్ళకూ హృదయాలుంటాయి. అవి మాట్లాడతాయి*
*నవ్వుతాయి, గాయపడతాయి, ఏడుస్తాయి*
*మరి ఇక అందుకు సాక్ష్యం?*
*ఇదిగో అదే ఈ చిన్న పాయెం!*

**– శ్రీకాంత్. కె** (కవిత – దెజావు)

అందరూ మాటలు లేకపోవడం గురించి, మట్లాడలేకపోవడం గురించీ బాధపడుతుంటే అఫ్సర్ మాత్రం మాటను ఆపాల్సిరావడం గురించి కలతపడుతున్నాడు. అఫ్సర్ విలక్షణ కవి. తన కవిత్వంతో పాఠకుడ్ని సమ్మోహించే శక్తిని అక్షరాల్లో నిక్షిప్తం చేసినవాడు. కుటుంబ సభ్యులైనా, స్నేహితులైనా, బంధువులైనా మాటలు ముగించి ఎప్పటికైనా వెళ్ళిపోవాల్సిందే కదా! మాటలకు విరామం ఇవ్వాల్సిందే కదా! ఈ విరామం తాత్కాలికమే కావచ్చు గానీ ఆ మాటల్ని మళ్ళీ తోడుకుంటూ ఉండటమే మనిషి చేయాల్సింది. ఎవరిలోకం వారిదనడం పాతపాట ఎవరి కలుగు వారిదనడం సరికొత్తమాట. నిజమే... మనం జ్ఞానం పెంచుకుని విశ్వ వ్యాప్తం అవుతున్నామని అనుకుంటున్నామేగాని మనల్ని మనం కలుగులోని కప్పగా మార్చుకుంటున్నామన్న సంగతి గ్రహించలేకపోతున్నాం. ప్రపంచమంతా తిరిగిన వాడు ప్రక్కమనిషి మనస్సు అర్థంచేసుకోలేక పోవడం ఎంత విచిత్రం. ఈ విషయాన్ని నొక్కిచెప్తున్నాడు అఫ్సర్–

*ఎవరి కలుగులోకి వాళ్ళం కనుమరుగయ్యాక*
*యిక వొకరినొకరు వినలేక*
*ప్రతిమాటనీ మళ్ళీ తోడుకొని*
*ప్రతిశ్వాసనీ మళ్ళీ బతకాలన్న వాంఛ*
*అసలీ*
*మాట పుట్టినందుకు సంతోషించనా?*
*తప్పనిసరై అది ఎక్కడో వొక చోట*
*ఆగిపోతున్నందుకు బాధపడనా?*

**– అఫ్సర్** (కవిత – వుండనా, మరి?)

మనకెన్నో పనులు. ఇంట్లోపని, బయట పని, ఇంటా బయటా పని, బడులు, గుడులు, ఆఫీసులు, ఆందోళనలు, సినిమాలు, సీరియళ్ళు, ఫేస్‌బుక్‌లు, వాట్సప్‌లు... ఇలా అనేక పనుల్ని మెడకు తగిలించుకుని స్వచ్ఛందంగా ఖైదీలయ్యాం. రాత్రంతా పుస్తకాలు, కవితలు, కథలు, వ్యాసాలు – ఇంకెక్కడి మాటలు చెప్పండి. కుటుంబంతో, సమాజంతో పునరంకితం కాకుంటే మన రాతలు, గీతలు ఎందుకోసమో గమనించాలి. ఇందుకు నేనూ మినహాయింపు కాదు. అయినా నాకు తెలియకడుగుతాను ఇద్దరి మధ్య మాటలంత అవసరమా?...

♦♦♦

*మనసుల్లేని వాళ్ళ మధ్య మాటలుండవు*
*మాటల్లేని వేళ మనుషులూ వుండరు*
*మాట*
*రెండు హృదయాల మేళవింపు*

**– పలమనేరు బాలాజీ**

♦

## విశ్లేషణ

# సాంఘిక దురాచార చిత్రణ 'ముద్ర'






డా॥ వి. ఆర్. రాసాని

- పొదిలి నాగరాజు
7989320752

ఎంతోమంది స్త్రీల జీవితాలను ఛిద్రం చేసిన బసివిని దురాచారాన్ని చిత్రిస్తూ వి.ఆర్. రాసాని 'ముద్ర' (2006) నవలను రచించాడు. దక్షిణ భారతదేశం చుట్టూరా మనకు బసివినులు కనిపిస్తారు. కేరళలో మహరి, అస్సాంలో నాటి, మహారాష్ట్రలో మురళి, తమిళనాడులో తెవర్‌డియార్, కర్నాటకలో బసివిని, ఆంధ్రాలోని రాయలసీమలో మాతంగులు, తెలంగాణాలో జోగినులు అని వీరిని అనేక రకాలుగా పిలుస్తారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే వీరు 4500 మంది వుండేవారని సర్వేలు చెబుతున్నాయి. ఎంతోమంది అమాయకులైన ఆడపిల్లలను నడుస్తున్న శవాలుగా మార్చిన సాంఘిక దురాచారమిది. ఎక్కువగా నిమ్నకులాలకు చెందిన అందమైన అమ్మాయిలనే ఈ దురాచారంలోకి బలవంతంగా దింపేవారని 'ముద్ర' నవల తెలియజేస్తుంది. ఇది వాస్తవం. ఊరిలోని కొంతమంది పెద్దమనుషులు తన కంటికి ఇంపుగా కనిపించిన అట్టడుగు వర్గాల కన్నెపిల్లలను ఈ దురాచారానికి పురిగొల్పి మితిమీరిన తమ కామవాంఛకు బలితీసుకునేవారు. ఊరికో, కుటుంబానికో ఏదో అరిష్టం జరుగుతుందనే మూఢ నమ్మకంతో బసివిని కుటుంబం నుంచో, అట్టడుగు కులాలలోని అందమైన అమ్మాయినో, పెద్దలు కన్నేసిన పిల్లనో బసివినిగా మార్చేస్తారు. రాయలసీమలో ముద్రవేయించే ఈ దురాచారం జరిపించటానికి ఒక కులపెద్ద వుంటాడు. బసివినీల ఆధ్వర్యంలోనే ఈ తంతంతా కొనసాగుతుంది. పల్లెంతా సంతోషంలో వుండగా బసివినిగా చేసే అమ్మాయితో వీధి గంగమ్మకు పూజలు చేయిస్తారు. అక్కడే తెరమరుగులో ఆ అమ్మాయికి స్నానం చేయించి, కన్నెరికం చేసే వ్యక్తి పంపిన చీరను కట్టి అలంకరిస్తారు. తలకు బాసికం కడతారు. వీధి గంగమ్మకు, సత్తెమ్మకు దండం పెట్టించి ఐతమ్మ గుడికి తీసుకెళ్తారు. ఐతమ్మ గుర్తు కలిగిన అచ్చును నిప్పుల్లో కాలుస్తారు. బసివిని అవుతున్న అమ్మాయి ఐతమ్మ గుడిచుట్టూ మూడుసార్లు తిరిగి పూజారి దగ్గర కూర్చుంటుంది. పూజారి ఆమెకు నొసటన బండారు బొట్టు పెడతాడు. అమ్మాయి తల్లితండ్రులను పిలిపించి, వారి చేతుల్లో ఆకు, వక్క పెట్టి 'ముద్దరేసేదానికి శెలవా' అని అడుగుతాడు. 'సామి శెలవ' అని వాళ్ళు చెప్పగానే గ్రామస్తులందరిచేత అలాగే పలికించి గౌడ బసివినితో మెడలో పసుపుదారం కట్టిస్తాడు. తర్వాత నిప్పుల్లో కాల్చిన ఐతమ్మ ముద్దరను భుజంపై వేయిస్తాడు. వేపమండలను దండలుగా కుట్టి బసివినయ్యే అమ్మాయి నడుముకు, మెడకు అలంకరిస్తాడు. కల్లు తాగిస్తాడు. మిగిలిన బసివిరాద్రంతా కల్లు బాగా తాగి గుండం చుట్టూ చేరి చిందులేస్తారు. తరాల నుంచి కన్నెరికం చేసే పెద్దమనిషిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి కన్నెపిల్లతో కలిపి బసివిని గుడెసెలోకి పంపిస్తారు. ఆ రాత్రికి

అమ్మాయికి కన్నెరికం చేస్తాడా పెద్దమనిషి. తెల్లవారి ఊరి జనమంతా ఎంగిలి విస్తరికోసం ఎగబడే కుక్కల్లా ఒకరి తర్వాత ఒకరు ఆమెను అనుభవిస్తారు. ఈ బసివిని ఆచారాన్ని రాయలసీమలో ముద్ర వేయించుకోవటం, కన్నెరికం చేయటం అంటారు. బసివిని అయిన స్త్రీలు వారానికి రెండు రోజులు ఉపవాసం ఉండాలి. గ్రామంలో ఎవరి చనిపోయినా కేవలం కల్లు తాగుతూ శవం ఇంటి వద్దనుంచి స్మశానం వరకు చిందులేస్తూ వెళ్లాలి. మార్గమధ్యంలో జనాలు విసిరే చిల్లర డబ్బులను నుదురుతోను, కనురెప్పలతోనూ అందుకొని తీసుకోవాలి. కల్లుసీసాను నోటితో లేపాలి. ఎవరు ఎలా చేయమంటే అలా చేయాలి. ఎవరైనా సరే తన శరీరాన్ని ఎక్కడ తాకినా కిక్కురుమనకుండా ఉండాలి. ఆమె చనిపోతే తన కుటుంబంలో ఎవరినో ఒకరిని బసివినిగా చేయాలి. పండుగ, జాతర సమయాలలో నాట్యం చేయాలి. ఒక్కొక్కసారి పోషించేవారు లేనప్పుడు పొట్టకూటికోసం ఇంటింటికి వెళ్ళి బిక్షమెత్తుకోవాలి. తనకు పుట్టిన పిల్లలకు తండ్రి ఉండడు. సభ్యసమాజంలో గౌరవం ఉండదు. చివరికి సుఖవ్యాధులకు లోనై దుర్భరమైన స్థితిలో అనాథగా చనిపోతుంది. ఇంతటి ఆధునిక సమాజంలో సైతం ఇటువంటి వ్యవస్థ తన ఉనికిని కొనసాగిస్తుదంటే విన్నవారి శరీరాలు, మనస్సులు గగుర్పాటు గలుగుతాయి అనటంలో ఎటువంటి సందేహము వుండదు. బసివినులుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న అట్టడుగు అమాయకపు స్త్రీలను మేలుకొలపాలనే తలంపుతోనే రచయిత రాసాని 'ముద్ర' నవలను రచించాడు. ఇలాంటి రచనలు సామాజిక బాధ్యతకు ప్రతీకలుగా నిలుస్తాయి.

ఊరి చివరన దళితవాడలో వున్న బసివిని గుడిసె ఓబులవ్వది. ఊళ్ళో మాతమ్మ ఆచారానికి ఎంతోమంది దళిత ఆడపిల్లలు బలైంది అక్కడే. దళిత యువతైన ఓబులవ్వ కూడా ఒకప్పుడు బసివినిగా ముద్ర వేయించుకుని చివరికి అనాథగా మారిందీ అక్కడే. ఒకరోజు హసీనా అర్థరాత్రి ఆ గుడిసెకు వచ్చి ఓబులవ్వకు వంద రూపాయలు నోటిచ్చి నాలుగు రోజులు అక్కడే వుంటానని చెబుతుంది. కథాసారాంశమంతా ఈ ఇద్దరిమధ్యే కొనసాగుతుంది. కోటమ్మే హసీనాగా వచ్చిందనేది నవల చివరికి తెలుస్తుంది. వంకమద్దోళ్ళ పల్లె దళితవాడలో గుండెకాయలోని కూతురు కోటమ్మ. అందగత్తె. కోటమ్మ తనకు లొంగలేదని ముసలయ్య, పూజారి శాస్త్రితో కలిసి కుట్రపన్ని ఆమెను బసివినిగా చేస్తారు. ముసలయ్య వల్ల కోటమ్మకు కూతురు పుడుతుంది. ముసలయ్య తన అవసరం కోసం ఊళ్ళోకి వచ్చిన అధికారులకు కోటమ్మను తార్చబోతాడు. ఒప్పుకోలేదని హత్య చేయించబోతాడు. కోటమ్మ బిడ్డను తల్లితండ్రుల వద్ద వదిలేసి పొలం పనుల్లో పరిచయమైన మణియంతో వెళ్ళిపోతుంది. అక్కడ కన్నమ్మగా పేరు మార్చుకుని మణియంకు కొంతకాలం భార్యగా ఉంటుంది. మణియం పెద్దభార్య అలివేలుతో పేచీ వచ్చి కులవివక్షతో అవమానింపబడి పల్లె నుంచి అనాథగా తరిమివేయబడుతుంది. మణియం నిరాదరణకు గురైన కన్నమ్మ ఐస్‌క్రీంలు అమ్ముకునే సలీం మాయ మాటలకు లొంగిపోయి అతని ఇంటికి వెళ్తుంది. సలీం కన్నమ్మకు హసీనాగా పేరుమార్చి ఉర్దూ నేర్పిస్తాడు. కువైట్‌కు పంపిస్తానని చెప్పి ముంబైలోని వైశ్యావాటికకు అమ్మేస్తాడు. కొన్ని సంవత్సరాల తరువాత అదే వేశ్యావాటికకు మోసంచేసి తీసుకొచ్చిన 'విజయ' అనే తెలుగమ్మాయిని చేరదీసి రౌడీషీటర్ సహకారంతో తనతోపాటు ఆ అమ్మాయిని తప్పిస్తుంది. ఈ కథనంతా కన్నీళ్ళతో ఓబులవ్వకు చెబుతుంది కోటమ్మ హసీనాగా మారి.

ఎప్పుడో వదిలెళ్ళిన కూతురికోసం సొంతూరికే వస్తుంది కోటమ్మ. అప్పటికే తన కూతురు అరుణను బసివినిగా చేయాలని ఊరు నిర్ణయిస్తుంది. రంగంలోకి దిగిన కోటమ్మ ఊర్లో నిశ్శబ్ద విప్లవాన్ని తీసుకొస్తుంది. తన కూతురు ప్రేమించిన కుమార్‌తోనే అరుణకు పెళ్ళి చేస్తుంది. మైలపడిన తన జీవితం తన కూతురికి అంటరాదని రాత్రికి రాత్రే ఊరొదిలి చీకట్లోకి వెళ్ళిపోతుంది. తెల్లవారగానే ఓబులవ్వ శవంగా మారిపోతుంది. హసీనా (కోటమ్మ) ఇచ్చిన వంద రూపాయల నోటు ఓబులవ్వ చేతిలోనే వుంటుంది. ఇదీ నవలా సారాంశం.

నవలా కాలానికి రాయలసీమలోని చిత్తూరు ప్రాంతంలో ముద్ర వేయించుకొన్న బసివినులు వున్నట్లు నవలే చెబుతుంది. రాసాని 'ముద్ర'ను రాయటానికి ఎంతో కఠోర పరిశోధన చేశారని నవల ముందు మాటలవల్ల తెలిసిపోతుంది. "వి.ఆర్. రాసాని బసివినులుగా మార్చబడిన ఎందరో స్త్రీల జీవితాలను స్వయంగా పరిశీలించి ఈ నవలను రాసారు. ఆయన నివసిస్తున్న తిరుపతిలోనూ, దాని చుట్టూ వున్న పలు ప్రాంతాల్లోనూ ఈనాటికీ బసివినిలుగా ముద్రపడిన స్త్రీలెందరో ఉన్నారని వారితో మాట్లాడి, వారి జీవితాలను క్షుణ్ణంగా

పరిశీలించాకే తనీ నవలను రచించానని వి.ఆర్. రాసాని నాకు చెప్పారు" అంటూ అంపశయ్య నవీన్ నవల గురించి ప్రస్తావిస్తూ చెప్పిన మాటలివి. ఒకవంక మద్దోళ్ళ పల్లెలోనే ఓబులవ్వ, బుడ్డమ్మ, కోటమ్మ, లక్ష్మి, బాలయ్య చెల్లెలు, సిద్దప్ప కూతురు అనే ఇంతమంది బసివినులను రచయిత చెప్పాల్సివచ్చిందంటే రాయలసీమంతటా ఎంతమంది బసివినులు ఉండేవారో పాఠకులే ఊహించుకోవచ్చు.

నవలలో ముద్ర వేయించుకున్న వారంతా నిమ్న కులానికి చెందిన స్త్రీలు. ఆ ఊళ్ళో బసివిని గుడిసె ఒకటి ఉంది. దాని పునాదులు ఏ కాలం నాటివో కానీ కొత్త బసివిని వస్తుందంటే చాలు అప్పుడే అది అందంగా సింగారించుకుంటుంది. అమాయక ఆడపిల్లలకు కన్నెరికం చేయటమంటే దానికి బలే సరదా. ఓబులవ్వ తన గుడిసెలోకి వచ్చిన హసీనాతో "ఈ ఊర్లో ఎన్నో తరాల నుంచి ఆడబిడ్డల్ని మాతమ్మలుగా మార్చే ఆశారం వొగటుండాది. ఆ చింతలతోపు కవతల ఐతమ్మ దేవతుండాది కదా! ఆయమ్మ పేరుతో అప్పుడప్పుడూ కన్నె పిల్లను ముద్దరేసి వదిలేస్తారు. అట్టా వదిలేసిన ఆడిబిడ్డకు ఈ గుడిసెలోనే ఈ వూరి సర్పంచి కన్నెరికం చేస్తాడు" అంటూ తానున్న బసివిని గుడిసె గురించి పరిచయం చేస్తుంది. బసివిని గుడిసె మొదలైనప్పటి నుంచి కోటమ్మ వరకూ ఎంతోమంది స్త్రీల జీవితాలు ఆ గుడిసెలోనే మౌనరోదనల మధ్యే ముగిసిపోయాయి. ఈ దురాచారం ఒక అనాగరికతకు తార్కాణం. "అమ్మోరి మొక్కు తీర్చుకుంటే కలరా వచ్చినా రావచ్చు. పెద్దమ్మోరన్నా రావచ్చు. దూము తగిల్నా తగలవచ్చు. ఊరు ఊరే ఊడ్చుకపోవచ్చు" అనే మూఢ నమ్మకాలతో అట్టడుగు వర్గాల స్త్రీలను భయపెట్టి బలవంతంగా ఈ దురాచారాన్ని సృష్టించారు.

ఊరు మంచికోసం, ఊరు బాగుకోసం ఊళ్ళోని స్త్రీలను బసివినులుగా మార్చటం వదిలేసి కూటికీ, గుడ్డకీ, నీటికీ, కూలికీ నిత్యం దేవురించే వారినీ, ఊరి చివరన బతుకుతూ అంటుకుంటే మలినమయ్యే అంటరాని వారినీ, ఊరికి ఏమాత్రం సంబంధం లేనివారినీ వెతికి వెతికి గుర్తించి ఊరి బాగుకోసమనీ, ఊరి మేలుకోసమనీ బసివినులుగా చేయటం ఎంత అన్యాయం? అన్ని విషయాలలో దళితులంటే అంటు. ఆ ఒక్క విషయం (శృంగారం)లో మాత్రం ఊరి పెద్ద మనుషులకు స్త్రీలపట్ల అంటు వుండదు. "నాకు అంటూ సొంటూ ఏమీ లేదు. అందునా కోరిక తీర్చుకుండేదానికి కులమేముండాది, మతమేముండాది" ఇవి ఊరి సర్పంచులుగా వుండే ముసలయ్య లాంటి వారి శ్రీరంగనీతులు.

వంకమద్దోళ్ళ పల్లెలో ఓబులవ్వ, బుడ్డమ్మ, కోటమ్మ అనే బసివినులు నవలలో ప్రధాన పాత్రలు. నవలా కాలానికి ఓబులవ్వ ముసలిదైన బసివిని. కన్నెపిల్లగా ముద్ర వేయించుకున్నప్పటి నుంచి ముసలితనం వచ్చేంత వరకు బసివిని జీవితం ఎంత దుర్భరంగా, నీచంగా ఉంటుందో ఓబులవ్వ పాత్ర ద్వారా రచయిత కళ్ళకు కట్టినట్టు వివరించాడు. "ఇప్పుడు సర్పంచ్‌గా ఉండే శంకరయ్య తాత నాకు కన్నెరికం ఈ గుడిసెలోనే జేశ. మాతమ్మలకు తొలి కన్నెరికం జేసే ఆచారం వాళ్ళ వంశానికొస్తా వుండే. ఆయప్ప నాకు కొన్ని దినాలు కూడూ గుడ్డాయేశ. ఆ తర్వాత వదిలేశ ..... నాలో వయసున్న దినాలు ఏదో గడుస్తా వుండే. వయసు పెరిగేగుందికీ, నాకు బతకడం కష్టమైపాయె.

వయసులో నా పొందుతో ఆనందించిన ముండా కొడుకులూ నన్ను చూస్తానే తప్పుకొని తిరగబట్రి. దాంతో కన్నవాళ్ళను, కన్నఊరిని వదిలేసి ఎక్కడెక్కడో తిరిగితి. కొన్ని దినాలు పట్నంలో సాయిత్రమ్మ కంపెనీలో వుంటి. ఆ ముండ నన్ను వచ్చినోళ్ళందరికీ కొల్లగ్గవగా పడుకోబెట్టి నా వంటితో యాపారం జేసి సొమ్ము చేసుకుంటా వుండె. నాకు మాత్రం అన్ని గంజినీళ్ళు పోస్తా వచ్చె. రాను రాను నాకు వయసు మీదపడె. నా దెగ్గరికి ఏ మొగోడూ రాకపాయె........ ముసలితనం వచ్చేశ. పనులు జేసే శక్తిలేక పస్తులుంటావస్తి. ఇంక యిట్లకాదని ఇల్లిల్లు తిరిగి అడుక్కుతింటా వస్తి. అది సాలక నేను బతికిన బతుక్కి రోగాలు వచ్చె.

ఇంక సచ్చేముందు కనీసం పుట్టినూర్లోనే చద్దామని ఈ ఊరికొస్తి.... అట్ల ముప్పయ్యేండ్ల తర్వాత వచ్చిన నన్ను అక్కున చేర్చుకోవాల్సిన వాళ్ళే పురుగును చూసినట్లు చూసి, కన్నెగా వున్నప్పుడు బసివిని చేసేదానికి తెగ ఆరాటపడిపోయిన ఈ జనాలే వయసుడిగినాక యిండ్లల్లోకి కూడా రానియ్యలా" అని ఓబులవ్వ జరిగిపోయిన తన బసివిని బతుకును గురించి చెబుతుంది. ప్రతి బసివినీ అనుభవించే వాస్తవిక జీవితం ఇదే. ఇన్ని కష్టాలు అనుభవించిన ఓబులవ్వ తన కళ్ళముందే కన్నెపిల్లలను బసివినులుగా మారుస్తున్న సామాజిక వ్యవస్థను అడ్డుకునే ప్రయత్నమేమీ చేయదు. తనను ఇంతగా హింసించిన వ్యవస్థపైగానీ, మనుషులపైన గానీ ఎటువంటి ప్రతీకార భావజాలం లేకపోగా తిరిగి తిరిగి అదే ఊరికి వచ్చి

తన జీవిత వినాశనానికి గోతులు తీసిన ఆ జనంపైనే ఆశలు పెట్టుకుంటుంది. అయితే నవల చివరిలో మాత్రం బసివిని సాంప్రదాయాన్ని చేస్తున్న, చేయించుకుంటున్న, చూస్తున్న వారందరిపైన అసహ్యాన్ని ప్రకటిస్తుంది. "ముండనాబట్టల్లారా! ఎప్పుడు మారతార్రా మీరు" అని మగవాళ్ళను, "ముండనా సవతుల్లారా! మీకన్నా తెలీదంటేనే.... ఈ అన్యాయం యితర కులాలలో యాడన్నా కద్దా! వొగటన్నా యిదేమిటని అడిగినాయా? తుఁ.... తుఁ..... ముండజనం ..... బుద్ధిలేని జనం" అంటూ ఆడవాళ్ళనూ తిడుతుంది. ఓబులవ్వ బసివిని దురాచారాన్ని అసహ్యించుకుందే కానీ అణచివేయటానికి ఏ ప్రయత్నమూ చేయలేకపోతుంది. దీనికి ప్రధాన కారణం తాను చిన్నతనం నుంచి ముసలితనం వరకూ మార్పులేని సమాజాన్ని చూడటమే.

బసివిని జీవితాన్ని పూర్తిగా అనుభవించిన పాత్ర ఓబులవ్వదైతే బసివిని దురాచారాన్ని సమూలంగా భూస్థాపితం చేసిన పాత్ర కోటమ్మది. వంకమద్దోళ్ళ పల్లెలో మాదిగ గుండెకాయలోని కూతురు కోటమ్మ. తండ్రి తాగుబోతు. తల్లి కూలికెళ్తుంది. చెల్లెలు, తమ్ముడు చిన్నపిల్లలు. దళితవాడకే అందగత్తె కోటమ్మ. ఊసలు కోసుకొచ్చి వాటిని పొరకలుగా తయారుచేసి పలెల్లకెళ్ళి అమ్ముకొస్తుంది. పుట్టుకకు దళిత యువతే కానీ పౌరుషానికి రాచబిడ్డే. గ్రామ సర్పంచైన ముసలయ్య దళిత పిల్లేకదా, ఏమిచేసినా కిక్కురుమనకుండా వుంటుందిలే అనుకొని బలాత్కారం చేయబోతే "ముండనాబట్ట సెప్తావుంటే యింగితం లేదఁరా నీకు. కులమనేది పేర్లో, పుటకలో గాదురా, గుణంలో వుండాల'' అంటూ ముసలయ్యలాంటి పెద్దమనుషులు తెరచాటు చేస్తున్న ఇంగితంలేని పనుల గురించి గట్టిగా హెచ్చరిస్తుంది. అదేవ్యక్తి మరొకరోజు కోటమ్మతో అసభ్యంగా మాట్లాడటంతో "నాజోలికి వస్తే పొరక ఇరిగి పోవును. ముండనా బట్ట" అంటూ దళితులను హీనంగా చూసే వారికి చెంపదెబ్బలా మాట్లాడుతుంది. ఈ ధోరణే కోటమ్మను బసివినిగా మార్చడానికి కారణమవుతుంది.

కోటమ్మ బసివిని అయినప్పటికీ ఊర్లో ఎవ్వరినీ తన వద్దకు రానీయకుండా కట్టడిచేసి కేవలం ముసలయ్యకే భార్యగా వుంటుంది. బిడ్డను కూడా కని "బసివిది బిడ్డల్ని కంటుందా ఎక్కడన్నా?'' అనే వారందరి నోళ్ళను మూయిస్తుంది. నమ్ముకున్న ముసలయ్య తనను ఆఫీసర్లకు తార్చినప్పుడు కోపంతో ఊగిపోయి "వొరే బాడ్‌కోవ్ నా కొడుకుల్లారా నన్ను నమ్మించి ఈడికి రప్పించుకొని ఈ మాదిరి ప్రవర్తిస్తారా? ముండ నా కొడుకుల్లారా! మీరేం ఆఫీసర్లురా! తాగి ఆడదాని సుఖంకోసరం కుక్కల మాదిరి వెంపర్లాడతా వుండారు" అని ఆఫీసర్లవంటి పురుష సమాజాన్ని ఛీదరించుకుంటుంది. నమ్మిన మగవాడే తనను ఇంకొకరికి తార్చడం జీర్ణించుకోలేక ముసలయ్య, ఆఫీసర్లపై వ్యతిరేకతను ప్రదర్శిస్తుంది. ఈ తీరే ముసలయ్య ఆమెను చంపించటానికి కారణం అవుతుంది. ముసలయ్యను, ఆఫీసర్లనేకాదు తన పొందుకోసం ఆరాటపడుతూ వచ్చిన అగ్రవర్ణ పూజారి శాస్త్రిని కూడా "రేయ్ పిలక నా కొడకా! సిగ్గులేదంట్రా నీకు! చేసేది పూజలు. దూరేది బసివిని దాని గుడిసెలో. మళ్ళా మడి, అంటు తుఁ...... ముండా కొడకా!'' అంటూ తిట్టిపోస్తుంది. తనను తప్పుడుగా చూడటానికి కారణమైన బసివిని దురాచారాన్ని ఏవగించుకొంటుంది. ఏ దురాచారపు నీడ అయితే తన కూతురిపై పడకూడదని అనుకుంటోందో అదే తన కూతురు వరకూ రావటం తట్టుకోలేక కోటమ్మ పల్లెలో ఆడవాళ్ళందరికీ ఉద్బోధచేసి, తిరుగుబాటును లేవదీస్తుంది.

ముసలయ్య కొడుకు శంకరయ్య, కోటమ్మ కూతురు అరుణకు కన్నెరికం చేయబోతుండటం ఆడవారిలో అంతులేని ఆవేశానికి కారణం అవుతుంది. ఎందుకంటే కోటమ్మ కూతురికి శంకరయ్య అన్నదమ్ముని వరుస. వావి వరుసలు లేకుండా తమ కామవాంఛను ఎలాగైనా తీర్చుకోవాలనుకునే శంకరయ్యలాంటి పెద్దమనుషుల దుర్మార్గాన్ని అర్థం చేసుకొన్న మహిళాలోకం కన్నెరికం చేసే నీచవ్యవస్థపై నిరసనగళాన్ని వినిపిస్తుంది. ఊళ్ళోని ఆడవాళ్ళంతా కలసి శంకరయ్యతో "రేయ్! భూమి గర్జించినట్లు! వంద ఉరుములు ఉరిమినట్లు! వందల గొంతులు ఒకేసారి రేయ్!" అని అరవటంతో బసివిని దురాచారం ఊరినుంచి పారిపోతుంది. కన్నెరికం చేయాలనే పట్టుదల వదలని శంకరయ్యను గద్దిస్తూ "యింకెప్పుడూ మా పల్లె ఆడోళ్ళజోలికి రావద్దు. ఆశారం, కన్నెరికం అంటా కలవరించొద్దు. అట్లా కలవరించినారా కాళ్ళు తీసేస్తాం. నిలువునా నరికేస్తాం..... అతని చుట్టూ కోట! మానవ శరీరాల కోట! మహిళల కోట" ఆ కోటలోనే కన్నెరికం చేసే ఆచారం నేలమట్టమవుతుంది. బసివిని ఆచారం కాలిబూడిదవుతుంది. ఓబులవ్వ మరణించటం, కోటమ్మ చీకట్లోకి వెళ్ళిపోవటంతో పల్లెలో బసివినులు, బసివిని గుడిసె రెండూ

నామరూపాల్లేకుండా పోతాయి. రచయిత కోటమ్మ పాత్రను తిరుగుబాటుకు, ధైర్యానికి, కష్టానికి, త్యాగానికి ప్రతీకగా చిత్రించాడు. బసివిని జీవితాలలో మార్పు తీసుకురావాలనే రచయిత అభిప్రాయానికి 'ముద్ర'లో అద్దం పట్టిన పాత్ర కోటమ్మ.

ముద్ర నవలలో మరొక కీలక పాత్ర బుడ్డమ్మ. కోటమ్మలో అభ్యుదయ భావజాలాలు, తిరుగుబాటు ధోరణి పెంపొందటానికి బుడ్డమ్మ మరణమే కారణం. ఓబులవ్వ మేనల్లుడి కూతురు బుడ్డమ్మ. ఈమెకు గాలి సోకిందనే నెపంతో ఊరి పెద్దలంతా కలసి బుడ్డమ్మను బసివినిగా చేయటానికి సిద్ధపడతారు. ఆడపిల్లల జీవితాలతో ఆడుకునే ఈ దురాచారంపై బుడ్డమ్మ తల్లి దుమ్మెత్తిపోస్తూ "పల్లెల్లోవాళ్ళు, ఊర్లోవాళ్ళు ఉల్ఫాగా వచ్చే ఆడదాని పొందుకోసరం ఆశారం నిలబెట్టి నీళ్ళుపోసి సాకి సంతరిస్తావుండ్రి. అట్లా ఆశారానికి నాబిడ్డకూడా బలైపోతావుండిందే" అని ముద్దరేసే దురాచారం తెరవెనుక వున్న మతలబులను సభ్యసమాజానికి తెలియజేస్తుంది.

ఇదంతా కొంతమంది మగవాళ్ళు తాను కోరుకున్న స్త్రీ పొందుకోసం ఏర్పరచిన అనాచారంగా నిర్ధారిస్తుంది. ముద్ర వేసిన రెండురోజులకే ఉప్పెనలా మీదబడిన ఊరి జనం కామోద్రేకానికి బలైపోయి బుడ్డమ్మ శవంగా తేలుతుంది. దీనిని చూసి తట్టుకోలేక గుండెలు బాదుకుంటూ బుడ్డమ్మ తల్లి మరొకసారి బసివిని దురాచారంపై మండిపడుతూ "నా బిడ్డను వద్దన్నా మాతమ్మను జేసిరి. దాని బతుకు బండల్జేసిరి. దాన్ని పీనుగను జేసిరి. దోర్లనెత్తుకపొయ్యి బచ్చునకుంట్లో, నా కూతురితో బాటుగా గుంత తవ్వి పూడ్చా. వాళ్ళ ఆచారాలు కాలి, బూడిదై బుగ్గి గానానీ" అని వాపోతుంది. మూఢాచారాల వల్ల కన్నబిడ్డల జీవితాలు తెగిన గాలిపటంలా మారుతుంటే, చూస్తున్న బుడ్డమ్మ తల్లిలాంటి ప్రతి తల్లీ ఈ సామాజిక వ్యవస్థపై మౌనంగానే దుమ్మెత్తి పోస్తుంది, మండిపడుతుంది.

బుడ్డమ్మ చావుతో సాటి బసివినుల్లో కూడా తమను బసివినులుగా మార్చిన వ్యవస్థపై పగతీర్చుకోవాలనే ప్రతీకార భావాలు మొదలయినట్లు రచయిత లక్ష్మి (బసివినులను చేసే స్త్రీ) పాత్రలో మచ్చుకు చూపిస్తాడు. "అమ్మణ్ణీ! ఈ సేతుల్తో నీకు తానం చేయించి పసుపు గుడ్డలు కట్టించి, బొట్టుపెట్టి, ముద్దరేసి మూడురోజులు కాలే. యిప్పుడు యిదే చేతుల్తో నీకు మట్టేసే అన్నేకారి దుర్గతిపట్టె. ఓబిడ్డా! నన్ను మన్నించు తల్లీ..... ఈ ఆశారం కాలి బూడిదయ్యేవరకూ మన బతుకులింతే తల్లీ..." అని చెప్పటంతో బసివిని దురాచారానికి ఇక మంగళం పాడాల్సిందేననే అభిప్రాయం వెల్లడవుతుంది. బుడ్డమ్మ స్నేహం, బుడ్డమ్మ మరణం, ఊరి ఆడవాళ్ళ వ్యతిరేకత, ఈ దురాచారంపై బసివినుల నిరసన అన్నీ కలసి కోటమ్మ బసివిని దురాచారాన్ని అడ్డుకునేలా చేస్తాయి. కోటమ్మ తాను బసివిని అయ్యేటప్పుడు ఎదురుతిరగలేకపోయినా తన కూతురిని బసివినిగా చేసేటప్పుడు ఈ దురాచారాన్ని నాశనం చేయాలని నిశ్చయించుకుంటుంది. మార్పులకనుగుణంగా పావులు కదిపి చివరికి బసివిని మూఢాచారాన్ని నిర్మూలిస్తుంది. కోటమ్మలో ముద్రేసే దురాచారంపై వ్యతిరేక భావాలను నింపటానికి బుడ్డమ్మ చావును కారణంగా చూపించిన రచయిత రచనా శిల్పం నవలకు గట్టి పునాదిని అందించింది.

నవలలో కోటమ్మకు ఆసరాగా నిలిచి బసివిని దురాచారాన్ని నిర్మూలించటానికి తమ సహాయసహకారాలు అందించిన పాత్రలు ఉదయ్‌కుమార్, ప్రకాష్, కిష్టయ్య. నిమ్నకులానికి చెందిన అరుణను ప్రేమించటమే కాకుండా ముద్రేసే దురాచారం నుంచి తప్పించి పెళ్ళిచేసుకున్న అగ్రకులానికి చెందిన టీచర్ ఉద్యోగి ఉదయ్ కుమార్. నవలలో ఇతని ఆధునిక భావజాలాలు ఎంతో ఉన్నతమైనవి. మరో అగ్రవర్ణానికి చెందినవాడు, సంఘసంస్కర్త ప్రకాష్. ఇతను తన తండ్రి శాస్త్రిలాగా కాకుండా ముద్రేసే ఆచారాన్ని నిరసిస్తూ ఉదయ్‌కుమార్, అరుణలకు పెళ్ళి చేసి సంఘసంస్కర్తలైన బ్రాహ్మణ పురుషోత్తములలో ఒకడుగా నిలుస్తాడు. మూడవ వ్యక్తి కిష్టయ్య. తాను చిన్నప్పటినుంచి ప్రేమించిన కోటమ్మను 'తన విషపు కోరల్లో బంధించిన బసివిని దురాచారంపై' కసిని పెంచుకుంటాడు.

పాడుబడిన కోటలా కోటమ్మ జీవితాన్ని శిథిలం చేసిన ఐతమ్మ గుడిని, బసివిని గుడిసెను కాల్చి నేలమట్టం చేసి ఎంతో సంతోషపడతాడు. "నేను మనసుపడిన నువ్వు ఇట్టయిపోవటానికి కారణమైన ఆ గుడిని కూలకొట్టి ఆ గుడిసెను కాల్చేసినంతవరకూ నాకు మనశ్శాంతి కలుగలేదు. ఇప్పుడు నాకు శ్యానా సంతోషంగా వుండాది" అన్న కిష్టయ్య మాటలలో పవిత్ర ప్రేమ, ఆడపిల్లల జీవితాలను అనాథలుగా మార్చే మూఢాచారాన్ని నాశనం చేసాననే తృప్తి కనిపిస్తాయి. ఈ సన్నివేశంలో రచయితే కిష్టయ్యలా మాట్లాడినట్లు అనిపిస్తుంది. ఈ ముగ్గురూ పురుషులే. ముసలయ్య, శాస్త్రి,

నివాళి

## రచయిత్రి జగద్ధాత్రి ఆత్మహత్య



ప్రముఖ రచయిత్రి, అనువాదకురాలు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ సభ్యురాలు జగద్ధాత్రి (55) విశాఖ నగరంలోని వెంకోజిపాలెంలోగల తన స్వగృహంలో ఆగస్టు 24న ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన సహచరుడు, ప్రముఖ కవి, రచయిత రామతీర్థ ఈ ఏడాది మే 30న గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటినుంచి ఆమె ఆత్మస్థైర్యం కోల్పోయారు. ఒంటరితనం నుంచి బయటపడటానికి ప్రయత్నం చేశారు. ఈ ఏడాది జులైలో ప్రజాశక్తి స్నేహ (ఆదివారం అనుబంధం) కోసం ఒక కథ రాశారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ నుంచి అనువాదపు పనులు ఉంటే ఇవ్వమని అడిగారు. ఇటీవల వివిధ సాహిత్య సభల్లో పాల్గొంటున్నారు. విషాదం నుంచి కోలుకుంటున్నారని అనుకుంటుండగానే- ఈ చర్యకు పాల్పడ్డారు. దేశ విదేశాల కవిత్వాన్ని తెలుగులో అనువదించిన ప్రతిభాశాలి జగద్ధాత్రి. కథా రచన, ఆంధ్రాంగ్ల ప్రసంగాలతో విశాఖ వర్తమాన సాహిత్య ముఖచిత్రంలో చోటు సంపాదించుకున్నారు. 2017లో 'సరిలేరు నీకెవ్వరు' విశిష్ట కవితా పురస్కారానికి ఎంపికయ్యారు. విశాఖ ఆరిలోవ సమీపంలోని ఆదర్శనగర్‌లో 1964 అక్టోబర్ రెండున ఆమె జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఎ ఇంగ్లీషులో గోల్డ్ మెడల్ సాధించారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ కవిత్వం, రచనలతో పాటు పలు అనువాదాలను తెలుగు, ఇంగ్లీషు భాషల్లో చేశారు. 'హేన్స్ ఇండియా' ఇంగ్లీషు పత్రికలో 'ఉమెనీర్' అనే కాలమ్‌కు ఆమె మహిళా సాహితీవేత్తలను పరిచయం చేసే రచనలు గత కొంతకాలంగా చేస్తున్నారు. ఆమె కవిత్వం 'సహచరణం' పేరిట సంపుటిగా వెలువడింది. 'మొజాయిక్ సాహిత్య సంస్థ'ను స్థాపించి విశాఖ నగరంలో సాహిత్యాభిలాషను పెంపొందించే కృషిని రామతీర్థతో కలిసి పదేళ్లకుపైగా చేస్తున్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ, సాహిత్య ప్రస్థానం పత్రిక తరపున జగద్ధాత్రికి నివాళి. ♦

---

మణియం, సలీం లాంటి పురుషులతోపాటు ఆధునిక భావజాలాలతో సామాజిక పరిణామానికి కృషి చేసే మగవాళ్ళనూ నవలలో చిత్రించటం వి.ఆర్. రాసాని రచనా కుశలతకు తార్కాణం. ఈ నవలకు 'ముద్ర' అని కాకుండా రాయలసీమ యాసలో 'ముద్దర' అని ఉంటే స్థానికతను ప్రతిబింబించేది. ఈ పవిత్ర భారతదేశంలో స్త్రీలను గౌరవిస్తున్నామన్నది కేవలం బూటకమేనని 'ముద్ర' నవల నిరూపిస్తుంది. దైవం పేరుతో స్త్రీని ఆట వస్తువుగా చేసి ఊరికి ఉంపుడుగత్తెగా మార్చే దారుణమైన సాంఘిక దురాచారం ముద్ర వేయటం. రాయలసీమలో ఈ ముద్దరలేసే దురాచారం ఎప్పటినుంచి మొదలయిందో కానీ అప్పటినుండి ఎంతోమంది అట్టడుగు వర్గాల స్త్రీలను అనాథలుగా మార్చింది. సంఘపెద్దలైన పురుషులను ఆటవికులుగా తీర్చిదిద్దింది. మానవుడు తన మేధస్సుతో చంద్రమండలానికి వెళ్ళేంత సాంకేతికత సాధించిన కాలంలో కూడా ఇలాంటి మూఢాచారాలు మనచుట్టూ కొనసాగుతున్నాయంటే ఆశ్చర్యపడాలో, సిగ్గుపడాలో అర్థంకాదు. పశువులకన్నా హీనంగా చూస్తున్న బసివినుల జీవితాలను నేపథ్యంగా స్వీకరించి నవలగా రచించిన రాసాని గొప్ప రచయిత. ఎంతోకాలం నుంచి కొనసాగుతున్న సామాజిక నవలా ప్రయాణాన్ని మరో కొత్త సామాజికస్థితివైపు నడిపించిన ఘనత 'ముద్ర' కే చెందుతుంది. దళిత రచయిత గుఱ్ఱం జాషువా కుమార్తె అయిన హేమలతా లవణం చొరవతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1988లో ఈ దురాచారంపై నిషేధ చట్టం తెచ్చినప్పటికీ చాలాచోట్ల ఇదింకా కొనసాగుతూనే వుందని చెప్పటానికి 2006లో వచ్చిన 'ముద్ర' నవలే సాక్షీభూతం. ♦

కథ

# పగిలిన కల

- వనజ తాతినేని
9985981666



యుద్ధం తర్వాత మిగిలిన మిగిలిన భూమిలా వుంది ఆ యిల్లు. తెల్లని గోడలన్నీ మసి పట్టినట్లు నల్లగా .. అక్కడక్కడా పిచ్చి పిచ్చిగా వొంకర టింకరగా చావు సంతకం. గది మధ్యలో పైన వ్రేలాడుతున్న నాలుగు రెక్కల ఫ్యాన్ శాసించినట్లు నలుదిక్కులకు గాలిని సమానంగా పంచుతున్నా స్విచ్ తీసేయగానే ఆగిపోయినట్లుంది. అస్తవ్యస్తంగా వున్న సామానులన్నింటిని సర్దుకోవాలని వున్నా అరంగుళం కూడా ముందుకు కదలలేక నేలమీద కూలబడిపోయింది ఆమె.

నలుగురు చూస్తుండగా చేయలేని పనిని అతను గది తలుపులు బిగించుకుని స్వేచ్ఛగా యథేచ్ఛగా చేసుకుంటున్నట్లు.. గంటలు గడిచాక యెవరో వచ్చి కిటికీ రెక్క నెమ్మదిగా తట్టినట్లు మరి కాసేపటికి మరింత గట్టిగా బాదినట్లు సమాధానం రాకపోయేసరికి సుత్తితో అద్దం పగలగొట్టి కళ్ళు చికిలించుకుని చూసి గది మధ్యలో వ్రేలాడున్న శవాన్ని చూసి వెర్రిగా కేక పెట్టినట్లు ఆమె కళ్ళముందు కలలా కదులుతూ వుంది.

ఖాళీ అయిన నెర్రెలిచ్చిన మాగాణి భూముల మధ్యనుండి వెర్రిగా యేడుస్తూ అడ్డదిడ్డంగా పరిగెడుతుంది. పెట్టెని మోస్తున్న మనుషుల వెనుక మనుషులు కొందఱు ఆమెను చూసి ఆవేశంగా కసిగా ఆమె వైపు పరిగెత్తివచ్చారు. ఒక ఆడది ఆమెని యెలా ఆపవచ్చో తెలుసుకున్న వుత్సాహంతో సులువుగా ఆమె చీరని లాగిపడేసింది. ఒక మగవాడు యుగయుగాల అహంకారాన్ని అతి తేలికగా ప్రదర్శిస్తూ జుట్టుపట్టుకుని క్రిందకి లాగి పడేసాడు. ఇంకొకడు కాళ్ళతో ఆమెని మట్టగించసాగాడు. ఇంకొకడు యెదకు అడ్డం పెట్టుకున్న రెండు చేతులను లాగేసి పిడిగ్రుద్దులు గుద్దాడు. అమ్మా అని ఆక్రోశంగా అరిచింది. కొద్ది దూరంలో ఇంకొందరు ఆమెను లాగి పడేస్తుండగా ఆ పిలుపు వినబడి రాక్షసిలా తిరగబడి వాళ్ళని కొట్టి తప్పించుకుని పిల్ల దగ్గరికి పరుగునవచ్చి బిడ్డ వొంటిపై దెబ్బలు పడకుండా కాపుకాసింది. వాళ్ళ ఆవేశం అణిగేదాకా తల్లి వొంటిపై దెబ్బల వర్షం కురుస్తూనే వుంది. పెట్టె దూరమైందో లేదో చూసి అలుపు తీర్చుకుంటూ దూరం జరిగారు. తల్లి లేచి దూరంగా పడి వున్న చీరను తెచ్చి బిడ్డకి చుట్టింది. ఒకడు జుట్టుపట్టుకుని రోడ్డు మీదకు ఈడ్చుకొస్తుంటే తల్లి యేడుస్తూ వెనుక అనుసరిస్తుంది.

ఎక్కడ చూసినా దుఃఖం దుఃఖం వరదలై పారుతుంది. వాటికి ఆనకట్టలు వేస్తున్నారు. భద్రంగా నిలువజేసుకుని అహంకార

పంటలు పండిస్తున్నారు. అహంకారాల మధ్య యేడుస్తూనే వుంది స్త్రీ. తాను కూడా యేడుస్తూనే వుంది. మెలుకువ, కాస్తంత మెలుకువ అందులో కూసింత వెలుగు. కలవరంగా లేచి కూర్చున్నాను. కల అని తెలిసింది. కలలో విషయాల చిరునామా యెక్కడుందో తెలుసు అందుకే మరింత కలవరం. ఎవరో చెపితేనే తనలో యింత కలవరం కల్గిస్తే అసలు మనిషి చెపితే ఆ అనుభవం యింకెంత దుఃఖంతో నిండి వుంటుందో... ఎక్కువగా ఆలస్యం చేయదల్చుకోలేదు. వీలైనంత తొందరగా రమేష్ భార్యను పలకరించి రావాలనిపించింది. ఆమె ఇంటి అడ్రెస్స్ కనుక్కుందామని దాసుకి కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది.

♦♦♦

కూరగాయల సంచీలను డిక్కీలో నింపుకుంటూ యెదురుగా నడచివొస్తున్న ఆమెని చూసాను. నన్ను చూసి పలకరింపుగా నవ్వింది. మొహమాటంగా నేను నవ్వి కొన్ని క్షణాలు ఆలోచించాను. ఎక్కడ చూసానో జ్ఞాపకం రావడం లేదు. ఇంకొకసారి చూస్తే గుర్తుకురావచ్చు అనుకుంటూ నన్ను దాటెళ్ళిన ఆమెని వెనక్కి తిరిగి చూసాను. ఎడమచేతిని అడ్డంగా మడిచి భద్రంగా పుస్తకాలని గుండెలకి హత్తుకున్నతీరు ముఖాన్ని బట్టి వయసు అంచనా వేస్తూ స్కూల్ టీచర్ లా వుంది అని మనసులో అనుకుంటుంటే వెనక్కి తిరిగి మళ్ళీ నన్ను చూసి నవ్వి ముందుకు సాగిపోతుంది. బండి స్టార్ట్ చేసి యెవరైవుంటుందీమె అని ఆలోచన చేస్తూనే యింటికి వచ్చి కారు ప్రక్కనే బండి నిలిపి స్టాండ్ వేస్తున్నప్పుడు వెలిగింది ఆమె డ్రైవర్ రమేష్ భార్య అని.

కూరగాయల సంచులు లోపల పడేసి దాసుకి కాల్ చేసాను. ఈ సారి ఫోన్ మ్రోగింది. అడ్రెస్స్ చెప్పాడు. 'రమేష్ భార్య ఈ టైమ్‌లో అంగన్వాడీ కేంద్రంలో కూర్చుని వుంటుంది. వెళ్ళి ఆమెతో ఒకసారి మాట్లాడండి. యింకా మీకు చాలా విషయాలు తెలుస్తాయి. ఆమె నోటివెంట వింటేనే మీకు నమ్మకం కల్గుతుంది, స్థిమితపడతారు' అన్నాడతను అంతలోనే నన్ను చదివేసినట్లు. మనుషులను చదవడం కూడా ఒక కళే కదా అనుకుంటూ బయలుదేరాను.

నన్ను చూసి రండి మేడమ్, బాగున్నారా అని పలకరించి స్టూల్ చూపించింది కూర్చోమని. ఇందాక కనబడినప్పుడు వెంటనే గుర్తుకు రాలేదమ్మా రాణి అన్నాను ఆమె పేరుని జ్ఞాపకం తెచ్చుకుని. తెరిపిగా నవ్వింది. నన్ను చూసి నాలుగేళ్ళయిందిగా, మర్చిపోయినట్టున్నారని అనుకున్నాను లెండి అంది.

"ఎలా వున్నావ్ ? పిల్లలు నీ దగ్గరే వున్నారా" అనడిగాను.

"నా దగ్గరే వున్నారండి. ఇంకెవరున్నారు చూడటానికి ?" అంది.

"అంతా మీ వాళ్లేనట కదా"

"అందరూ అయినవాళ్ళే. కక్ష కట్టి నా బతుకు బుగ్గిపాలు చేసేసారు" .

"చదువుకున్నావ్, గ్రామ సర్పంచ్ గా పోటీ కూడా చేసావ్ కదమ్మా. అంత మెలుకువ వున్న నువ్వు నీకు జరుగుతున్న అన్యాయాన్ని యెలా భరించావు. మీ ఆయనకు పెద్ద పెద్దవాళ్ళు తెలుసు. ఎవరో వొకరు మధ్యవర్తిత్వం చేస్తే అర్థం చేసుకుని సర్దుకునే వాడేమో, అన్యాయం జరిగిపోయింది"

''లేదండీ అతను చెప్పిన దానికల్లా నేను వొప్పుకోకపోవడం వలెనే యివన్నీ జరిగాయంటుంది నా బంధువర్గం. ఒరేయ్, అలా చేయడం తప్పురా అని యే ఒక్కరు ఖండించలేదు. ఇప్పుడు మాత్రం నన్నే బాధ్యురాలిని చేస్తున్నారు, మొగుడిని మింగింది అంటున్నారు" అంది బాధగా.

"ఏం జరిగిందమ్మా, అభ్యంతరం లేకపోతే చెపుతావా, నీ గురించి నీ మాటల్లోనే తెలుసుకోవాలని ఉంది".

రమేష్ నా మేనమామే నండీ. ముగ్గురు మామయ్యల్లో ఆఖరివాడు. అమ్మ అందరికన్నా పెద్దది. ఇంకో పిన్ని. మొత్తం అయిదుగురు సంతానం మా తాతకి. అందరూ పొలాల్లో పని చేస్తూనే పాడి పశువులను పెట్టుకునే బతికారు. మా నాన్నది మాచవరం. ఆటోనగర్ లో రాడ్ వెల్డింగ్ పని చేస్తాడు. మేము ముగ్గురం పిల్లలం. అందరం దగ్గరలో ఉన్న ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో చదువుకున్న వాళ్ళమే. నాన్న సంపాదించిన డబ్బుతో రిజిస్టార్ ఆఫీస్ సందులో రెండు బిల్డింగ్‌లు కొని అద్దెకి యిచ్చాడు. కొద్దిగా పొలం కూడా కొని వ్యవసాయం చేయాలనుకుని ఈ ఊరుకి వచ్చేసారు. మా తాత దగ్గరే స్థలం కొని యిక్కడే ఇల్లు కూడా కట్టుకున్నాం. మా అన్నలిద్దరు వుద్యోగాలకు వెళ్ళకుండా రాడ్ వెల్డింగ్ పనే చేస్తూ పెళ్ళి చేసుకుని మాచవరంలో వుండిపోయారు. మా నాన్న నన్ను మంచి వుద్యోగస్తుడికి యిచ్చి చేయాలని ఆశ. నేనేమో రమేష్ ని ఇష్టపడి అతన్నే పెళ్ళి చేసుకుంటానని చెప్పాను. మా నాన్నకిష్టం లేదు. మనం అమ్మాయికి ఆస్థి యిస్తే వాడికి వున్నట్టే కదా, చదువబ్బలేదు కానీ రమేష్ మంచాడు. మన పిల్లల

మధ్య పనిలో పడేస్తే వాడే దారిలోకి వస్తాడు. పిల్ల కళ్ళ ముందు వుంటుందని వొప్పించింది అమ్మ . పెళ్ళై యెనిమిదేళ్ళు ఇద్దరు పిల్లలు. కార్ డ్రైవర్‌గా వెళ్లి బాగానే సంపాదించేవాడు. హాయిగా గడిచిపోతుంది అనుకుని సంతోషించాను.

నాలుగేళ్లు మంత్రికి డ్రైవర్ గా పనిచేశాడు. గొప్ప గొప్ప వాళ్ళతో పరిచయం. రోజూ త్రాగుడు అలవాటైపోయింది. రాజకీయాలు మాట్లాడం తనని కులం పేరుతో అణిచివేస్తున్నారని గడ్డిపరక కన్నా హీనంగా చూస్తున్నారని వాపోయేవాడు. మా పక్కింటి అబ్బాయితో గొడవపడి అది మనసులో పెట్టుకుని యేడాది తర్వాత నాతో కేసు పెట్టించాడు ఈవ్‌టీజింగ్ చేస్తున్నాడని కులం పేరున తిడుతున్నాడని. అలా పెట్టకపోతే వురి వేసుకుని చస్తానని బెదిరించాడు నన్ను. పాపం, ఇంటిప్రక్కబ్బాయి యేనాడు నన్నేమి అనలేదు. అతనికి బెయిల్ కూడా రాలేదు. కోర్ట్‌లో జడ్జి గారు అడిగితే అబద్ధం చెప్పలేక నిజం చెప్పేసాను. జడ్జి మందలించి కేసు కొట్టేశారు. ఆ రోజు నుండి రోజూ తాగొచ్చి నన్ను కొట్టడం పక్కింటి అబ్బాయితో నాకు సంబంధం వుందని అబాండాలు వేయడం మొదలెట్టాడు. మా అమ్మ నాన్న అన్నలు అందరూ అతని పద్ధతి మార్చుకోమని యితరులతో గొడవలు పడొద్దని హితబోధలు చేసినా అతని చెవికెక్కేవి కావు. గ్రామ సర్పంచ్ గా పోటీ చేయడం కూడా అతని వొత్తిడి మీదే. రమేష్ మాటల్లో నిజం లేకపోలేదు. కులవివక్ష, పెత్తందారీతనమూ యెప్పుడూ వున్నయ్యే కదా, ఓపిక పట్టాలి చదువుకుని ఉద్యోగాలు చేస్తే హోదా పెరుగుతుంది. హోదాలని బట్టేగా గౌరవం అని నేను నచ్చచెపుతూ ఉండేదాన్ని.

ఇక అతని కుటుంబం గురించి చెప్పాలంటే అదో పెద్దకథ. అతని పెద్దన్న వదిన హెచ్ ఐవి సోకి చనిపోయారు. రెండో అన్న భార్య రమేష్ కి మేనమామ కూతురే. వూర్లో ఉంటున్న రైతుతో సన్నిహితంగా మెలుగుతుందని అమ్మ గమనించింది . అతను యింటికి వస్తూ పోతుండటం చూసి తప్పు చేస్తున్నావని హెచ్చరించింది. ఆ విషయం యెక్కడ బయట పడుతుందేమో భర్తకి తెలుస్తుందేమో అని భయపడుతూనే అమ్మమీద, నా మీద కక్ష పెట్టుకుని చాటుమాటుగా రమేష్ కి మా మీద వ్యతిరేకంగా మరిన్ని మాటలు చెప్పి యెగదోసేది. ఆమె యేమి చెప్పినా నమ్మేసేవాడు. తాగొచ్చినా తాగకపోయినా లేస్తే తన్ను కూర్చుంటే తన్ను యేడాది పాటు నరకం చూపించాడు. నేను విసిగిపోయాను మా వాళ్ళు భరించలేకపోయారు . నాన్న దగ్గరుండి మరీ పోలీస్ కంప్లైంట్ యిప్పించాడు.

కేస్ పెట్టిన తర్వాత పిల్లల్తో సహా అమ్మ వాళ్లింట్లోనే ఉన్నాను. కేసు పెట్టినందుకు అమ్మ వాళ్ళింట్లోకి కూడా జొరబడి వచ్చి కొట్టేవాడు. అతని నుండి కాపాడటానికి అన్న వాళ్ళు వాళ్ళింటికి తీసుకు వెళ్ళారు. చర్చికి వెళ్లే సమయానికి అక్కడ దారి కాసి నడి బజార్లో కొడుతూ వుంటే ఎస్ ఐ చూసి మరొక కేస్ ఫైల్ చేశారు. విచారణ చేసేటప్పుడల్లా వాళ్ళతో కూడా వివరీతమైన వాదనాడేవాడని నాన్న అన్నయ్యలు చెప్పే వాళ్ళు. మొత్తం అతని మీద అయిదు కేసులు. రౌడీ షీటర్ కూడా ఓపెన్ అయింది. రోజూ వెళ్లి సంతకం పెట్టి రావాలనే నిబంధన. తనకున్న పలుకుబడి గురించి చెప్పి పోలీస్ లనే బెదిరించే వాడట. అది గమనించి హేళనగా నవ్వుకుంటూ మరింత హెరాస్ చేయాలని వొట్టి పుణ్యానికే పదే పదే విచారణకు పిలిచేవాళ్ళు. అలా జరుగుతుండగానే పిల్లలని బలవంతంగా నా దగ్గర్నుండి తీసుకువెళ్ళాడు. పిల్లలన్నా అతని దగ్గరుంటే వాళ్ళని చూసుకుని మార్పు తెచ్చుకుంటాడేమోనని నేను అభ్యంతరం చెప్పలేదు. పైగా ప్రక్క యింట్లోనే అమ్మ వుండటం వల్ల పిల్లలకు ఆలనా పాలన బాగానే వుండేది. మేము దూరంగా వున్న యేడాది కాలంలోనే అనుకోని యెన్నోమార్పులు వచ్చాయి. రమేష్ కి హెచ్ ఐ వి ఉన్నట్లు తెలియడం వల్ల మానసికంగా తల్లడిల్లిపోయి వుంటాడు. అతని ఆరోగ్య స్థితి, పరిస్థితులు అన్నీ అగమ్యగోచరంగానే అనిపించి వుంటాయని ఇప్పుడు తల్చుకుంటే దుఃఖంగా వుంది.

కంఠంలో దుఃఖం. చెప్పలేక కాసేపు ఆగింది. నేను మౌనంగా కూర్చున్నాను. కాసేపటి తర్వాత మళ్ళీ చెప్పసాగింది.

అతనంత పిరికివాడేమీ కాదు. ఎన్ని కేసులనైనా ఎదుర్కునే మొండివాడు. చనిపోవడానికి కొద్ది గంటల ముందే దాసు మామతో మాట్లాడుతున్నప్పుడే పోలీస్ స్టేషన్ నుండి విచారణకు రావాలని ఫోన్ చేశారని చెప్పాడు. విచారణకి వెళ్లొచ్చిన రెండు గంటలకు యింటికి వెళ్ళి ఉరి వేసుకుని చనిపోయాడు. అది తెలిసి గుండె పగిలిపోయినట్లయింది . నేనూ అన్నలూ అందరం యింటికి వచ్చాము. నా మూలంగానే రమేష్ చనిపోయాడని అతని రెండో అన్న వదినలు మిగతా బంధువులు అందరూ మా మీద కర్రలతో రాళ్లతో దాడి చేశారు. శవం దరిదాపులకు కూడా రానీయలేదు. ఇంట్లో

వున్న వస్తువులు బీరువాలో వున్న బట్టలు అన్నీ రోడ్డుపై వేసి తగలబెట్టేశారు. అమ్మ వాళ్ళ పాడి గేదలను తాళ్లు విప్పి దూరంగా పారదోలారు. కిటికీల అద్దాలు పగలగొట్టారు. అరటితోటని నరికేశారు. ఆ హింస చూస్తే నోరు తడారిపోయింది. రమేష్‌ని కడసారి చూడటానికి మాజీ మంత్రి వచ్చాడు. పోలీసుల గట్టి బందోబస్తు మధ్య అతని ఆఖరియాత్ర మొదలైంది. ఆఖరి చూపైనా చూసుకోవాలని చేలకి అడ్డంపడి ఖనం చేసే చోటికి వెర్రిగా పరిగెత్తాను అక్కడైనా చూడనిస్తారని. నన్ను దరిదాపులలోకి రాకుండా నా వొంటిపై చీరను లాగేసి నన్నుచేలో పడేసి కొట్టి జుట్టుపట్టుకుని ఊరి మధ్యలోకి యీడ్చుకొచ్చి యింకా అక్కడే వుంటే పెట్రోల్ పోసి తగలబెడతామని బెదిరించి తరిమేశారు. ఊర్లో ఒక్కరు కూడా నాకు సహాయంగా నిలబడలేదు. కుటుంబ సభ్యుల గొడవ మనకెందుకులే అని చూసీచూడనట్టు వూరుకున్నారు.

నిజంగానే కుటుంబ రాజకీయాలమధ్య ఈర్ష్యాద్వేషాల ముళ్ళ మధ్య పడి నా జీవితం చిరిగిపోయింది. అమ్మ నాన్న అన్నయ్యలు వాళ్లకి భయపడి ఇల్లు విడిచి యెక్కడో అజ్ఞాతంగా తలదాచుకోవలసి వచ్చింది. ఊరికి దూరంగా యెక్కడో అనామకంగా తాళి తెంచేసి తెల్ల చీర కట్టుకుని జరిగినదాంట్లో నా తప్పెంత నా తల్లిదండ్రులు చేసిన నేరమేమిటీ అని మేమంతా కన్నీరు మున్నీరవుతుంటే జ్ఞాపకార్థ కూటమి రోజున విందు భోజనాల మధ్య మద్యం యేరులా పారించి రమేష్ గురించి మంచిగా మైక్ లో చెప్పుకుని తెరిపినబడ్డారు. తెల్లవారేటప్పటికి నా పిల్లలని మా యింటికి తోలేశారు.

చనిపోయే ముందు రమేష్ అతని ఫ్రెండ్స్ కి పంపిన వీడియో వల్ల నిదానంగా అన్నీ బయటకొచ్చాయి. అందులో యేముందో చూడండి అని మొబైల్‌లో ఉన్నవీడియో తీసి నాకిచ్చింది చూడమని. నిర్వికారమైన చూపులతో నెమ్మదైన మాటలతో రమష్ "ఎవరిపైనో తెలియని కసి, ఆవేశం. బాగా బతికే అవకాశం నాకూ రావాలి. బ్రతకడానికి అణిగి మణిగి ఉండటం నా వల్ల కాదు. హెచ్ ఐ వి తో ఎన్నాళ్ళో బ్రతకను, బ్రతికినా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాలి. మా అన్న వదినలు హెచ్ ఐ వి తో పదేళ్ల క్రిందటే చనిపోయారని యిప్పటికీ అందరూ ఎగతాళి చేస్తుంటారు. అలాంటి ఎగతాళి మధ్య బ్రతకడం కన్నా చావే మేలనుకుని ఉరి వేసుకుంటున్నాను. నా చావుకి కారణం నేనే. సమాధానపడని నా మనస్తత్వమే.

అని ముగించాడు. అది చూసి అందరూ జరిగింది ఏదో జరిగిపోయిందిలే పోనీయండి.. పిల్లలను పెట్టుకుని ఆమె బతుకుద్ది అని చెప్పాక నన్ను నా యింట్లోకి రానిచ్చారు. అమ్మ నాన్న అండ వుంది. ఇల్లు వాకిలి డబ్బు అన్నీ వున్నాయి. మనిషే లేడు. రమేష్ లేడన్న దిగులు కూడా లేనంత గట్టిపడిపోయాను. అతనితో జీవితం పచ్చగా వుండాలని యెన్నెన్నో కలలు కన్నాను. ఆ కల పగిలిపోయింది. చివరికిలా బుగ్గి చేసి కడతేరిపోయాడు. ఎవరికీ ఇలాంటి బతుకు రాకూడదు అంది కన్నీటితో.

కాసేపు మౌనం.

జ్ఞాపకాలను మోయడం పువ్వు పరిమళాన్ని మోయడమంత సహజం కదండీ, మంచిగానో చెడుగానో అతను నా భర్త. నా కట్టే కాలేదాకా ఈ బాధ అనుభవించాల్సిందే. లోకులేమన్నా తలొంచుకోవాల్సిందే అంది తాను తప్పు చేసినట్లుగా తలొంచుకుని.

రాణి నాతో మాట్లాడటం చూసి ఆమె తల్లి మాదగ్గరికి వచ్చి నిలబడి అప్పటికే చాలాసేపైంది. "చిన్నప్పటి నుండి వాడంతేనమ్మా ఇంట్లో పేచీ, బడిలో పిల్లలతో పేచీ అసలు మనుషులతోనే పేచీ" అంది విరక్తిగా .

"అవున్నిజమే! అతనికి అందరితో గొడవే కానీ భార్యన్నా పిల్లలన్నా భలే ప్రేమ. మా ఆవిడ అసలు బయటకు రాదండీ పిల్లలను బడికి పంపించుకోవడం వాళ్ళకు చదువు చెప్పుకుంటూ కూచోవడం తప్ప లోకం సంగతి కొంచెమైనా పట్టించుకోదు అని గొప్పగా చెప్పేవాడు. ఏమిటో యిలా చేసాడు" అన్నాను బాధగా.

"భార్యాభర్తలమధ్య విభేదాలుంటే సరిదిద్దాల్సిన అయినవాళ్లే కుట్రలు చేసి మరింత మంటను యెగదోస్తే ఇట్లాగే వుంటాయమ్మా, పెద్ద పెద్దవాళ్ళతో పోల్చుకుని మన మట్టాంటి స్థితికి చేరుకోవాలంటే కష్టపడాలని అర్థం చేసుకోక లేనిపోనీ ఆలోచనలు చేసి సంసారాన్నిట్టా చేసుకున్నాడు. తప్పుడు కేసులు పెట్టుకుంటూ జీవితాన్ని నరకం చేసుకున్నాడు. బిడ్డను కళ్ళ ముందు పెట్టుకుని కుమిలిపోతున్నామమ్మా" అని కళ్ళొత్తుకుంది.

మార్పుగా వుంటుంది ఏదైనా వుద్యోగం చేయమ్మా అన్నాను రాణితో.

రాణి తలవూపింది. వాళ్ళమ్మ మాకు డబ్బు కేమీ కొదవలేదమ్మా, ముప్పై యేళ్ళు కూడా రాలా, మళ్ళీ

## కవిత

# వీధి సర్కస్

- కె. ద్వారకనాథ్
9985295605



*తరతరాలుగా ఆకలి నేర్పిన పాఠాలవి*
*బతకటానికి నేర్చిన విన్యాసాలవి*
*పర్వతారోహకులో, వ్యోమగాములో*
*పొందే శిక్షణా కేంద్రాలు లేవు వాళ్ళకి*
*ఢమరుకం డప్పో, డోలక్ మెడకు వేసుకునే*
*ట్రంకు పెట్టె, కర్రలు, గడలు, తాళ్ళు*
*పాత గుడ్డల మూటలు, మాటలు రాకున్నా...*
*మాటను వినే వానరం ఇవే వాళ్ళ ఆస్తి*

*కరెంటు తీగపై వాలిన భయం లేని పక్షిలా*
*ఒకవైపు ఆకలి మరోవైపు బతకాలనే ఆశను*
*రెండు వైపులా చేర్చి ఊతకర్రగా పట్టుకుని*
*పట్టుతప్పక తీగపై బాలెన్స్ చేస్తూ నడుస్తుంది*
*నాన్న చేయి పట్టుకుని బడి కెళ్ళాల్సిన వయసులో*
*పట్టెడు మెతుకుల కోసం*
*నాన్నవద్ద శిక్షణలో విన్యాసాలెన్నో నేరుస్తుంది*
*కష్టానికి తగిన అన్నం తినాలన్నా*
*సగం కడుపుకి తినాలి*
*రేపటి ఆటకోసం శరీరాన్ని అదుపులో వుంచుకోవాలి*

*హైడ్రా జీవిలా మొగ్గలు వేస్తున్న*
*పసి మొగ్గ చిన్నారి ఒకవైపు*
*ఒకే రింగులో ముగ్గురు పిల్లలు దూరి*
*బయటకు సునాయాసంగా వస్తున్నప్పుడు..*
*ఇరుకు బతుకులయినా బతికే ధైర్యం వాళ్లల్లో వుందనిపిస్తుంది*

*ఢమరుకం మోత సైగలతో నోటమాటరాని వానరం*
*నాట్య మయూరి అయిపోతుంది*
*పల్టీలు, పొర్లు దండాలు పెట్టి నవ్విస్తుంది*
*గిన్నె పట్టుకుని జనం వద్దకు వచ్చి చెయ్యి చాస్తుంది*
*టిక్కెట్ లేని వీధి సర్కస్‌కి*
*వీధి జనం తృణమో, పణమో ఇస్తుంటారు*
*ఎన్ని విన్యాసాలు, మాయలు, గారడీలు చేసినా*
*కోటివిద్యలు కూటి కొరకే..అంటారు*
*వీరి తలరాతలను ఎవరు మారుస్తారు..?*
*వీరి ఆకలి బతుకులు ఎవరు తీర్చిదిద్దుతారు?!*

◆

---

చదువుకుంటది. ఇంకా చదివి వుద్యోగం తెచ్చుకుని ధైర్యంగా బ్రతకడం నేర్చుకోవాలి ఓర్పు పట్టినాళ్ళదే వందేళ్ళ జీవితం అని ఊరికే అనలేదు పెద్దోళ్ళు. మేము అట్లాంటి పూరిగుడిసెలో పుట్టి కష్టపడి తెలివితేటలతో ఇంతో అంతే సంపాయిచ్చుకోలా, మా ఆయన ఎమ్ యెల్ ఏ ఆఫీస్‌కి వెళితే యెదురెదురు మర్యాదలు చేస్తారు. వాడికి అప్పటికి చెప్పిచూసా అణుకువుగా వుండి యెదగడం నేర్చుకోవాలి, చీకటి రాజ్యం యెల్లకాలం చెలాయించదురా అయ్యా అని. మిడిమేళం వింటేగా. జనుల నోట్టో మమ్మల్ని నానేసిపోయాడు అని కళ్ళొత్తుకుంది. రాణి ముఖం చూస్తే గుమ్మరించని నీళ్ళకుండలా బరువుగా వుంది. అప్పటికి వాళ్ళ గుండెల భారాన్ని కొంత నా మీదకి మార్చినట్టుంది.

దాసు చెప్పిన కథ కూడా దాదాపు యిదే.కాకపోతే అతను చెప్పినప్పటికన్నా రాణి చెప్పినప్పటి బాధ పదింతలు యెక్కువ. నేరం యెవరిది? తిల పాపం తలా పిడికెడు. కళ్ళలోకి రాని నీళ్ళను రాణి వ్యధలో చూసి బరువుగా లేచి నిలబడి 'వెళ్ళొస్తాను' అన్నాను. నా కథంతా చెప్పి మిమ్మల్ని బాధపెట్టినట్లున్నాను అని నవ్విందామె. ఆ నవ్వులో వేల వేల భాష్యాలు మననుల కాలుష్యాలు మనుషుల అహంకారాలు. అవెప్పుడు కాలి మసైపోతాయో కానీ అప్పటిదాకా రమేష్ కి యెదురుపడిన వివక్ష, కల్గిన అసహనం రాణి లాంటి వాళ్ళ కలలను పగలగొడుతూనే వుంటాయి. ◆

# స్వీకారం

## సాగర సమీరాలు కవిత్వం




**సంపాదక వర్గం: డా॥ జోశ్యుల కృష్ణబాబు**
**బొల్లోజు బాబా, మార్ని జానకిరామ్ చౌదరి**
వెల : 60/- పేజీలు: 94
ప్రతులకు : 9949228298

ఏదైనా ఒక కవిత చదవగానే రెండు విషయాలను ఆశిస్తాం. ఒకటి: చక్కని భావపుష్టి, బిగుతైన నిర్మాణము. రెండు: ఆ కవిత మనందరికీ పరిచయమైన విషయాన్ని చెపుతూనే, ఒక నూతన కోణాన్ని దర్శింపచేయటం. ఈ సంకలనంలోని చాలామట్టుకు కవితలు ఈ రెండు విషయాలను కలిగి ఉన్నాయి.

**- బొల్లోజు బాబా**

## నాలుగు అస్తిత్వాలు, నవలికలు




**డాక్టర్ శాంతినారాయణ**
వెల : 150/- పేజీలు: 210
ప్రతులకు: 8074974547

దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని, సాంకేతికంగా పురోగమిస్తుందని చెబుతున్నప్పటికీ రాయలసీమ పల్లెల్లో బతుకు మారలేదు. ముఖ్యంగా మహిళల బతుకు మరింత భయానకంగా తయారయింది. ఈ వాస్తవాల్ని తెలియజేస్తూ ఆలోచింపజేయడం రచయిత శాంతినారాయణ సాహిత్య సాఫల్యం. ప్రజల మీద, చుట్టూ ఉన్న జీవితం మీద రచయిత శాంతినారాయణకు ఉన్న ప్రేమ, నిబద్ధతలకు నిదర్శనం ఈ నాలుగు నవలికలు.

**- గుడిపాటి**

## నాగలకట్ట సుద్దులు రెండవభాగం



**డాక్టర్ శాంతినారాయణ**
వెల : 150/- పేజీలు: 224
ప్రతులకు: 8074974547

మౌనం నేరమని ప్రబోధించే యీ రచనల్లో శాంతినారాయణది ఆగ్రహ స్వరమే కాదు, ధిక్కార స్వరం కూడా. ప్రశ్నించడమే దేశద్రోహంగా పరిగణించి భావప్రకటన స్వేచ్ఛనీ జీవించే హక్కుని సైతం కాలరాస్తున్న ఫాసిస్టు మూకల యేలుబడిలో వొకానొక అమానవీయ సందర్భంలో యీ స్వరం అవసరం యెంతైనా వుంది.

**- ఎ.కె. ప్రభాకర్**

## మహాభారతం సొగసులు - సూక్ష్మాలు




**సాకం నాగరాజు**
వెల :100/- పేజీలు: 85
ప్రతులకు: 0877-2230135

18 పర్వాల మహాభారత గ్రంథాన్ని ఈ తరం పిల్లలు చదువుతారనుకోవడం అత్యాశే! ఈనాటి పాఠశాల, కళాశాల విద్యార్థులు, గృహిణులకు భారతం గొప్పదనం కొద్దిగానైనా రుచి చూపించి, భారతం పట్ల మక్కువ కలిగిద్దామన్న ఆశతో కొన్ని భారతం ఘట్టాలు ఏరి కూర్చాను. ఈ పుస్తకం జీవిత పాఠాలను బోధిస్తుంది.

**- సాకం నాగరాజు**

## వ'సుధా(స)మ'యం కాలమ్ రచనలు




**సుధామ**
వెల :150/- పేజీలు: 145
ప్రతులకు: 9849297958

ఈ కాలమ్ రచనల్లో సాహిత్య సభలు, సంస్థలు, పత్రికల ధోరణుల గురించిన వ్యాసాలకు ఎక్కువ ప్రతిస్పందన లభించింది. నా వలె ఆలోచించి, ఆర్తి చెందేవారున్నారన్న గ్రహింపు లభించింది. ఆయా రచనల్లో నేను వ్యక్తిగతంగా ఎవర్నీ ఉద్దేశించి కాక నేటి వర్తమాన వైపరీత్య ధోరణులను మాత్రమే చిత్రించానని సవినయంగా తెలియజేసుకుంటున్నాను. కొన్ని భావాలు చర్వితచరణాలుగా వచ్చాయి. ఆ అంశాలపట్ల మరింత ఊనికకోసమే ఆ వైఖరి సాగిందని గ్రహించగలరని విశ్వసిస్తున్నాను.

**- సుధామ**

## జీవనస్వరం కథలు




**ఇంద్రగంటి నరసింహమూర్తి**
వెల :150/- పేజీలు: 198
ప్రతులకు: 9959352900

కొన్ని జీవన సంఘటనలు - సన్నివేశాల కల్పనల్ని - సమ సంభావ్యతలో అలవోకగా మలిచారు. సహజ ఇతివృత్తాలు - సమాజ జీవన చిత్రాలుగా. ఎక్కువ వర్ణన, శిల్పశక్తుల్ని జోడించకనే, ఎత్తుగడ కథనాల నైపుణ్యంతో కాస్త కొసమెరుపులతో రక్తి కట్టించిన 'మూర్తి'మంతమయిన, మానవతా మార్గమయిన ఇరవై నాలుగు కథాదీప్తులివి. సమాజ రాగాల 'జీవస్వర'మిది.

**- డా॥ శిరీష**

## నివేదిక

# కాకినాడ సాహితీస్రవంతి 6వ వార్షికోత్సవం




కాకినాడ సాహితీస్రవంతి 6వ వార్షికోత్సవం ఆగస్టు 11న కాకినాడ సూర్యకళామందిర్‌లో ఉదయం నుండి సాయంత్రం వరకూ జరిగింది. మొత్తం మూడు విభాగాలుగా జరిగిన ఈ వార్షికోత్సవ ప్రారంభ సదస్సు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యింది. సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సాహిత్యంలో మానవత్వం ఉండాలి కానీ మతతత్వం కాదు అన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు డా॥ వుయ్యపు హనుమంతరావు మాట్లాడుతూ సాహిత్య సభలకు పిల్లల్ని కూడా తీసుకురావాలని, భాషా సాహిత్యాల మీద వారికి చిన్నప్పటి నుండీ అభిరుచిని కల్గించాలి అన్నారు.

విశిష్ట అతిథిగా విచ్చేసిన కాకినాడ సత్యా స్కానింగ్ సెంటర్ అధినేత డా॥ కాద వెంకట రమణ మాట్లాడుతూ చిన్న చిన్న పల్లెటూర్లలో ఉండే పిల్లలలోని టాలెంట్స్‌ని కూడా వెలికితీస్తే సాహిత్యం చిరకాలం మనగలుగుతుందని అన్నారు.

సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షులు డా॥ జోశ్యుల కృష్ణబాబు మాట్లాడుతూ కవులూ, రచయితలూ ప్రతి ఊరిలోనూ ఉంటారని, కాని వారిలోని మౌలిక శక్తిని వికసింపజేసి, వారిని మరింత మంచి రచయితగా రూపొందించగలిగే సమిష్టి ప్రోత్సాహం మాత్రం అన్నిచోట్లా ఉండదని సాహితీస్రవంతి ఆ పని చేస్తుందని అన్నారు.

సాహితీస్రవంతి కాకినాడ నగర అధ్యక్షులు మార్ని జానకిరామ్ చౌదరి ఈ సంవత్సరమంతా నిర్వహించిన సాహితీస్రవంతి కార్యక్రమాల నివేదికను సమర్పించారు. సాహితీస్రవంతి ఏయే ఆశయాలతో ముందుకు వెళుతుందో, ఎవరెవరి సహాయ సహకారాలతో సాగుతోందో వివరించారు.

ఇక ముఖ్య అతిథి, ప్రధాన వక్త, సాహితీస్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ ఇటు సాహిత్యంలోనూ, అటు సమాజంలోనూ కూడా నేడు కుల, మత, వ్యక్తి, స్వీయ పూజలు పెరిగాయన్నారు. నేటి సమాజం కులాన్ని, మతాన్ని బట్టి నడుస్తోందనే బలమైన భావజాలం ప్రచారం జరుగుతున్న తరుణంలో ఇటువంటి ధోరణులను కవులు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కులతత్వం సంకెళ్ళు తెంచేందుకు సాహిత్యం దోహదపడాల్సిన అవసరం ఉందన్నారు. మతం పేరుతో జరుగుతున్న ఘర్షణల్ని వివరించారు. ఈ దేశంలో భిన్నత్వంలో ఏకత్వం ఉందంటూ కవులూ, రచయితలూ చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో వ్యక్తిపూజ పెరిగిందని, మతతత్వం లాగే వ్యక్తి పూజ కూడా ప్రమాదకరమైందని ఆయన వివరించారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడిని తిప్పికొట్టాలంటూ పిలుపునిచ్చారు. మంచి లక్ష్యానికి, మంచి ఆశయానికీ మోకరిల్లితే తప్పులేదని, సింహాసనానికి మోకరిల్లితే శరీరం మలినమవుతుందని అన్నారు. వ్యవస్థలన్నీ తలక్రిందులుగా ఉన్న నేపథ్యంలో కవుల పాత్ర మరింత అవసరమన్నారు. సమాజ హితం కోరే సమిష్టి చర్చ జరగాలన్నారు. తెలుగునాట సంస్కరణ భావాలను ఇంకా

ముందుకు తీసుకువెళ్ళేందుకు సాహితీస్రవంతి మరింతగా కృషి జరపాలన్నారు. కాశ్మీర్ అంశాన్ని ప్రస్తావిస్తూ కాశ్మీర్ అభివృద్ధికి 370 ఆటంకమైతే మిగతా రాష్ట్రాలు అభివృద్ధి కాకపోవటానికి ఏ ఆటంకాలున్నాయని ప్రశ్నించారు. కాశ్మీర్‌లో పెట్టుబడులు పెట్టేందుకు 370 అడ్డమయితే ప్రభుత్వమే ఎందుకు పెట్టుబడులు పెట్టలేదని ప్రశ్నించారు. ఆర్టికల్ రద్దు సరికాదనే వారిని దేశ, జాతి ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని ఆయన అన్నారు. సత్య ప్రకటనమే సాహిత్యం యొక్క లక్ష్యమని నేటి యువతకు తెలియజేయాల్సిన బాధ్యత సీనియర్ కవులకు, రచయితలకు ఉందని అన్నారు.

అనంతరం సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు, సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ వొరప్రసాద్ కాకినాడ సాహితీస్రవంతి 6వ వార్షికోత్సవ కవితా సంపుటి 'సాగర సమీరాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సాహితీస్రవంతి రచయితలను ప్రోత్సహించడంలో ముందుంటుందని అన్నారు.

ఈ సదస్సు ప్రారంభంలో గరికపాటి మాష్టారు రాసిన సాహితీస్రవంతి గీతాన్ని మేడిశెట్టి శ్రీరాములు ఆలపించారు. పి.ఆర్. ప్రభుత్వ కళాశాల తెలుగు లెక్చరర్ సుంకర గోపాల్ అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. అద్దేపల్లి జ్యోతి వందన సమర్పణ చేశారు. ఇదే సదస్సులో 80 వసంతాలు నిండి, సాహిత్య, సామాజిక సేవలో అవిశ్రాంత మూర్తులుగా ఉన్న సాధు సుబ్రహ్మణ్య శర్మ గారిని, గరికపాటి మాష్టారిని సాహితీస్రవంతి బృందం సత్కరించింది.

భోజన విరామం అనంతరం రెండవ సదస్సు ప్రారంభమయ్యింది. పసుమర్తి పద్మజా వాణి అతిథుల్ని వేదిక మీదకు ఆహ్వానించారు. సాహితీస్రవంతి కాకినాడ నగర కార్యదర్శి బొల్లోజు బాబా అధ్యక్షత వహించారు. ధనరాజు మాష్టారు రాసిన సాహితీస్రవంతి గేయాన్ని మేడిశెట్టి శ్రీరాములు ఆలపించారు. ఈ రెండవ సదస్సుకు ముఖ్య అతిథిగా, ప్రధాన వక్తగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ హాజరయ్యి ప్రసంగించారు. ఆత్మీయ అతిథిగా ఉభయ గోదావరి జిల్లాల శాసన మండలి సభ్యులు ఐ. వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

బొల్లోజు బాబా మాట్లాడుతూ కవిత్వం జీవితాన్ని ప్రతిబింబించాలన్నారు. 20 వ శతాబ్దం అంతా దోపిడీ ఎక్కడుందో తెలుసుకోవటానికి ప్రయత్నించిందని, 21వ శతాబ్దం అంతా అధికారంల అనేది ఎలా వెర్రితలలు వేస్తుందో తెలియ చెపుతోందని అన్నారు. పాపినేని శివశంకర్ కవిత్వానికి పెద్దన్నలాంటి వారని అన్నారు.

శాసనమండలి సభ్యులు ఐ. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ సాహితీ వారసత్వం రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఉందని, దాన్ని ముందుకు తీసుకువెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన పాఠశాల విద్యలో మాతృభాషను తప్పని సరి చేయకపోవటం శోచనీయమని అన్నారు.

ప్రధానవక్త డా॥ పాపినేని శివశంకర్ 'ఆధునిక కవిత్వంలో ఎదురయ్యే సమస్యలు' అంశంపై ప్రసంగించారు. కుటుంబ నియంత్రణలాగా కవిత్వానికి కూడా నియంత్రణ అవసరం ఉందని అన్నారు. అసలు కవిత్వం ఎందుకు రాస్తున్నారు? కీర్తి కోసమా? ధనం కోసమా? ఒక సామాజిక బాధ్యత అనుకొనా? ఇది తేల్చుకోవాలన్నారు. నువ్వు కొత్తగా ఏదైనా రాస్తున్నావా? కొత్తగా ఏం చెపుతున్నావు? దేన్ని నువ్వు తవ్వుతున్నావు? అన్నది ఆలోచించుకోవాలన్నారు.

కవులు సాహిత్య సభల్లో మాట్లాడే తీరు ఒకలాగ, సాహిత్యానంతర సభల్లో మాట్లాడే తీరు ఒకలాగ ఉండకూడదన్నారు. అవసరమైతే కవి దేన్నైనా ఒప్పుకోవాలి. దేన్నైనా తిరస్కరించాలి అన్నారు. అమ్మను వృద్ధాశ్రమంలోకి తోసేవాళ్ళు అమ్మను గూర్చి కవిత్వం రాస్తున్నారన్నారు. ఇక నేటి కవులు ఏది కవిత్వం? ఏది వచనం అన్నది తేల్చుకోవాలన్నారు. కవిత్వంలో ఉత్తమమైన ఇమేజరీ ఉండాలి. ఊహ ఉండాలి, ఏదో ఒకటి కొత్తగా ఊహించాలి. ఇటీవల కొత్త కవులు కొత్త ఇమేజరీలను ప్రయోగించే హడావుడిలో కవిత్వంలో క్లారిటీని, స్పష్టతను కోల్పోతున్నారన్నారు. దానిని కొంచెం సరిచేసుకోవాలన్నారు. డాక్టర్ వి. ఎజ్రాశాస్త్రి వందన సమర్పణతో రెండవ సదస్సు ముగిసింది.

సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన కవిసమ్మేళన సదస్సుకు ఉభయ గోదావరి జిల్లాల నుండే కాక సుదూరాల నుండి 80 మంది కవులు హాజరయ్యారు. ఈ సదస్సుకు అధ్యక్షులుగా ప్రముఖ కవి, కథకులు శ్రీకంఠస్ఫూర్తి వ్యవహరించారు. సమన్వయ కర్తలుగా ఇందిర, ఎన్.వి. పద్మావతి వ్యవహరించారు. కె. శివ కవుల్ని వేదికపైకి ఆహ్వానించగా సలాది సాయి సత్యనారాయణ వందన సమర్పణ చేశారు.

**- డా. జోశ్యుల కృష్ణబాబు**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# గురజాడ అప్పారావు

21.09.1862 - 30.11.1915



'ముత్యాలసరాలు' కవిత్వంలోనూ 'కన్యాశుల్కం'తో నాటకరంగంలోనూ సంచలనం సృష్టించారు. మానవతా సందేశంతో నవకవిత్వానికి నాంది పలికారు. వాడుక భాష వ్యాప్తికోసం గిడుగుతో కలిసి పోరాడారు. ఇతివృత్తాలలోనూ, పాత్రల ఎంపికలోనూ నూతన సంప్రదాయాలను ప్రవేశపెట్టారు. మూఢనమ్మకాలను త్రోసిపుచ్చారు.

SAHITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.VJ/187/2017-19
Date of Posting : 1st &2nd of Every Month ▪ Date of Publication: 28.08.2019

# ప్రజాశక్తి బుక్ హౌస్ తాజా ప్రచురణలు

కందుకూరి వీరేశలింగం తన జీవితకాలంలో చేసిన అసాధారణ కృషి తెలుగుప్రజలను విశేషంగా ప్రభావితం చేసిన విషయం మీకు తెలిసిందే. ఆనాడు సమాజంలో పేరుకుపోయి ఉన్న మూఢత్వాన్ని, ఛాందసత్వాన్ని తన ఆధునిక భావాలతో చీల్చిచెండాడు. ఒకవైపు సంఘసంస్కరణ ఉద్యమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూనే మరోవైపు తన పదునైన కలంతో అద్భుతమైన రచనలు చేశాడు. వీరేశలింగం రచనలు ఏ కోణంలో చూసినా ఈనాటికీ విశేషమైన ప్రాసంగికతను కలిగి ఉన్నాయి. కందుకూరి మరణించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో మరోసారి కందుకూరి సంఘసంస్కరణ ఉద్యమాన్ని, వారి రచనలను ఈ తరానికి గుర్తుచేయడం అవసరమని భావించి కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సందర్భంగా ప్రజాశక్తి బుక్‌హౌస్ ఈ దిగువ తెలిపిన పుస్తకాలను ప్రచురించింది. విలువైన ఈ పుస్తకాలను ప్రస్థానం పాఠకులకు ప్రత్యేక రాయితీతో ప్రజాశక్తి బుక్‌హౌస్ అందిస్తుంది.



## కందుకూరి వీరేశలింగం రాజశేఖర చరిత్రము

తొలినవలగా ప్రాచుర్యం పొందిన కందుకూరి వీరేశలింగం నవల 'రాజశేఖర చరిత్ర'. తొలినవలగానే కాకుండా ఆనాటి సమాజాన్ని వాస్తవిక దృష్టితో రికార్డు చేసిన రచనగా కూడా గుర్తింపు పొందింది. తప్పనిసరిగా చదవవలసిన పుస్తకం.

పేజీలు : 184,
ధర : 140/-



## స్వీయచరిత్ర సంగ్రహము కందుకూరి వీరేశలింగం

కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్రను ప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు సంక్షిప్తీకరించారు. అత్యుత్తమ జీవిత చరిత్రల్లో ఈ పుస్తకం కూడా ఒకటి. కందుకూరి జీవితంలోని ప్రతి సంఘటనా ఉత్తేజం కలిగిస్తుంది. ఆధునిక వైతాళికుడి జీవితం విలువైన అనుభవాల సమాహారం.

పేజీలు : 192,
ధర : 150/-



## క్రాంతి ఖడ్గం కందుకూరి

పేజీలు : 56,
ధర : 35/-

ఈ పుస్తకాన్ని ఐద్వా మహిళా సంఘం ప్రచురించింది. కందుకూరి మహిళల సంక్షేమానికి ఎటువంటి కృషి చేశారో తెలియజేస్తూ, ఆయన సేవలను విభిన్న కోణాలలో విశ్లేషిస్తూ మహిళా ప్రముఖులు, రచయిత్రులు, కవయిత్రులు రాసిన వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

## సంఘసంస్కరణ దస్తూరి మన కందుకూరి



పేజీలు : 336,
ధర : 270/-

ప్రముఖ రచయిత, విమర్శకుడు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి సంపాదకత్వంలో వెలువడిన వ్యాస సంకలనం ఇది. ఇందులో సీనియర్ సాహిత్య వేత్తల వ్యాసాలతో పాటు సమకాలీన ప్రముఖ రచయితల వ్యాసాలు ఉన్నాయి. కందుకూరి జీవిత, సాహిత్యాల గురించి, ఈనాడు కందుకూరి ప్రాసంగికత గురించి ఆలోచింపచేసే వ్యాసాల సంకలనం.

## యుగపురుషుడు వీరేశలింగం



పేజీలు : 336,
ధర : 270/-

ప్రముఖ రచయిత, సామాజిక, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి సంపాదకత్వంలో పునర్ముద్రించిన అలనాటి విలువైన పుస్తకం ఇది. తెలికిచర్ల వెంకటరత్నం, దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆవుల సాంబశివరావు సంపాదకత్వంలో 'యుగపురుషుడు' పేరుతో స్మారక సంచికగా వెలువడింది. ఆనాటి పెద్దలు కందుకూరిని ఎలా చూశారో ఈ పుస్తకం చెబుతుంది.

## ప్రజాశక్తి బుక్ హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533

**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం.

If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059